


మా కలం - సామాన్యుడి బలం

# నంది పత్రిక

జాతీయ తెలుగు దిన పత్రిక

GSTIN 37AMRPM5719R1ZX

RNI-APTEL/2023/88162

ఎడిటర్: మహేష్ యాదవ్ | తెలంగాణ , ఆంధ్ర ప్రదేశ్ | సంపుటి : 4 | సంచిక : 173 | సోమవారం 29- 06 -2026 | పేజీలు : 12 | వెల-3 | No: KNL/3-77(D)/2026-2028


**ఆ సినిమా టైటిల్ కు అర్థం ఏమిటో పవన్ కల్యాణ్ ను అడగండి: కవిత**



# మహా నిర్లక్ష్యం

**చెరువులో అపార్టుమెంట్ నిర్మాణం**
**అడ్డుకోవడంలో విఫలమైన జీవీఎంసీ అధికారులు**
**సర్వేలో చెరువు**
**పోరంబోకుగా నిర్ధారణ**
**కోర్టు నుంచి ఇంజక్షన్ అర్డర్ తెచ్చుకున్న యజమాని**
**కౌంటర్ దాఖలు చేయడంలో తాత్సారం**

అక్రమార్కులకన్నుపడితే చాలు... చెరువులు, వాగులు, గెడ్డలు అన్యాక్రాంతమైపోవాల్సిందే. అడ్డుకోవాల్సిన రెవెన్యూ, జీవీఎంసీ టౌన్‌ప్లానింగ్ అధికారులు కనీసం పట్టించుకోవడం లేదు. దీంతో వారి పనితీరుపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పైగా కోర్టు ఉత్తర్వుల పేరుతో కబ్జాలవైపు కన్నెత్తి చూడడంలేదు.



## కేంద్రమంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌కు లేఖ రాసిన సీఎం చంద్రబాబు

**తోతాపురి మామిడి రైతులను ఆదుకోవాలని కేంద్రానికి సీఎం చంద్రబాబు లేఖ**
**అంతర్జాతీయ మార్కెట్ సమస్యలతో నిలిచిపోయిన మామిడి గుజ్జు ఎగుమతులు**
**భారీగా పడిపోయిన తోతాపురి ధరలు.. తీవ్రంగా నష్టపోతున్న రైతులు**
**మామిడి కొనుగోలుకు రూ. 281 కోట్లు కేటాయించాలని కేంద్రానికి వినతి**
**రైతుల కోసం ప్రత్యేక ధరల వ్యత్యాస చెల్లింపు పథకం అమలు చేయాలని విజ్ఞప్తి**



ఆంధ్రప్రదేశ్‌లో తోతాపురి మామిడి రైతులు ఎదుర్కొంటున్న తీవ్ర సంక్షోభంపై ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టి సారించారు. రైతులను ఆదుకునేందుకు తక్షణమే జోక్యం చేసుకోవాలని కోరుతూ కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌కు ఆయన లేఖ రాశారు. రాష్ట్రంలో రైతులు తీవ్ర నష్టాల్లో ఉన్నారని, కేంద్రం అండగా నిలవాల్సిన అవసరం ఉందని ఆయన నొక్కిచెప్పారు.

## అమరావతిలో ప్రజల తిరుగుబాటుతో వైసీపీ తోక ముడిచింది

**అమరావతిలో ప్రజా తిరుగుబాటుతో వైసీపీ వెనక్కి తగ్గిందన్న మంత్రి గొట్టిపాటి**
**వైసీపీ కుట్రలను మహిళలు, రైతులే అడ్డుకున్నారని వ్యాఖ్య**
**అధికారంలో ఉన్నప్పుడు మూడు రాజధానుల పేరుతో అభివృద్ధిని అడ్డుకున్నారని విమర్శ**



## సౌదీలో ఘోర ప్రమాదం..

### హెలికాప్టర్ కుప్పకూలి 14 మంది దుర్మరణం

**సౌదీ అరేబియాలో కుప్పకూలిన అరామ్కో హెలికాప్టర్**
**ప్రమాదంలో 14 మంది సౌదీ పౌరులు మృతి**
**రస్ తనూరా తీరంలో ఆదివారం ఉదయం ఈ ఘటన**
**ప్రమాద కారణాలపై సౌదీ ప్రభుత్వం దర్యాప్తునకు ఆదేశం**
**మృతుల కుటుంబాలకు ఇంధన మంత్రిత్వ శాఖ సంతాపం**

సౌదీ అరేబియాలో ఘోర హెలికాప్టర్ ప్రమాదం జరిగింది. ప్రభుత్వ రంగ దిగ్గజ చమురు సంస్థ సౌదీ అరామ్కోకు చెందిన



## అమరావతి ఉద్రిక్తతలు: అంబటి రాంబాబుపై కేసు...

**అమరావతి రాజధాని ప్రాంతంలో ఘర్షణల నేపథ్యంలో మూడు కేసులు నమోదు**
**వైసీపీ నేతలపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద కేసు**
**టీడీపీ నేతలపైనా కేసు నమోదు**
**వైసీపీ నేతలపై దాడిని ఖండించిన బొత్స**
**రాష్ట్రంలో జంగిల్ రాజ్ నడుస్తోందని ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు**



ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి ప్రాంతంలో శనివారం చోటుచేసుకున్న ఘర్షణలు, దాడులకు సంబంధించి పోలీసులు మూడు వేర్వేరు కేసులు నమోదు చేశారు. అధికార, ప్రతిపక్ష పార్టీల నేతలను నిందితులుగా చేర్చడంతో ఈ వ్యవహారం రాజకీయంగా మరింత వేడెక్కింది. భూసమీకరణను వ్యతిరేకిస్తున్న రైతులను పరామర్శించేందుకు వెళ్లిన వైసీపీ నేతల పర్యటన ఉద్రిక్తతలకు దారితీయడం తెలిసిందే. వివరాల్లోకి వెళితే, పెనుమక గ్రామానికి చెందిన మాణిక్యం అనే వ్యక్తి ఇచ్చిన ఫిర్యాదు మేరకు వైసీపీ నేతలపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ నిరోధక చట్టం కింద పోలీసులు కేసు నమోదు చేశారు. అదేవిధంగా, పోలీసు అధికారి విధులకు ఆటంకం కలిగించారనే ఆరోపణలతో తాడేపల్లి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ వీరేంద్ర

## పేద పిల్లలకు మంచి భోజనం పెడుతుంటే ఏడుపా?..

# ఇలా అయితే ఎలా జగన్ గారు?



**స్మార్ట్ కిచెన్లపై జగన్ ఆరోపణలను ఖండించిన మంత్రి లోకేశ్**
**ఉన్నవారి ఉపాధికి ఢోకా లేకుండానే అదనపు ఉద్యోగాలు కల్పిస్తున్నామని వెల్లడి**
**కుక్-కమ్-హెల్పర్ల వేతన బకాయిల ఆరోపణలు పూర్తిగా అవాస్తవమని స్పష్టీకరణ**
**పేద విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించడమే లక్ష్యమని వివరణ**
**పేదల సంక్షేమాన్ని చూసి జగన్ ఓర్వలేకపోతున్నారని విమర్శ**

## గాజాపై మోదీ సర్కార్ మౌనం.. సోనియా ఫైర్, బీజేపీ కౌంటర్



**గాజాపై మోదీ ప్రభుత్వం మౌనం వహించడంపై సోనియా గాంధీ విమర్శలు**
**ఇది నైతికంగా తప్పు, దేశ ప్రయోజనాలకు విరుద్ధం అని వ్యాఖ్య**
**సోనియా తప్పుడు సమాచారం వ్యాప్తి చేస్తున్నారన్న బీజేపీ**
**గాజా విషయంలో భారత్ స్పష్టమైన వైఖరితో ఉందన్న కమలం పార్టీ**
**బంగ్లాదేశ్‌లో హిందువులపై దాడులప్పుడు ఎందుకు మౌనంగా ఉన్నారని బీజేపీ ప్రశ్న**

## ముందు మీ చరిత్రేంటో చూసుకోండి...

### అఖిలేశ్ యాదవ్ కు సీఎం యోగి ఆదిత్యనాథ్ కౌంటర్

**అయోధ్యను అద్వితీయ పవిత్ర నగరంగా తీర్చిదిద్దుతామన్న అఖిలేశ్ యాదవ్**
**తీవ్రంగా స్పందించిన యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్**
**రామభక్తులపై కాల్పులు జరిపిన చరిత్ర మీదేనంటూ గత ఎస్పీ ప్రభుత్వంపై విమర్శలు**
**శ్మశానాల గోడలకు బదులు ఆలయాలకు నిధులు కేటాయిస్తున్నామని వ్యాఖ్య**
**అయోధ్యతో పాటు మధుర, శ్రీకృష్ణ జన్మభూమిపైనా మాట్లాడాలని సవాల్**

సమాజ్‌వాదీ పార్టీ (ఎస్పీ) అధినేత అఖిలేశ్ యాదవ్ అయోధ్యపై చేసిన వ్యాఖ్యలపై ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. రామభక్తులపై కాల్పులు జరిపిన చరిత్ర ఉన్న ఎస్పీ, అయోధ్యను పవిత్ర



## గాడిద, మేక పాలు తాగి అందరినీ ఆశ్చర్యపరిచిన ఆదోని ఎమ్మెల్యే!

**ఆదోనిలో ఎమ్మెల్యే పార్థసారథి వినూత్న పర్యటన**
**వీధిలో అమ్ముతున్న గాడిద పాలు కొని తాగిన వైనం**
**స్వయంగా మేక పాలు పితికి అక్కడే సేవించిన ఎమ్మెల్యే**
**మేక, గాడిద పాలు ఆరోగ్యానికి శ్రేష్టమన్న పార్థసారథి**



# అమరావతి ఉద్రిక్తతలు: అంబటి రాంబాబుపై కేసు...

బాబు ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా వైసీపీ నేత, మాజీ మంత్రి అంబటి రాంబాబుపై మరో కేసు పెట్టారు. మరోవైపు, తమ కార్ల అద్దాలను ధ్వంసం చేశారంటూ వైసీపీ నేత నారాయణ మూర్తి ఇచ్చిన ఫిర్యాదుతో టీడీపీ నేతలపైనా పోలీసులు కేసు నమోదు చేశారు.

**అసలేం జరిగింది?** బలవంతపు భూసేకరణకు వ్యతిరేకంగా కొన్ని రోజులుగా నిరసన తెలుపుతున్న రైతుల ఆహ్వానం మేరకే తమ పార్టీ నేతలు, సీఆర్‌డీఏ రైతుల పరిరక్షణ కమిటీ సభ్యులు శనివారం ఉండవల్లి, పెనుమక గ్రామాల్లో పర్యటించారని వైసీపీ వర్గాలు తెలిపాయి. భూములు ఇచ్చేందుకు నిరాకరిస్తున్న రైతులపై ఒత్తిడి తెస్తున్నారని, వారి పొలాల చుట్టూ మట్టి తవ్వేసి సాగు చేసుకోకుండా అడ్డుకుంటున్నారని వైసీపీ ఆరోపించింది. ఈ క్రమంలోనే టీడీపీ కార్యకర్తలు తమ నేతలు, రైతులపై రాళ్లు, కోడిగుడ్లతో దాడి చేశారని, పలు వాహనాలను ధ్వంసం చేశారని పేర్కొంది. ఈ ఘర్షణలో పరిస్థితిని అదుపు చేసే ప్రయత్నంలో కొంతమంది పోలీసు సిబ్బందికి కూడా గాయాలయ్యాయని ప్రతిపక్షం తెలిపింది.

**ప్రభుత్వంపై బొత్స ఫైర్**ఈ ఘటనపై శాసనమండలి ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ ఆదివారం విశాఖపట్నంలో తీవ్రంగా స్పందించారు. వైసీపీ నేతలపై జరిగిన దాడిని ఖండిస్తూ, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రజల మద్దతుతో కాకుండా పోలీసులతో ప్రభుత్వాన్ని నడుపుతున్నారని ఆయన ఆరోపించారు. "స్థానికుల ఆహ్వానం మేరకే మా పార్టీ ఎమ్మెల్సీలు, మాజీ మంత్రులు రైతుల కష్టాలు తెలుసుకునేందుకు పెనుమక వెళ్లారు. ఇది ప్రజాస్వామ్య ప్రక్రియ. వారు వెళ్తుండగా టీడీపీ గూండాలు కాన్వాయ్‌ను అడ్డుకుని దాడి చేశారు. భూములు ఇవ్వని రైతులను వేధిస్తున్నారనే ఆరోపణల్లో నిజం ఉండబట్టే వారు ఈ దాడికి పాల్పడ్డారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు క్షీణించాయి, జంగిల్ రాజ్ నడుస్తోంది" అని బొత్స విమర్శించారు.

# పేద పిల్లలకు మంచి భోజనం పెడుతుంటే ఏడుపా?.. ఇలా అయితే ఎలా జగన్ గారు?:

జగన్మోహన్ రెడ్డి చేస్తున్న ఆరోపణలపై రాష్ట్ర విద్యా, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ తీవ్రంగా స్పందించారు. స్మార్ట్ కిచెన్ల ద్వారా ఎవరి ఉపాధి పోదని, పైగా కొత్త ఉద్యోగాలు వస్తాయని స్పష్టం చేశారు. పేద విద్యార్థులకు రుచి, శుచితో కూడిన నాణ్యమైన భోజనం అందిస్తుంటే జగన్ ఓర్వలేకపోతున్నారని ఆయన విమర్శించారు. ఉపాధి కల్పనపై మాట్లాడుతూ.. "వైఎస్సార్ కడప జిల్లాలో పైలట్ ప్రాజెక్టుగా ఐదు స్మార్ట్ కిచెన్లు ప్రారంభించాం. వాటి పరిధిలోని 233 మంది కుక్-కమ్-హెల్పర్లు యథావిధిగా తమ విధుల్లో కొనసాగుతున్నారు. త్వరలో జిల్లాలో ఏర్పాటు చేయబోయే మరో 33 స్మార్ట్ కిచెన్ల వల్ల కూడా ఏ ఒక్కరి ఉపాధికీ నష్టం వాటిల్లదు. పైగా, ఈ కిచెన్ల నిర్వహణ ద్వారా స్వయంశక్తి సంఘాల మహిళలకు అదనంగా 38 మంది హెడ్ కుక్స్, 22 మంది అసిస్టెంట్ కుక్స్, 256 మంది హెల్పర్లు, సుమారు 76 మంది డ్రైవర్లకు ఉపాధి లభించబోతోంది. రాష్ట్రవ్యాప్తంగా వేలాది మందికి అదనపు ఉపాధి కల్పిస్తుంటే జగన్ ఎందుకు ఏడుస్తున్నారు? పేదలు బాగుపడటం ఆయనకు ఇష్టం లేదా?" అని లోకేశ్ ప్రశ్నించారు. వేతనాల బకాయిల ఆరోపణలను కూడా లోకేశ్ తోసిపుచ్చారు. "కడప జిల్లాలోని 3,450 మంది కుక్-కమ్-హెల్పర్లకు 2026 ఏప్రిల్ నెల వరకు జీతాలు పూర్తిగా చెల్లించాం. మే నెలలో పాఠశాలలకు వేసవి సెలవులు కావడంతో గౌరవ వేతనం చెల్లింపు ఉండదు. జూన్ నెల ఇంకా పూర్తి కాలేదు. మరి జగన్ ఎవరి బకాయిల గురించి ఫేక్ ఆరోపణలు చేశారో చెప్పాలి" అని ఆయన డిమాండ్ చేశారు. స్మార్ట్ కిచెన్ల ఏర్పాటుతో విద్యార్థులకు మరింత పరిశుభ్రమైన, నాణ్యమైన భోజనం అందించడమే ప్రభుత్వ లక్ష్యమని లోకేశ్ పునరుద్ఘాటించారు. "పేద పిల్లలకు మంచి భోజనం అందించడాన్ని, వారి ఆరోగ్యాన్ని కూడా సహించలేకపోతే ఎలా జగన్ గారు?" అంటూ మంత్రి లోకేశ్ చురకలంటించారు.

# గాజాపై మోదీ సర్కార్ మౌనం.. సోనియా ఫైర్, బీజేపీ కౌంటర్

గాజా పరిణామాలపై కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం అవలంబిస్తున్న వైఖరిని కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ అధ్యక్షురాలు సోనియా గాంధీ తీవ్రంగా తప్పుబట్టారు. ఇజ్రాయెల్ చర్యల పట్ల ప్రభుత్వం మౌనం వహించడం నైతికంగా సరికాదని, ఇది భారత దేశ ప్రయోజనాలకు విఘాతమని ఆమె అభిప్రాయపడ్డారు. సోనియా గాంధీ చేసిన ఈ విమర్శలను భారతీయ జనతా పార్టీ (బీజేపీ) తీవ్రంగా ఖండించింది.ఒక జాతీయ దినపత్రికలో రాసిన వ్యాసంలో సోనియా గాంధీ ఈ అభిప్రాయాలను వ్యక్తం చేశారు. పాలస్తీనా, ఇరాన్, పశ్చిమాసియా పరిణామాలపై భారత్ అనుసరిస్తున్న తీరుపై ఆమె ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వ వైఖరి వల్ల భారత్ తన సంప్రదాయ మిత్రదేశాలకు, అంతర్జాతీయ ప్రజాభిప్రాయానికి దూరమవుతోందని, ఇది పాకిస్థాన్ మధ్యవర్తిత్వం వహించేందుకు దారితీసే అవకాశం కల్పిస్తోందని ఆరోపించారు. రిటైర్డ్ జస్టిస్ మురళీధర్ నేతృత్వంలోని బృందం నివేదికను ప్రస్తావిస్తూ.. గాజాలో ఇప్పటివరకు 22,000 మందికి పైగా చిన్నారులు మరణించారని, దాదాపు 44,000 మంది తీవ్రంగా గాయపడ్డారని ఆమె గుర్తుచేశారు. సోనియా గాంధీ వ్యాఖ్యలపై బీజేపీ జాతీయ అధికార ప్రతినిధి షెహబాజ్ పూనావాలా ఘాటుగా స్పందించారు. సోనియా గాంధీ తప్పుడు సమాచారాన్ని వ్యాప్తి చేస్తున్నారని ఆయన మండిపడ్డారు. పాలస్తీనియన్ల హక్కుల గురించి ఆందోళన చెందుతున్న సోనియా, బంగ్లాదేశ్‌లో హిందువులపై దాడులు జరిగినప్పుడు ఎందుకు మౌనం వహించారని ప్రశ్నించారు. గాజా విషయంలో భారత్ తన వైఖరిని ఇప్పటికే స్పష్టం చేసిందని, అక్కడి బాధితులకు మానవతా సాయం కూడా అందించిందని పూనావాలా గుర్తుచేశారు. ఇజ్రాయెల్-పాలస్తీనా వివాదంపై భారత్ అనుసరిస్తున్న విదేశాంగ విధానంపై సాగుతున్న రాజకీయ వాగ్వాదానికి ఈ విమర్శలు ప్రతిబింబంగా నిలుస్తున్నాయి.

# గాడిద, మేక పాలు తాగి అందరినీ ఆశ్చర్యపరిచిన ఆదోని ఎమ్మెల్యే!

కర్నూలు జిల్లా ఆదోని బీజేపీ ఎమ్మెల్యే పార్థసారథి తన నియోజకవర్గ పర్యటనలో అందరినీ ఆశ్చర్యపరిచారు. ప్రజల సమస్యలు తెలుసుకునే కార్యక్రమంలో భాగంగా ఆయన వీధిలో విక్రయిస్తున్న గాడిద పాలు, మేక పాలు తాగి వార్తల్లో నిలిచారు.'ప్రజల కోసం మీ ఎమ్మెల్యే' పేరుతో పార్థసారథి పట్టణంలోని వివిధ కాలనీల్లో పర్యటిస్తున్నారు. ఈ క్రమంలో అరుణ్ జ్యోతి నగర్‌లో పర్యటిస్తుండగా, గాడిద పాలు అమ్ముతున్న ఒక వ్యక్తిని చూసి ఆప్యాయంగా పలకరించారు. అతని వ్యాపారం గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం అతని వద్ద గాడిద పాలను కొనుగోలు చేసి అక్కడికక్కడే తాగారు.ఆ తర్వాత మహాత్మా గాంధీ నగర్‌లో పర్యటిస్తున్నప్పుడు, మేకల కాపరి శివన్నను చూసి ఆయన వద్దకు వెళ్లారు. అతని జీవన పరిస్థితుల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం తానే స్వయంగా ఒక మేక పాలు పితికి తాగారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పార్థసారథి మాట్లాడుతూ.. "గాడిద, మేక పాలు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి. వీటిలో రోగనిరోధక శక్తిని పెంచే పోషకాలు అధికంగా ఉంటాయి. ఈ పాలు తాగితే శరీరంలోని అవయవాలు శుద్ధి అవుతాయని చెబుతున్నారు. ఇంటింటికీ తిరుగుతూ పాలు అమ్ముతూ జీవనోపాధి పొందుతున్న ఈ యువకుడిని అభినందిస్తున్నాను" అని అన్నారు. ప్రజా సమస్యలు తెలుసుకునే పర్యటనలో ఎమ్మెల్యే ఇలా సామాన్యులతో కలిసిపోవడం స్థానికంగా ఆసక్తిని రేకెత్తించింది.

## అమెరికాలో ఆకస్మిక వరదలు... ఏపీ యువకుడు గల్లంతు

అమెరికాలో జరిగిన ఓ దురదృష్టకర సంఘటనలో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన యువకుడు గల్లంతయ్యాడు. బాపట్ల జిల్లాకు చెందిన దొప్పలపూడి వెంకటేశ్, కాన్సాస్‌లో సంభవించిన ఆకస్మిక వరదల్లో కొట్టుకుపోయినట్లు అక్కడి నుంచి వస్తున్న సమాచారం ఆందోళన కలిగిస్తోంది.

వివరాల్లోకి వెళ్తే, బాపట్ల జిల్లా పరుచూరు మండలం దేవరపల్లి గ్రామానికి చెందిన దొప్పలపూడి రాంబాబు కుమారుడైన వెంకటేశ్, అమెరికాలోని నెబ్రాస్కా రాష్ట్రం ఒమాహాలో నివసిస్తున్నారు. కొద్ది రోజుల క్రితం కాన్సాస్‌లోని సమ్నర్ కౌంటీ వెల్లింగ్టన్ ప్రాంతంలో కారులో ప్రయాణిస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. భారీ వర్షాల కారణంగా ఎస్. ఆలివర్ రోడ్ సమీపంలో ఒక్కసారిగా వచ్చిన వరద ప్రవాహంలో అతడి కారు కొట్టుకుపోయింది. అప్పటి నుంచి వెంకటేశ్ ఆచూకీ లభించలేదు.

# ముందు మీ చరిత్రేంటో చూసుకోండి... అఖిలేశ్ యాదవ్ కు సీఎం యోగి ఆదిత్యనాథ్ కౌంటర్

నగరంగా ఎలా తీర్చిదిద్దుతుందని ఆయన ప్రశ్నించారు. హిందూ మత సంప్రదాయాలను వ్యతిరేకించడమే ఎస్పీ నైజమని, ఆ పార్టీకి ఆలయ నగరి అభివృద్ధిపై చిత్తశుద్ధి లేదని యోగి ఆరోపించారు.అయోధ్య విరాళాల్లో అవినీతిపై స్పందిస్తూ, తాము అధికారంలోకి వస్తే, ప్రపంచవ్యాప్తంగా ఉన్న భక్తులు అసలైన ఆధ్యాత్మికతను అనుభవించేలా అయోధ్యను అద్వితీయమైన, సాటిలేని పవిత్ర నగరంగా అభివృద్ధి చేస్తామని అఖిలేశ్ యాదవ్ శనివారం 'ఎక్స్' వేదికగా ఒక ప్రకటన చేశారు. ఈ నేపథ్యంలో, హత్రాస్‌లో రూ.548 కోట్ల విలువైన 143 అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేసిన అనంతరం యోగి మాట్లాడుతూ అఖిలేశ్ పై విమర్శలు గుప్పించారు. "నిన్న అఖిలేశ్ యాదవ్ ప్రకటన చూసి ఆశ్చర్యపోయాను. ఆయన ప్రభుత్వం వస్తే అయోధ్యను పవిత్ర నగరంగా చేస్తారట. మీరు ఏం పవిత్ర నగరం కడతారు? ముందు మీ చరిత్ర చూసుకోండి. రామభక్తులపై కాల్పులు జరిపించింది మీరే కదా?" అని యోగి నిలదీశారు.ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో, రామభక్తుల కృషి ఫలితంగా అయోధ్య నేడు తన పూర్వ వైభవాన్ని సంతరించుకుని 'త్రేతాయుగాన్ని' గుర్తుచేస్తోందని యోగి అన్నారు. ఈ అభివృద్ధిని చూసి ఇప్పుడు మీకు కూడా ఆశ కలుగుతోందని ఎద్దేవా చేశారు. గతంలో ఎస్పీ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు పోలీస్ స్టేషన్లు, జైళ్లలో కృష్ణాష్టమి వేడుకలను నిలిపివేసిందని, కన్వర్ యాత్రపై ఆంక్షలు విధించిందని యోగి ఆరోపించారు.తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పరిస్థితులు మారాయని యోగి తెలిపారు. "ఈ రోజు హత్రాస్‌లో 22కు పైగా ఆలయాలను సుందరీకరించామని మా ప్రతినిధులు చెబుతున్నారు. ఇది ఎస్పీ హయాంలో సాధ్యమయ్యేదా? అప్పుడు ఈ డబ్బు శ్మశాన వాటికల గోడల నిర్మాణానికి వెళ్లేది. మేము ఆ డబ్బును ఆలయాల అభివృద్ధి వైపు మళ్లించాం" అని ఆయన స్పష్టం చేశారు.అయోధ్యలో మార్పులను స్వయంగా చూసి తెలుసుకోవాలని, ఒక్కసారైనా రామ్‌లల్లాను దర్శించుకోవాలని ప్రతిపక్ష నేతలకు ఆయన సూచించారు. కేవలం అయోధ్యే కాకుండా, మధుర, బృందావనంపైనా అఖిలేశ్ తన వైఖరి స్పష్టం చేయాలని యోగి సవాల్ విసిరారు. "మీకు నిజంగా ఆధ్యాత్మికతపై నమ్మకం ఉంటే, మధుర, బృందావనం, శ్రీకృష్ణ జన్మభూమి గురించి బహిరంగంగా మాట్లాడండి. శ్రీకృష్ణుడి జన్మస్థలాన్ని కూడా గౌరవించాలి" అని అన్నారు. ముల్లాల, మౌల్వీల ముందు మోకరిల్లడం తప్ప సమాజ్‌వాదీ పార్టీకి మరో అభివృద్ధి ఎజెండా లేదని, అభివృద్ధిపై దుమ్ము చల్లే ప్రయత్నం చేయవద్దని యోగి తీవ్ర వ్యాఖ్యలు చేశారు. అయోధ్య, మధుర, కాశీ వంటి పుణ్యక్షేత్రాలలో యాత్రికుల సౌకర్యాలను మెరుగుపరచడానికి తమ ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని ఆయన వివరించారు.

# కవిఎవరివాడు?

ఒక కవి ఏ ప్రాంతానికి చెందినవాడనే ప్రశ్న తెలుగు సాహిత్య చరిత్రలో కొత్తది కాదు. బమ్మెర పోతన తెలంగాణవాడా కాదా? పాల్కురికి సోమన స్థానికత ఏంటి? వేములవాడ భీమకవి ఎక్కడివాడు? ఇలాంటి ప్రశ్నలు కేవలం చారిత్రక సందేహాలుగా మాత్రమే కనిపించవచ్చు. కానీ వాటి వెనుక ఉన్న మీమాంస మరింత విస్తృతమైంది. ఒక కవిని ఒక ప్రాంతానికి చెందినవాడిగా నిర్ణయించడానికి అసలు ఏ ప్రమాణాన్ని స్వీకరించాలి? సాధారణంగా జన్మస్థలం, నివాసం, భాష, వంశపారంపర్యం వంటి అంశాలను ఆధారంగా తీసుకుంటారు. అయితే ఈ ప్రమాణాలన్నీ ఎప్పుడూ ఒకే సమాధానాన్ని ఇవ్వవు. ఒక సందర్భంలో జన్మస్థలం ముఖ్యం అనిపిస్తే, మరో సందర్భంలో భాష ప్రాధాన్యం పొందుతుంది, ఇంకొకచోట సాహిత్యమే ప్రధాన ఆధారమవుతుంది. అందుకే కవి స్థానికత అనేది కేవలం సమాచారానికి సంబంధించిన అంశం కాదు. అది సాహిత్య చరిత్రను మనం ఎలా అర్థం చేసుకుంటున్నామన్న ప్రశ్నకి సంబంధించిన అంశం కూడా.కవులను సాహిత్య చరిత్రలు సహజంగానే ప్రాంతాల వారీగా విభజిస్తాయి. తెలంగాణ కవులు, ఆంధ్ర కవులు, రాయలసీమ కవులు అని వర్గీకరణలు చేస్తాయి. ఇది కొన్ని సందర్భాల్లో అవసరమే. ఎందుకంటే ఒక ప్రాంతపు సాంస్కృతిక చరిత్రను అర్థం చేసుకోవడానికి అక్కడి సాహిత్య సంపదను గుర్తించడం ముఖ్యం. అయితే ఈ అంశం ఇక్కడితో ఐపోలేదు. ఒక కవిని ఒక ప్రాంతానికి చేర్చడం అంటే కేవలం అతని వివరాలను నమోదు చేయడం కాదు. ఒక ప్రాంత చరిత్రలో అతనికి స్థానం కల్పించడం కూడా.అందువల్ల 'కవి ఎవరి వాడు?' అనే ప్రశ్నకు సమాధానం చెప్పే ముందు, ఆ ప్రశ్న ఎందుకు పుడుతోందో పరిశీలించాలి. ఎందుకంటే స్థానికత అనేది స్థిరంగా ఉండే వస్తువు కాదు. అది చరిత్ర, భాష, జ్ఞాపకం, సామాజిక అనుభవం, సాంస్కృతిక అనుబంధం వంటి అనేక అంశాల కలయిక. 'కవుల పుట్టుక, ఏరుల పుట్టుక ఎక్కడ జరుగుతుందో చెప్పలేం' అని ఒక నానుడి. ఇది కేవలం కవితాత్మకమైన వాక్యం అనుకుంటే దాని పరిమితి అంతే. కానీ ఈ పోలికను కొనసాగిస్తే అర్థం మరింత విస్తరిస్తుంది. ఒక నది ఎక్కడ పుట్టిందన్నదే కాదు, అది ఏ నేలల గుండా ప్రవహించిందన్నదీ అంతే ముఖ్యం. కవి విషయంలోనూ అంతే. అతడు ఎక్కడ జన్మించాడన్నది ఒక సమాచారం మాత్రమే. అతని సాహిత్యం ఏ నేలల జీవితంతో ముడిపడి ఉందన్నది కీలకం. అందుకే ఒక కవి స్థానికతను నిర్ణయించడంలో జన్మస్థలం ఒక్కటే ప్రమాణంగా సరిపోదు. పుట్టుక అనేది వ్యక్తి నిర్ణయం కాదు. కుటుంబ పరిస్థితులు, సామాజిక ఆచారాలు, యాదృచ్ఛిక సందర్భాలు పుట్టుక స్థలాన్ని నిర్ణయిస్తాయి. తెలుగు నాట తొలి ప్రసవం అమ్మమ్మగారింట్లోనే చేసే ఆచారముంది. అలాంటప్పుడు కేవలం జన్మస్థలం ఆధారంగా స్థానికతను ఎలా నిర్ణయిస్తాం.వేములవాడ భీమకవి విషయంలో ఇలాంటి వివాదాలే ఉన్నాయి. ఆయన ద్రాక్షారామానికి చెందినవాడని ఒక వాదన, వేములవాడ వాడేనని మరో వాదన.జన్మస్థలం కాకపోతే పోనీ నివాస స్థలాన్ని ప్రమాణంగా తీసుకోవచ్చు అనుకుందామా! కానీ ఆ ప్రమాణం కూడా పూర్తిగా సరైంది కాదు. ఎందుకంటే ఉద్యోగం, విద్య, జీవనావసరాలు మనుషులను ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి తీసుకెళ్తాయి. అయితే నివాసం మారినంత మాత్రాన వారివైన వైయక్తిక అనుభవాలు పూర్తిగా అంతర్ధానమైపోవు.కేశవరెడ్డి ఉదాహరణ ఇక్కడ ప్రస్తావనార్హం. ఆయన జీవితంలో గణనీయమైన భాగం తెలంగాణలో గడిచినప్పటికీ, ఆయన రచనల్లో ప్రధానంగా కనిపించేది రాయలసీమ జీవితమే. శరీరం ఒక చోట ఉండవచ్చు. కానీ సృజనాత్మక చైతన్యం మరో ప్రపంచంతో ముడిపడి ఉండవచ్చు. అప్పుడు స్థానికతను ఏ ఆధారంతో నిర్ణయించాలి? ఈ ప్రశ్న మనల్ని భాష వైపు తీసుకెళ్తుంది. భాషలో ప్రాంతపు జ్ఞాపకాలు ఉంటాయి. జీవన విధానాల ఆనవాళ్లు ఉంటాయి. సామాజిక సంబంధాల ముద్ర ఉంటుంది. రచయిత తన ప్రపంచాన్ని భాష ద్వారానే వ్యక్తపరుస్తాడు. అందుకే భాష స్థానికతను అర్థం చేసుకోవడానికి ఒక ముఖ్యమైన ఆధారం. అయితే అది కూడా అంతిమ ప్రమాణం కాదు. కోరుట్ల ప్రాంతానికి చెందిన కృష్ణమాచార్య జీవితాన్ని పరిశీలిస్తే సంస్కృతం, తెలుగు, తమిళ సంప్రదాయాల సంగమం కనిపిస్తుంది. ఆయన కుటుంబ చరిత్రలోనే ఈ సాంస్కృతిక కలయికకు ఆనవాళ్లు కనిపిస్తాయి. తమిళ భాష, శ్రీవైష్ణవ సంప్రదాయం పట్ల ఉన్న మక్కువతో ఆయన అన్నగారు కుటుంబ ఇంటిపేరైన 'సిరిసెనగండ్ల'ను 'సిరిశెనహాళ్'గా మార్చుకున్నారని తెలుస్తుంది. ఈ చిన్న మార్పు వెనుకనే భాష, సంప్రదాయం, సాంస్కృతిక అనుబంధాల సంక్లిష్ట స్వభావం దాగి ఉంది. ఒక వ్యక్తి తెలంగాణలో జన్మించి పెరిగినా, అతని సాంస్కృతిక దృష్టి మరో ప్రాంతపు భాషా సంప్రదాయాల వైపు విస్తరించి ఉండవచ్చు. అందువల్ల భాషను మాత్రమే ఆధారంగా చేసుకొని స్థానికతను నిర్ణయించడమూ సాధ్యం కాదు. ఎందుకంటే భాష అనేది కేవలం భౌగోళిక సరిహద్దులలో బంధించబడిన వ్యవస్థ కాదు. మతసంప్రదాయాలు, వలసలు, విద్యా కేంద్రాలు, సాహిత్య సంబంధాలు వంటి అనేక చారిత్రక ప్రక్రియల ద్వారా భాషలు పరస్పరం ప్రభావితం అవుతూంటాయి. కాబట్టి భాష స్థానికతను అర్థం చేసుకోవడానికి ఒక ముఖ్యమైన సూచిక అయినప్పటికీ, దానిని పూర్తిగా నిర్ణయించే అంతిమ ప్రమాణంగా స్వీకరించలేం. మరి ఈ ప్రమాణాలేవీ సరిపోనప్పుడు అసలు ఇంతగా స్థానికత గురించి మాట్లాడాల్సిన అవసరం ఏంటి? కవి తనను తాను ఒక ప్రాంతానికి పరిమితం చేసుకోవాలా? అనే ప్రశ్నలు ఎవరికైనా తలెత్తినపుడు, జాషువా కవిత్వం అందుకు ఆసక్తికరమైన సమాధానాన్ని ఇస్తుంది: "నిఖిల లోకమెట్లు నిర్ణయించిన నాకు తరుగులేదు విశ్వనరుడ నేను" అని చెప్పినప్పుడు ఆయన మనిషిని సంకుచిత గుర్తింపుల్లో బంధించే ప్రయత్నాలను ప్రశ్నిస్తున్నాడు. అయితే దీనిని స్థానికతను నిరాకరించడంగా అర్థం చేసుకోవడం సరైంది కాదు. జాషువా విశ్వనరుడే. కానీ ఆయన కవిత్వానికి ఒక నేల ఉంది. ఒక భాష ఉంది. ఒక సామాజిక అనుభవం ఉంది. ఒక దళిత జీవన వాస్తవికత ఉంది. ఆయన విశ్వజనీనత కూడా అక్కడి నుంచే పుట్టుకొచ్చింది. నిజానికి గొప్ప సాహిత్యం అంతా ఇలాగే ఏర్పడుతుంది. అది స్థానికతను విడిచిపెట్టి సార్వత్రికతను చేరదు. స్థానిక అనుభవాన్ని లోతుగా వ్యక్తీకరించడం ద్వారా సార్వత్రికతను అందుకుంటుంది.

ఈ నేపథ్యంలో రచయిత/కవి ఎవరివారో నిర్ణయించడానికి సాహిత్యాన్నే ప్రధాన ప్రమాణంగా తీసుకోవాల్సి వస్తుంది. ఎందుకంటే రచయిత తనకు తెలిసిన ప్రపంచాన్నే రాస్తాడు. అతని పాత్రలు, వారి భాష, వారి సంఘర్షణలు, వారి ఆశలు, వారి చరిత్ర ఇవన్నీ కలిసి ఒక సామాజిక ప్రపంచాన్ని నిర్మిస్తాయి. ఆ ప్రపంచమే రచయితకు సంబంధించిన అత్యంత విశ్వసనీయమైన ఆధారం.

# మహా నిర్లక్ష్యం

గతంలో బక్కన్నపాలెంలోని ప్రభుత్వభూమిని ఆక్రమించి అపార్టుమెంట్ నిర్మించగా, తాజాగా పరదేశిపాలెం చెరువులో అపార్టుమెంటు నిర్మితమవుతోంది. మరోచోట పట్టా భూమిలో నిర్మాణానికి అనుమతి తెచ్చుకుని చెరువులో పనులు చేపట్టినా అధికారులు అడ్డుచెప్పకపోవడం చర్చనీయాంశంగా మారింది. జీవీఎంసీ మధురవాడ జోన్ ఐదోవార్డు పరిధి పరదేశిపాలెం సర్వేనంబరు 21లో 16.3 ఎకరాల ప్రభుత్వభూమి ఉంది. రెవెన్యూ విలేజ్ రికార్డుల్లో ఇది చెరువు పోరంబోకుగా నమోదైవుంది. ఆ భూమిలోని కొంతభాగంలో చాలాకాలం కిందట జేఎన్ఎన్‌యూఆర్ఎం ఇళ్లు నిర్మించగా, మరికొంతభూమిలో హుద్‌హుద్ ఇళ్ల నిర్మాణం జరుగుతోంది. మిగిలిన భూమి ప్రస్తుతం జీవీఎంసీ ఆధీనంలో ఉంది. ప్రభుత్వ అవసరాలకు వినియోగించాల్సిన ఆభూమిపై కొందరు కబ్జాదారులు కన్నేశారు. అధికారులను ప్రసన్నంచేసుకుని రికార్డులు ట్యాంపరింగ్ చేసి, మరోచోట ఉన్న సర్వేనంబర్లతో అనుమతులు తెచ్చుకుని చెరువులో నిర్మాణాలు చేపట్టారు. తాజాగా సర్వేనంబరు 21కి సమీపంలో ఉన్న సర్వేనంబరు 9/1పీలోని పట్టానంబరు 145లో 220 గజాల భూమిలో జీ+2 భవన నిర్మాణం కోసం గత ఏడాది జూన్‌లో యజమానికి జీవీఎంసీకి దరఖాస్తుచేసుకున్నారు. పరిశీలించి ప్లాన్ జారీ చేయాల్సిన అధికారులు పెండింగ్‌లో ఉంచేశారు. దీంతో ఆఫైల్ డీమ్డ్ అప్రూవల్ అయింది. దీనిని ఆసరాగా చేసుకుని భవన నిర్మాణ పనులు ప్రారంభించారు. చెరువుపోరంబోకులో అపార్టుమెంట్ నిర్మిస్తుండడంతో స్థానికులు జీవీఎంసీ అధికారులకు ఫిర్యాదుచేశారు. వారు స్పందించి డీమ్డ్ అప్రూవ్ అయిన ఫైల్‌ను ఆర్‌టీఎస్ ద్వారా వెనక్కితెచ్చారు. తర్వాత ఆఫైల్‌పై రిమార్కులు రాసేందుకు సర్వేకు ఆదేశించారు. మధురవాడ జోన్ టౌన్‌సర్వేయర్ సర్వేచేసి ప్లాన్‌కోసం దరఖాస్తులో చూపించిన స్థలం, నిర్మాణం జరుగుతున్న స్థలం ఒకటి కాదని, చెరువులో భవనాన్ని నిర్మిస్తున్నారని ఉన్నతాధికారులకు నివేదిక ఇచ్చారు. దీంతో ఆ భవనానికి జారీచేసిన ప్లాన్‌ను రద్దుచేయాలని అధికారులు సిఫారసు చేసినప్పటికీ అప్పటికే తాత్సారం జరగడంతో ఆఫైల్ మళ్లీ డీమ్డ్ అప్రూవల్ అయిపోయింది. దీంతో నిర్మాణ పనులు ఆపేయాలని టౌన్‌ప్లానింగ్ అధికారులు ఆదేశించగా భవన నిర్మాణదారుడు కోర్టును ఆశ్రయించాడు. కోర్టు ఇంజక్షన్ ఆర్డర్ ఇచ్చింది. ఆతరువాత అతడు నిర్మాణం కొనసాగిస్తుండడంతో అధికారులకు మళ్లీ ఫిర్యాదు అందింది. అయితే కోర్టు ఉత్తర్వులు ఉన్నందున జోక్యంచేసుకోలేమని వారు తేల్చేశారు. దీంతో నిర్మాణపనులు జోరుగా సాగుతున్నాయి.

**కౌంటర్ దాఖలులో నిర్లక్ష్యం** ప్రభుత్వభూమి, అందునా చెరువులో నిర్మాణాలను ఉపేక్షించరాదని తెలిసినప్పటికీ, అధికారులు కోర్టులో కౌంటర్‌దాఖలు చేయకపోవడంపై ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. పైగా ఒకచోట ప్లాన్‌కు అనుమతి తీసుకుని చెరువులో నిర్మిస్తున్నారని టౌన్‌సర్వేయర్ నిర్ధారించినప్పటికీ ఆ విషయాన్ని కోర్టుకు ఎందుకు నివేదించడం లేదని ప్రశ్నిస్తున్నారు. నిర్మాణం పూర్తిచేసిన తరువాత అందులో ఎవరైనా నివసిస్తే చర్యలు తీసుకోవడానికి అవకాశం ఉండదు కాబట్టి, అంతవరకు నిర్మాణదారుడికి సహకరిస్తున్నారని కొందరు ఆరోపిస్తున్నారు. మధురవాడ జోన్‌లో ప్రభుత్వ భూములు, పార్కులను కబ్జా చేసి నిర్మాణాలు సాధారణంగా మారిపోయిందని, అక్కడ టౌన్‌ప్లానింగ్‌లో పనిచేసే ఓ అధికారి వైఖరే దీనికి కారమణమనే విమర్శలు వినిపిస్తున్నాయి.

# కేంద్రమంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌కు లేఖ రాసిన సీఎం చంద్రబాబు

అంతర్జాతీయంగా నెలకొన్న ప్రతికూల మార్కెట్ పరిస్థితుల కారణంగా మామిడి గుజ్జు (పల్ప్) ఎగుమతులు పూర్తిగా నిలిచిపోయాయని చంద్రబాబు తన లేఖలో వివరించారు. దీని ప్రత్యక్ష ప్రభావంతో స్థానిక మార్కెట్లలో తోతాపురి మామిడి ధరలు ఒక్కసారిగా కుప్పకూలాయని, దీంతో రైతులు పెట్టిన పెట్టుబడి కూడా రాక తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ క్లిష్ట పరిస్థితుల్లో రైతులను ఆదుకునేందుకు కేంద్ర ప్రభుత్వం తక్షణమే సహాయం అందించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో సుమారు 7.03 లక్షల మెట్రిక్ టన్నుల తోతాపురి మామిడిని రైతుల నుంచి సేకరించేందుకు రూ. 281 కోట్లు ఆర్థిక సహాయంగా మంజూరు చేయాలని కోరారు. దీంతో పాటు, మార్కెట్ ధరకు, గిట్టుబాటు ధరకు మధ్య ఉన్న వ్యత్యాసాన్ని భర్తీ చేసేలా ప్రత్యేకంగా 'ధరల వ్యత్యాస చెల్లింపు పథకం' (ౄతీఱషవ ణవటఱషఱవఅషవ్ఎూఋఎవత్ ాౕష్ట్రవవవ) అమలు చేయాలని సూచించారు.

# అమరావతిలో ప్రజల తిరుగుబాటుతో వైసీపీ తోక ముడిచింది

శనివారం నాడు అమరావతిలో జరిగిన ప్రజా తిరుగుబాటుతో వైసీపీ అల్లరి మూకలు తోక ముడిచాయని, వారి కుట్ర రాజకీయాలను స్థానిక మహిళలు, రైతులే సమర్థంగా తిప్పికొట్టారని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. కుట్రల ముసుగులో మరోసారి ప్రజలను మోసం చేయాలని ప్రయత్నించిన వైసీపీ నేతలను అమరావతి వాసులు గట్టిగా నిలదీసి వెనక్కి పంపారని ఆయన పేర్కొన్నారు. రాజకీయాల పేరుతో నేరాలకు పాల్పడే వారిని ప్రభుత్వం ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోదని, ఈ విషయంలో ప్రభుత్వం, ప్రజలు ఒకే స్పష్టతతో ఉన్నారనడానికి అమరావతి ఘటనే నిదర్శనమని వ్యాఖ్యానించారు.గత ఐదేళ్ల పాలనలో మూడు రాజధానుల పేరుతో కాలయాపన చేసిన వైసీపీ ప్రభుత్వం, ఏ ఒక్క ప్రాంతంలోనూ గుప్పెడు మట్టి కూడా వేయలేదని మంత్రి గొట్టిపాటి విమర్శించారు. తమ విధ్వంసకర విధానాలతో అమరావతితో పాటు యావత్ రాష్ట్ర అభివృద్ధిని కుంటుపరిచారని తీవ్ర ఆరోపణలు చేశారు. అధికారం కోల్పోయిన తర్వాత కూడా వైసీపీ నాయకత్వం తన వైఖరి మార్చుకోలేదని, ప్రజల్లో గందరగోళం సృష్టించేందుకు రోజుకో కొత్త నాటకానికి తెరలేపుతోందని అన్నారు. ఏ అంశంపైనా స్థిరమైన వైఖరి లేకుండా కేవలం ప్రజలను మభ్యపెట్టడమే ఆ పార్టీ ఏకైక లక్ష్యంగా మారిందని దుయ్యబట్టారు. వైసీపీ ఇదే ధోరణిని కొనసాగిస్తే, ప్రజల్లో ఆ పార్టీకి మిగిలిన కొద్దిపాటి విశ్వాసం కూడా పూర్తిగా ఆవిరైపోతుందని మంత్రి గొట్టిపాటి హెచ్చరించారు. అమరావతిలో మహిళలు, రైతులు వ్యక్తం చేసిన నిరసన ప్రజల మనోభావాలకు అద్దం పట్టిందన్నారు. తమ ప్రభుత్వం అభివృద్ధి, శాంతిభద్రతల పరిరక్షణకే ప్రథమ ప్రాధాన్యత ఇస్తుందని స్పష్టం చేశారు. ప్రజాస్వామ్యాన్ని అడ్డుపెట్టుకుని రాష్ట్రంలో అల్లర్లు సృష్టించాలని చూస్తే కఠిన చర్యలు తప్పవని, అలాంటి ప్రయత్నాలను ఎట్టిపరిస్థితుల్లోనూ సహించబోమని ఆయన తేల్చిచెప్పారు. ప్రజల ప్రయోజనాలే తమకు ముఖ్యమని, ఆ దిశగానే ప్రభుత్వ పాలన సాగుతుందని మంత్రి వివరించారు.

# సౌదీలో ఘోర ప్రమాదం..

హెలికాప్టర్ కుప్పకూలడంతో అందులో ప్రయాణిస్తున్న 14 మంది అక్కడికక్కడే మృతి చెందారు. మృతులంతా సౌదీ జాతీయులేనని సౌదీ ప్రభుత్వ వార్తా సంస్థ వెల్లడించింది.సౌదీ తూర్పు తీరంలోని రస్ తనూరా ప్రాంతంలో ఆదివారం ఉదయం 6 గంటల సమయంలో ఈ దుర్ఘటన చోటుచేసుకుంది. ఈ విషయాన్ని ఇంధన మంత్రిత్వ శాఖ అధికారి ఒకరు ధ్రువీకరించినట్లు సౌదీ ప్రెస్ ఏజెన్సీ తన కథనంలో పేర్కొంది. ప్రమాదంపై సౌదీ ప్రభుత్వం ఉన్నత స్థాయి దర్యాప్తునకు ఆదేశించింది. అయితే, ప్రమాదానికి గల కచ్చితమైన కారణాలు ఇంకా తెలియరాలేదు. ఈ ఘటనపై సౌదీ అరామ్కో సంస్థ ఇప్పటివరకు అధికారికంగా స్పందించలేదు. రస్ తనూరా ప్రాంతం సౌదీ ఇంధన రంగానికి అత్యంత కీలకం. ప్రపంచంలోనే అతిపెద్ద చమురు ఎగుమతి టెర్మినల్స్‌లో ఒకటి ఇక్కడే ఉంది. ప్రాంతీయ ఉద్రిక్తతల కారణంగా దాదాపు నాలుగు నెలల పాటు నిలిచిపోయిన కార్యకలాపాలు శుక్రవారమే ఇక్కడ తిరిగి ప్రారంభమయ్యాయి. ఈ నేపథ్యంలో తాజా ప్రమాదం జరగడం గమనార్హం. మృతుల కుటుంబాలకు ఇంధన మంత్రిత్వ శాఖ ప్రగాఢ సంతాపం తెలియజేసింది. దర్యాప్తు పూర్తయితే ప్రమాదానికి సంబంధించిన మరిన్ని వివరాలు వెల్లడయ్యే అవకాశం ఉంది.

## పారిస్‌లో రాజమౌళికి అరుదైన గౌరవం

తెలుగు సినిమా ఖ్యాతిని ప్రపంచానికి చాటిచెప్పిన దర్శకధీరుడు ఎస్ఎస్ రాజమౌళి తన ఖాతాలో మరో ప్రతిష్ఠాత్మక గౌరవాన్ని వేశారు. ఫ్రాన్స్ రాజధాని పారిస్‌లోని ప్రఖ్యాత 'సినెమాథెక్ ఫ్రాన్సైస్'లో ఆయనకు అరుదైన గౌరవం దక్కింది. ఈ సంస్థలో ఆయనకు ప్రత్యేక స్థానం కల్పిస్తూ సత్కరించారు. ఈ చారిత్రక ఫిల్మ్ ఇన్‌స్టిట్యూషన్‌లో రాజమౌళి చిత్రాలను కూడా ప్రదర్శించారు. ఈ సందర్భంగా రాజమౌళి తన ఆనందాన్ని పంచుకుంటూ ఉద్వేగానికి లోనయ్యారు. "పారిస్‌లో నా చిత్రాలను ప్రదర్శించడం, నన్ను ఇక్కడికి ఆహ్వానించడం గొప్ప గౌరవంగా భావిస్తున్నాను. కానీ, ఇది నేను అస్సలు ఊహించని ఒక మధురమైన ఆశ్చర్యం. ఈ అనుభూతిని మాటల్లో పూర్తిగా వర్ణించలేను" అని అన్నారు.

# విద్యార్థినిలకు రక్షణ కల్పించారా...

**బీసీ బాలికల కళాశాల వసతి గృహానికి సొంత భవనం ఏర్పాటు చేయాలి...**

**రెవల్యూషనరీ స్టూడెంట్స్ ఫోరమ్ (ఆర్ఎస్ఎఫ్) రాష్ట్ర అధ్యక్షులు డి.యం.ఓబులేసు యాదవ్ డిమాండ్**

బీసీ బాలికల కళాశాల వసతి గృహానికి సొంత భవనాని తక్షణమే ఏర్పాటు చేయాలని రెవల్యూషనరీ స్టూడెంట్స్ ఫోరమ్ (ఆర్ఎస్ఎఫ్) రాష్ట్ర అధ్యక్షులు డి.యం.ఓబులేసు యాదవ్ డిమాండ్ చేశారు రెవల్యూషనరీ స్టూడెంట్స్ ఫోరమ్ (ఆర్ఎస్ఎఫ్) జిల్లా కమిటీ బృందం కో-ఆపరేటివ్ కాలనీ లోని ప్రైవేట్ భవనంలో ఉన్న బీసీ బాలికల కళాశాల హాస్టల్ ను సందర్శించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కడప జిల్లా కేంద్రం నడిబొడ్డున ఉన్న బీసీ బాలికల కళాశాల వసతి గృహానికి పక్క బిల్డింగ్ లేకపోవడం బాధాకరమన్నారు రాయలసీమ జిల్లాలోని విద్యార్థినిలు ప్రధానంగా గ్రామీణ ప్రాంతాల బడుగు బలహీన వర్గాల విద్యార్థులలో చదువు కోసం కడప నగరంలోని వివిధ కళాశాలలో చదవడానికి వస్తున్నారని ఈ తరుణంలో వారికి అన్ని రకాల సౌకర్యాలు కల్పించే అంత బిసి వసతి గృహం లేకపోవడం ఏమిటని వారు ప్రశ్నించారు అనేక సంవత్సరాలుగా ప్రైవేట్ బిల్డింగ్ లోనే ఈ వసతి గృహం కొనసాగుతుందన్నారు కనీస వసతులు కూడా లేకుండా బాత్రూమ్స్ గాని గదులుగాని సరిపడ్డవు లేక విద్యార్థులలో తీవ్రమైన ఇబ్బందులు పడుతున్నారని వారు తెలిపారు.



వర్షం పడితే ఆ రాత్రుల్లో విద్యార్థినిలు శివరాత్రి జాగారం చేయాల్సిన పరిస్థితి ఏర్పడుతుందన్నారు 150నుంచి 200 మంది విద్యార్థినిలు ప్రతి సంవత్సరం హాస్టల్లో చేరతారని వారికి కనీస సౌకర్యాలు కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వానికి లేదా అని ప్రశ్నించారు ఇంటర్, డిగ్రీ, నర్సింగ్, పీజీ, బీఈడీ తదితర చదువుల కోసం వస్తున్న విద్యార్థినులకు తక్షణమే పక్కా వసతి గృహాన్ని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు లేని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు ఈ కార్యక్రమంలో ఆర్ఎస్ఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి పి రెడ్డి సాయి,జిల్లా ఉపాధ్యక్షులు బాల సుందరం, ప్రకాష్, విద్యార్థినిలు పాల్గొన్నారు

# త్యాగానికి ప్రతిరూపం మొహరం ఉత్సవం...

**వైసిపి ఎ స్ ఈ సి సభ్యులు సత్య సాయినాథ్ శర్మ...**

**వెల్లటూరులో సాయినాథ్ శర్మ ఘన స్వాగతశీ**

**జగనన్నను సీఎం చేయడానికి మొహరం దేవుళ్ళను ప్రార్థించాలి.**



**నంది ప్రతినిధి, జూన్ 28, వైయస్సార్ కడప జిల్లా.** త్యాగానికి ప్రతిరూపం మొహరం ఉత్సవం అని వైసిపి ఎ స్ ఈ సి సభ్యుడు కాశీభట్ల సాయినాథ శర్మ అన్నారు. కమలాపురం నియోజకవర్గం, పెండ్లిమర్రి మండలం, వెల్లటూరు గ్రామంలో సాయంత్రం గ్రామస్తుల ఆత్మీయ ఆహ్వానమేరకు. సాయినాథ్ శర్మ మొహరం ఉత్సవాలలో ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. సత్య సాయి నాథ శర్మ గ్రామానికి రాగానే గ్రామ మైనారిటీ నాయకుడు బాబు, ఇతర మైనారిటీ నాయకులు, సాయినాథ్ శర్మ అభిమానులు, వైసిపి నాయకులు ఆధ్వర్యంలో కార్యకర్తలు బాణాసంచా పేల్చుతూ మంగళ వాయిద్యాలు , భాజా భజంత్రీలతో ఘన స్వాగతం పలికారు. సాయినాథ్ శర్మ మాట్లాడుతూ మహమ్మద్ ప్రవక్త నుంచి బోధనలను తప్పుదారి పట్టించి దుర్మార్గులను ఎదుర్కొనందుకు హసన్ హుస్సేనులు చేసిన ప్రాణ త్యాగానికి ప్రతి రూపమే మొహరం ఉత్సవాన్ని ఆయన పేర్కొన్నారు. గ్రామంలో హిందూ ముస్లింలు సమైక్యంగా మొహరం ఉత్సవాలను నిర్వహించడం చాలా శుభ పరిణామన్నారు. మొహరం దేవుళ్ళ ఆశీస్సులతో రాష్ట్రంలో జగన్మోహన్రెడ్డి మరలా ముఖ్యమంత్రి కావడానికి ప్రతి జగనన్న అభిమాని అభిమాని మొహరం దేవుళ్ళ ను ప్రార్థించాలని కోరారు. రాష్ట్రంలో ప్రజల కోసం శుభ పరిపాలన, ప్రజా పాలన, జగన్మోహన్ రెడ్డి తోని సాధ్యమని ఆయన పాలన కోసం అందరూ సమైక్యంగా ప్రార్థించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పెల్లి మరి నాయకులు మాధవరెడ్డికి బాలకృష్ణారెడ్డి, పద్మాకర్ రెడ్డి, వెంకట్ రెడ్డి, మల్లికార్జున, బీసీ నాయకుడు సాంబ గంగయ్య, సిద్ధారెడ్డి, బి సుబ్బరాయుడు, నంద్యాల సుబ్బరాయుడు, సుబ్బారెడ్డి, గంగయ్య, వైసిపి కార్యకర్తలు, ప్రజలు, అభిమానులు, తదితరులు పాల్గొన్నారు

# ఖాజీపేట మండలంలో పల్స్ పోలియో కార్యక్రమం విజయవంతం...



డాక్టర్ శ్రీదేవి

**కడప నంది పత్రిక ప్రతినిధి ఖాజీపేట :** మండలం పరిధిలోని 17 సచివాలయం కేంద్రంలో జాతీయ పల్స్ పోలియో కార్యక్రమం అత్యంత ఉత్సాహభరితంగా, విజయవంతంగా నిర్వహించబడింది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మరియు వైద్య ఆరోగ్య శాఖ పిలుపు మేరకు మండల వ్యాప్తంగా ఉన్న 0 నుండి 5 సంవత్సరాల లోపు చిన్నారులందరికీ పోలియో రహిత భారతదేశాన్ని అందించేందుకు లక్ష్యంగా ఈ మహత్తర కార్యక్రమాన్ని చేపట్టారు. ఖాజీపేట మీదుతురు చెన్నాముక్కపల్లి లోని స్థానిక పోలియో కేంద్రంలో (ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో) డాక్టర్ శ్రీదేవి స్వయంగా పాల్గొని, చిన్నారులకు నోటి ద్వారా రెండు చుక్కల పోలియో వ్యాక్సిన్ వేసి బూత్ స్థాయి కార్యక్రమాన్ని అధికారికంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ శ్రీదేవి మాట్లాడుతూ, "భారతదేశాన్ని పూర్తిగా పోలియో రహితంగా ఉంచడంలో పల్స్ పోలియో కార్యక్రమం కీలక పాత్ర పోషిస్తోంది. గత కొన్నేళ్లుగా దేశంలో కొత్త కేసులు నమోదు కాకపోయినప్పటికీ, పొరుగు దేశాల నుంచి వ్యాధి సంక్రమించే ప్రమాదం ఉన్నందున నిరంతర అప్రమత్తత అవసరం. అందరూ తమ పిల్లలకు తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలి" అని తెలిపారు. ఖాజీపేట మండల పరిధిలో ఏ ఒక్క చిన్నారి కూడా ఈ వ్యాక్సినేషన్‌కు దూరం కాకూడదనే ఉద్దేశంతో వైద్య ఆరోగ్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ టీచర్లు సమన్వయంతో ముందస్తుగా విస్తృత ప్రచారం నిర్వహించారు. గ్రామంలోని చెన్నాముక్కపల్లి బ్రికలైన్స్ , వలస కూలీల నివాసాలు, ఇటుక బట్టీల వద్ద ఉన్న చిన్నారులపై ప్రత్యేక శ్రద్ధ పెట్టినట్లు అధికారులు తెలిపారు. టీకాలు వేసే సమయంలో వ్యాక్సిన్ యొక్క నాణ్యతను కాపాడటానికి శీతలీకరణ (కోల్డ్ చైన్ మెయింటెనెన్స్) విధానాన్ని పక్కాగా అమలు చేశారు. అదేవిధంగా బూత్ స్థాయిలో నిర్లక్ష్యానికి గురికాకపోయిన లేదా మిగిలిపోయిన చిన్నారులను గుర్తించేందుకు సోమ, మంగళవారాల్లో (జూన్ 29, 30 తేదీల్లో) ఆరోగ్య సిబ్బంది ఇంటింటికీ తిరిగి "హౌస్-టు-హౌస్" సర్వే నిర్వహించనున్నట్లు డాక్టర్ శ్రీదేవి తెలిపారు. ఇంట్లో ఉన్న ఐదేళ్లలోపు పిల్లలందరికీ పోలియో చుక్కలు వేయాలని, సదరు ఇళ్లకు ప్ర' (ప్రొటెక్టెడ్) మార్కింగ్, ఇంట్లో పిల్లలు మిగిలి ఉంటే 'శ' మార్కింగ్ చేసి తదుపరి రోజుల్లో వారికి తప్పనిసరిగా చుక్కలు వేయనున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో డాక్టర శ్రీదేవి తో పాటు స్థానిక ఆరోగ్య విస్తరణ అధికార్లు బి. నాగభూషణం పెంచాలిరెడ్డి, సూపర్ విసర్స్ శోభన్ బాబు, కృష్ణ ప్రియా సిబ్బంది, హెల్త్ అసిస్టెంట్,

విజయభాస్కర్, , జి. ఉమా కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్,ఫార్మసీ ఆఫీసర్ కేశవయ్య ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు మరియు పెద్ద సంఖ్యలో తల్లులు తమ చిన్నారులతో కలిసి పాల్గొన్నారు. పల్స్ పోలియో డ్రైవ్‌ను విజయవంతం చేసినందుకు ఖాజీపేట గ్రామ ప్రజలకు, ఆరోగ్య సిబ్బందికి వైద్య ఆరోగ్య శాఖ తరపున అధికారులు ధన్యవాదాలు తెలిపారు.

# అర్హత ఉండి పీఎం కిసాన్ డబ్బులు జమ కానీ రైతులకు న్యాయం చేయండి.- ఏవి.రమణ.



కడప జిల్లాలో ఈ సంవత్సరం అర్హత ఉండి పీఎం కిసాన్ డబ్బులు జమాకాని రైతులకు కేంద్ర ప్రభుత్వం వెంటనే పిఎం కిసాన్ డబ్బులు జమ చేయాలని రైతు సేవా సమితి కడప జిల్లా అధ్యక్షుడు ఏవి.రమణ అన్నారు. ఈరోజు దువ్వూరు మండల రెవెన్యూ కార్యాలయం ఆవరణలో రైతు సేవా సమితి మైదుకూరు నియోజకవర్గ కార్యదర్శి మాడిశెట్టి సహదేవుడు, సమితి దువ్వూరు మండల అధ్యక్ష కార్యదర్శులు అర్జాకుల కృష్ణయ్య, కటారు రాఘవేంద్ర , సమితి మైదుకూరు మండల అధ్యక్షుడు కుర్రాకు ఎల్లయ్యతో కలిసి మీడియా మిత్రుల ద్వారా కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ సందర్భముగా రమణ మాట్లాడుతూ ఈ సంవత్సరం చాలా మంది రైతులకు అర్హత ఉండి పీఎం కిసాన్ డబ్బులు జమ కాలేదని కేంద్ర ప్రభుత్వం వెంటనే విచారణ చేసి అర్హత ఉన్న ప్రతి రైతుకు పిఎం కిసాన్ డబ్బులు జమ చేయాలని కేంద్ర ప్రభుత్వం స్పందించకపోతే కడప జిల్లా రైతు సేవా సమితి ఆధ్వర్యంలో బాధిత రైతులతో కలిసి దశల వారి ఆందోళన నిర్వహిస్తుందని ఏవి.రమణ తెలియజేశారు. విప్లవాభి వందనాలతో రైతు సేవా సమితి.

# సిమెంట్ రోడ్లను ప్రారంభించిన ఎ మైల్యే బుడ్డా





**బండిఆత్మకూరు నంది పత్రిక జూన్ 28:** బండి ఆత్మకూరు మండల పరిధిలో ఉన్న పార్నపల్లి గ్రామంలో నిర్మించిన సిమెంటు రోడ్లను శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి ఆదివారం ప్రారంభించారు. గ్రామంలో ఆంజనేయస్వామి గుడి దగ్గర నుండి గంగమ్మ గుడి వరకు, ఎస్ సి,,బీసీ కాలనీలో 50 లక్షల రూపాయలతో నిర్మించిన సిమెంటు రోడ్లను ఎమ్మెల్యే ప్రారంభించారు. ప్రారంభోత్సవ నిర్మాణానికి విచ్చేసిన ఎమ్మెల్యే బుడ్డాకు గ్రామ నాయకులు ఘన స్వాగతం పలికారు.

**బిఎల్ ఏలతో సమావేశం** సీసీ రోడ్ల ప్రారంభోత్సవం అనంతరం గ్రామంలో టిటిడి కళ్యాణ మండపం లో నిర్వహించిన బూతు లెవెల్ ఏజెంట్ల సమావేశంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా 10 గ్రామాలకు సంబంధించిన బూతు లెవెల్ ఏజెంట్ల పనితీరు పట్ల ఎమ్మెల్యే అసంతృప్తి వ్యక్తం చేసినట్లుగా సమాచారం. సర్ కార్యక్రమంలో బూతు లెవెల్ ఏజెంట్లు అందరూ చురుకుగా పాల్గొని ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు.

**చిన్నారులకు పోలియో చుక్కలు వేసిన బుడ్డా** అంతర్జాతీయ పోలియో దినోత్సవం సందర్భంగా పార్నపల్లి గ్రామంలో నిర్వహించిన పోలియో చుక్కల కార్యక్రమంలో ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు చిన్న పిల్లలకు ఎమ్మెల్యే పోలియో చుక్కలు వేశారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు భావన రెడ్డి,సబిత తో పాటు ఆరోగ్య సిబ్బంది ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు

# గ్రామకంఠం భూమిని ఆక్రమించిన టిడిపి నేత



**కడప నంది పత్రిక ప్రతినిధి జూన్ 28** కడప జిల్లా కాజీపేట మండలం కూనవారిపల్లె గ్రామం లో ఉన్న గ్రామ కంఠం భూమి సర్వే నెంబర్ 449 లో 4ఎకరాల 90 సెంట్లు భూమి ఉన్నది, ఇందులో గత ప్రభుత్వ హయాంలో, సబ్ స్టేషన్, రైతు భరోసా కేంద్రం, విలేజ్ హెల్త్ క్లినిక్ నిర్మించడం జరిగింది. కూటమి ప్రభుత్వ హయాంలో, టీడీపీ నాయకుడు భూమి నీ సాగు చేయడం జరిగిందిఅని కూనవరి పల్లి రైతులు తమ ఆవేదన ను వ్యక్త పరచడం జరిగింది. ఇప్పటికైనా ఖాజీపేట మండల రెవెన్యూ అధికారులు స్పందించి గ్రామ కంఠం భూమిని కాపాడాలని గ్రామస్తులు కోరుచున్నారు, ఈ కార్యక్రమం లో మాజీ సర్పంచ్ భూమన సుబ్బారెడ్డి మాట్లాడుతూ సర్వే నెంబర్ 449 లో 4.90 సెంట్లు భూమి కలిగిఉందని కూనవారిపల్లి టీడీపీ నాయకుడు అక్రమించడం జరిగింది అని అధికారులు స్పందించి గ్రామ కంఠం భూమి నీ కాపాడాలని కోరారు, ఈ కార్యక్రమం లో గ్రామస్తులు పాల్గొని ముక్తకంఠం తో ఒకే మాట మా గ్రామ కంఠం భూమి కాపాడాలని కోరారు.

# కొలువుతీరిన ఏటి గంగమ్మ

**ఘనంగా నూతన విగ్రహ ప్రతిష్ట**

**తండోప తండాలుగా చేరుకున్న భక్తులు**

నూతన ఏటి గంగమ్మ, పోతురాజుల విగ్రహ ప్రతిష్ట సందర్భంగా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు మండలంలోని భాకరాపేట సమీపాన శనివారం నూతన ఏటి గంగమ్మ, అమ్మవారు, పోతురాజుల విగ్రహ ప్రతిష్ట సందర్భంగా భక్తులు అధిక సంఖ్యలో అమ్మవారి సేవలో పాల్గొన్నారు నూతన ఏటి గంగమ్మ అమ్మవారిని టిడిపి సీనియర్ నేత పార్లమెంట్ ఉపాధ్యక్షులు పుత్త రామచంద్రయ్య, పోతురాజు విగ్రహాన్ని మనోహర్ రెడ్డి ఆర్టీసీ కండక్టర్, ఇరువురు విగ్రహాలను సమర్పించగా అమ్మవారి ప్రత్యేక చండీ హోమం కు రాజంపేట పార్లమెంటు సమన్వయకర్త అతి కారి కృష్ణ సహకరించారు గ్రామస్తులు సహకారంతో అమ్మవారి గుడి నిర్మాణం చేసి విగ్రహ ప్రతిష్ట వైభవంగా చేశారు ఈ సందర్భంగా వేద పండితుడు సురేష్ బాబు మాట్లాడుతూ నూతన అమ్మవారి విగ్రహ ప్రతిష్ట సందర్భంగా గణపతి పూజ పుణ్యాహవాచనం, పూర్ణాహుతి చండీ హోమం మంగళ హారతి వంటి విశేష పూజలు నిర్వహించామని అమ్మవారి ఆలయ నిర్మాణానికి సహకరించిన ప్రతి ఒక్కరికి, వ్యాపార , విద్య, ఉద్యోగ, అవకాశాల్లో అమ్మవారు అనుగ్రహం తప్పకుండా వారి కుటుంబాలకు అమ్మవారి ఆశీస్సులు ఉంటాయని తెలిపారు ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు మహిళలు పెద్ద ఎత్తున చేరుకొని స్వామి వారి తీర్థప్రసాదాలు స్వీకరించారు



# ఆదోనిలో పల్స్ పోలియో కార్యక్రమంలో పాల్గొన్న గుడిసె ఆది కృష్ణమ్మ, ఎమ్మెల్యే పార్థసారధి



**నంది పత్రిక ఆదోని ప్రతినిధి** ఆదోని పట్టణంలోని స్థానిక ఆర్ట్స్ కాలేజీలో ఏర్పాటు చేసిన పల్స్ పోలియో కేంద్రాన్ని కర్నూలు జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షురాలు శ్రీమతి గుడిసె ఆది కృష్ణమ్మ గారు, ఆదోని శాసనసభ్యులు శ్రీ పార్థసారధి గారు సందర్శించి చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, దేశం పోలియో రహితంగా కొనసాగాలంటే ఐదేళ్లలోపు ప్రతి చిన్నారికి తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని తల్లిదండ్రులకు విజ్ఞప్తి చేశారు. ప్రతి చిన్నారి ఆరోగ్యవంతమైన భవిష్యత్తుకు పల్స్ పోలియో కార్యక్రమం ఎంతో కీలకమని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం, వైద్య ఆరోగ్య శాఖ చేపడుతున్న ఈ కార్యక్రమాన్ని ప్రజలందరూ విజయవంతం చేయాలని, తమ పరిసరాల్లోని ఐదేళ్లలోపు పిల్లలను సమీప పోలియో కేంద్రాలకు తీసుకువెళ్లి పోలియో చుక్కలు వేయించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వైద్య ఆరోగ్య శాఖ అధికారులు, ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎంలు, అంగన్‌వాడీ సిబ్బంది, ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# రెండు చుక్కలు చిన్నారుల బంగారు భవితకు





**0-5 సంవత్సరాలోపు పిల్లలందరికీ పోలియో చుక్కలు తప్పనిసరి**

**29, 30 తేదీల్లో మాప్-అప్ ద్వారా మిగిలిపోయిన పిల్లలందరికీ పోలియో టీకాలు**

**బస్ స్టాండ్, రైల్వే స్టేషన్లలో ప్రత్యేక పోలియో కౌంటర్లు**

**జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా**

**నంద్యాల బ్యూరో, జూన్, 28(నంది పత్రిక):-** రెండు పోలియో చుక్కలు చిన్నారుల బంగారు భవితకు ఎంతో అవసరమని జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి పిలుపునిచ్చారు. ఆదివారం మూలసాగరంలోని ఎంఎస్ నగర్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పల్స్ పోలియో కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా జిల్లా కలెక్టర్ చిన్నారులకు పోలియో చుక్కలు వేసే కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ వెంకటరమణ, మున్సిపల్ కమిషనర్ శేషన్న, మెప్మా పిడి వెంకట దాసు, జిల్లా పల్స్ పోలియో నోడల్ ఆఫీసర్ రమేష్, జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి సుదర్శన్ బాబు, ప్రోగ్రామ్ అధికారులు శారద బాయ్, లక్ష్మీ ప్రసన్న, డా.ఎన్టీఆర్ ట్రస్ట్ కోఆర్డినేటర్ రూపేంద్రనాథ్, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ భారతదేశం పోలియో రహిత దేశంగా ఉన్నప్పటికీ చుట్టుపక్కల దేశాల్లో అక్కడక్కడ పోలియో కేసులు నమోదవ్వడం వల్ల వాటి నుండి పిల్లలను రక్షించడానికి సంవత్సరానికి రెండు సార్లు జూన్, డిసెంబర్‌లో ఒకసారి ఈ కార్యక్రమాన్ని నిర్వహించుకోవడం జరుగుతోందన్నారు. అందుకు గాను 0-5 సంవత్సరాలోపు పిల్లలందరికీ పోలియో చుక్కలు తప్పనిసరిగా వేయించాలన్నారు. జిల్లాలో 2 లక్షల 38 వేల మంది చిన్నారులకు పోలియో చుక్కలు అందజేసేందుకు గాను 1320 చోట్ల పోలియో కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. అదే విధంగా ప్రయాణాల్లో ఉన్న చిన్నారుల కోసం బస్ స్టేషన్స్, రైల్వే స్టేషన్స్ దగ్గర కూడా పోలియో చుక్కల కేంద్రాలు అందుబాటులో ఉంచడం జరిగిందన్నారు. జ్వరం, జలుబు, విరేచనాలు ఉన్న పిల్లలకు కూడా ఈ టీకాలు వేయించవచ్చని, తల్లిదండ్రులు ఎలాంటి అపోహలకు తావివ్వకుండా, బాధ్యతగా తమ పిల్లలకు పోలియో చుక్కలు వేయించి పోలియో రహిత భారత్‌ను కాపాడుకోవడంలో భాగస్వాములు కావాలి అని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. అదే విధంగా అత్యవసర పరిస్థితుల్లో పోలియో కేంద్రాలకు వెళ్లలేని వారి కోసం ఈ నెల 29, 30 తేదీల్లో మాప్-అప్ కార్యక్రమం ద్వారా మిగిలిపోయిన పిల్లలందరికీ పోలియో చుక్కలు వైద్య సిబ్బంది ద్వారా ఇంటింటికి వచ్చి పోలియో చుక్కలు అందజేయడం జరుగుతోందన్నారు. వైద్య, ఆరోగ్య శాఖ, పంచాయతీ, స్త్రీ శిశు సంక్షేమ శాఖ, మున్సిపల్ శాఖలతో సమన్వయం చేసుకుంటూ జిల్లా అంతటా చిన్నారులకు అందజేయడం జరుగుతోందన్నారు.

## మజ్జిగ పంపిణీ చేసిన ఫ్రెండ్స్ సేవా సంస్థ

**కడప నంది పత్రిక ప్రతినిధి జూన్ 28** వైఎస్ఆర్ కడప జిల్లా కాజీపేట మండలం కాజీపేట నందు ఏర్పాటు చేసినటువంటి పల్స్ పోలియో బూత్ నందు సేవా సంస్థ సభ్యులైనటువంటి షేక్ హాజీ గౌస్, మహమ్మద్ హుస్సేన్, రఫీ,పెద్దాయనా చెన్నారెడ్డి ఈ కార్యక్రమం లో షైక్ హాజీ గౌస్ చిన్న పిల్లలకు పోలియో చుక్కలు వేశారు.



## ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక ను సద్వినియోగం చేసుకోండి



**తిరుపతి బ్యూరో చీఫ్ జూన్ 28 నంది పత్రిక** ప్రతి సోమవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో నిర్వహించే డయల్ యువర్ కమిషనర్, ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని నగరపాలక సంస్థ కమిషనర్ (ఎఫ్.ఏ. సి) శారదా దేవి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. తిరుపతి నగరపాలక సంస్థ కార్యాలయంలో జూన్ 29వ తేది సోమవారం ఉదయం 10 గంటల నుండి 2 గంటల వరకు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం, 10.30 నుండి 11.30 గంటల వరకు డయల్ యువర్ కమిషనర్ కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. ఫోన్ ద్వారా పిర్యాదులు చేసేవారు 0877-2227208 కి కాల్ చేసి మాట్లాడవచ్చని, ఈ కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాల్సిందిగా తిరుపతి ప్రజలకు కమిషనర్ (ఎఫ్.ఏ.సి) శారదా దేవి తెలియజేశారు.

# ఈ నెల 28న రాష్ట్రవ్యాప్తంగా పోలియో చుక్కల కార్యక్రమం





**భారత్‌లో పోలియో లేకపోయినా.. ఇంకా జాగ్రత్తలు తప్పనిసరి**

**రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎస్ సురేష్ కుమార్**

**పిల్లల భవిష్యత్తుకు రక్షణ కవచం.. రెండు చుక్కల పోలియో వ్యాక్సిన్**

**పోలియో రహిత సమాజమే మన లక్ష్యం**

**జిల్లాలో 2,59,843 మంది పిల్లలకు పోలియో చుక్కలు అందించనున్నాం**

**జిల్లా కలెక్టర్ డా. ఎస్ వెంకటేశ్వర్**

**పిల్లల ఆరోగ్యకరమైన భవిష్యత్తు తల్లిదండ్రుల బాధ్యత**

**తిరుపతి ఎం ఎల్ ఏ ఆరణి శ్రీనివాసులు**

**తిరుపతి బ్యూరో చీఫ్, జూన్ 28 నంది పత్రిక** దేశ వ్యాప్తంగా పోలియో వ్యాధిని సమూలంగా నివారించే దిశగా 0-5 సం .ల లోపు పిల్లలకు పోలియో చుక్కలు వేయడం జరుగుతున్నదని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎస్.సురేష్ కుమార్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జెసి ఆర్ గోవిందరావు, తుడా చైర్మన్ డాలర్ దివాకర్ రెడ్డి, తిరుపతి మున్సిపల్ కమిషనర్ శారదా దేవి, రాష్ట్ర యాదవ కార్పొరేషన్ చైర్మన్ నరసింహ యాదవ్, రాష్ట్ర నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ ఆర్ సదాశివ, డి ఎం అండ్ హెచ్ వో బాలకృష్ణ నాయక్, ఆర్డీఓ రామ్మోహన్, తదితరులు పాల్గొన్నారు.

ఆదివారం పల్స్ పోలియో కార్యక్రమంలో భాగంగా తిరుపతి లోని ఎం ఆర్ పల్లి అర్బన్ ప్రైమరీ హెల్త్ కేర్ సెంటర్ వద్ద వైద్య ఆరోగ్య శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎస్.సురేష్ కుమార్, జిల్లా కలెక్టర్ డా.ఎస్. వెంకటేశ్వర్, స్థానిక ఎం ఎల్ ఏ ఆరణి శ్రీనివాసులు లు పిల్లలకు పోలియో చుక్కలు వేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎస్.సురేష్ కుమార్ మాట్లాడుతూ 0-5 సంవత్సరాల లోపు పిల్లలకు 2 చుక్కల పోలియో వ్యాక్సిన్ వేయించడం ద్వారా భారత దేశాన్ని పోలియో రహిత దేశంగా తయారు చేయగలమని పేర్కొన్నారు. ఇప్పటికే భారత దేశాన్ని పోలియో రహిత దేశంగా వరల్డ్ హెల్త్ ఆర్గనైజేషన్ ప్రకటించినప్పటికీ, ప్రపంచ వ్యాప్తంగా ఇంకా పోలియో ప్రభావం ఉండడం, ఇతర దేశాల నుండి మన దేశానికి ప్రజలు రాకపోకలు జరుపుతున్న నేపథ్యంలో పోలియో వైరస్ పట్ల మరి కొన్ని సంవత్సరాలు జాగ్రత్త వహించాల్సి ఉందని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా 49 లక్షల మంది పిల్లలకు పోలియో చుక్కలు వేయవలసి ఉందని, ఈ నెల 28న రాష్ట్రం లో 29 వేల బూత్ లతో పాటు 1,144 మొబైల్ ట్రాన్సిట్ బూత్ ల ద్వారా పోలియో చుక్కలు అందించడం జరుగుతుందన్నారు. ఇందుకు గానూ సుమారు 1.31 లక్షల మంది ఏ ఎన్ ఎం లు, అంగన్వాడీ కార్యకర్తలను వినియోగించడం జరుగుతుందన్నారు. జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్ మాట్లాడుతూ జిల్లాలో మూడు రోజుల పాటు పల్స్ పోలియో కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని 0-5 సం.ల వయసు గల పిల్లలకు తప్పక పోలియో చుక్కలు వేయించాలని తల్లిదండ్రులను కోరారు. ప్రతి సంవత్సరం రెండు సార్లు పల్స్ పోలియో కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని, ఈ నెల 28వ తేదీ ఆదివారం పి హెచ్ సి లు, హెల్త్ కేర్ సెంటర్ లు, అంగన్వాడీ కేంద్రాలు, రైల్వే స్టేషన్, బస్ స్టేషన్ ల వద్ద పోలియో చుక్కలు వేయడం జరుగుతుందని తెలిపారు. జిల్లావ్యాప్తంగా 2,59,843 మంది పిల్లలకు పల్స్ పోలియో చుక్కలు వేయవలసి ఉందని తెలిపారు. మొదటిరోజు పోలియో చుక్కలు వేయలేని పిల్లలకు సోమ, మంగళవారాలలో ఇంటి వద్దకే వచ్చి పోలియో చుక్కలు వేయడం జరుగుతుందని తెలిపారు. పోలియో వ్యాధిని నిర్మూలించే దిశగా కేంద్ర ప్రభుత్వం తీసుకున్న చర్యలకు 2014 సం.లో డబ్ల్యూ హెచ్ ఓ ద్వారా భారత దేశానికి పోలియో ఫ్రీ సర్టిఫికెట్ లభించిందని తెలిపారు. అయినా భారత దేశానికి పక్కనే ఉన్న పాకిస్తాన్, ఆఫ్ఘనిస్తాన్ తదితర దేశాలలో ఇంకా పోలియో ప్రభావం ఉన్నందున పోలియో చుక్కలు వేసే కార్యక్రమాన్ని కొనసాగించడం జరుగుతుందని తెలిపారు.

0-5 వయసు గల పిల్లలకు ప్రతిసారి పోలియో వ్యాక్సిన్ ఇవ్వొచ్చని, ఇది పూర్తిగా సురక్షితమన్నారు. పోలియో వ్యాక్సిన్ వేయించడం ద్వారా వైరస్ నుండి పూర్తి రక్షణ కలుగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమం లో భాగంగా 1973 ఫిక్స్ బూత్ లు, మరిన్ని మొబైల్ బూత్ లు ఏర్పాటు చేయడమైనదన్నారు. పల్స్ పోలియో కార్యక్రమం లో సుమారు 8 వేల మంది వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది పాల్గొనడంతో పాటు రెవెన్యూ, అంగన్వాడీ, పోలీస్ సిబ్బంది కూడా పాల్గొన్నారన్నారు. స్థానిక ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు మాట్లాడుతూ 0-5 సంవత్సరాలలోపు పిల్లలకు పల్స్ పోలియో చుక్కలు వేయించడం తల్లిదండ్రులు బాధ్యత అని తెలిపారు. పోలియో వ్యాక్సిన్ వేయడం ద్వారా శాశ్వతంగా పోలియోను నిర్మూలించగలమని పేర్కొన్నారు. పిల్లల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని టీకాలు, పల్స్ పోలియో చుక్కలను అందించాలని తల్లిదండ్రులను కోరారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎంలు, అంగన్వాడి వర్కర్లు, వైద్య ఆరోగ్యశాఖ, ఐసిడిఎస్, తదితరులు పాల్గొన్నారు.



## స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (సర్) ప్రక్రియ వేగవంతం చేసేందుకు అధికారులు సిబ్బంది ప్రత్యేక దృష్టి సారించాలి

**జిల్లా జాయింట్ కలెక్టర్ ఆర్ గోవిందరావు**



**తిరుపతి బ్యూరో చీఫ్ 28 జూన్ నంది పత్రిక** జాయింట్ కలెక్టర్ ఆర్ గోవిందరావు ఆదివారం ఉదయం తిరుపతి నగరపాలక సంస్థ పరిధిలోని 39 వ వార్డ్ చెన్నారెడ్డి కాలనీ, 38 వవార్డ్ కేబి లేఔట్, 18 వ వార్డ్ మారుతి నగర్ లో జరుగుతున్న ప్రత్యేక ఓటర్ సవరణ( సర్) ప్రక్రియను పరిశీలించిన జిల్లా జాయింట్ కలెక్టర్ మరియు నియోజకవర్గ ఓటర్ నమోదు ప్రత్యేకాధికారి శ్రీ గోవింద రావు ఐఏఎస్ గారు మాట్లాడుతూ స్పెషల్ ఇంటర్వ్యూ రివిజన్ ప్రక్రియ ను వేగవంతం చేసేందుకు అధికారులు సిబ్బంది ప్రత్యేక దృష్టి సారించాలన్నారు ప్రతి ఇంటికి వెళ్లి 2002 ఓటర్ల జాబితా తో సపోర్చి ఎన్రోల్మెంట్ ఫారాలు అందజేయాలన్నారు, ఈ కార్యక్రమంలో నగరపాలక సంస్థ కమిషనర్ (ఎఫ్.ఏ.సి) శారదా దేవి గారు, డిప్యూటీ కమిషనర్ అమరయ్య గారు, అర్బన్ తహసీల్దార్ సురేష్ బాబు, ఈడిటి సుధాకర్ నాయక్, తదితరులు పాల్గొన్నారు.



## చిన్నారులకు పోలియో చుక్కలు వేసిన ఎంపీ బస్తిపాటి నాగరాజు

**కర్నూల్ సిటీ నంది పత్రిక** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ప్రతి కుటుంబం ఆరోగ్యంగా ఉండాలన్న లక్ష్యంతో కూటమి ప్రభుత్వం పాలన సాగిస్తుందని ఎంపీ బస్తిపాటి నాగరాజు అన్నారు.కర్నూలు రూరల్ మండలం పంచలింగాల గ్రామంలోని ప్రాథమిక ప్రభుత్వ పాఠశాలలో నిర్వహించిన పల్స్ పోలియో కార్యక్రమంలో పాల్గొన్న ఆయన, చిన్నారులకు స్వయంగా పోలియా చుక్కలు వేశారు.



ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ చిన్నారుల ఆరోగ్యకరమైన భవిష్యత్తు కోసం ప్రతి తల్లిదండ్రులు తమ పిల్లలకు పోలియో చుక్కలు వేయించాలన్నారు.పోలియా రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

## నేడే బేతంచెర్ల నగర పంచాయితీ సర్వ సభ్య సమావేశం.

**బేతంచెర్ల జూన్ 28 ( నంది పత్రిక ).** బేతంచెర్ల నగర పంచాయితీ కార్యాలయంలో నగర పంచాయితీ చైర్మన్ సిహెచ్. చలం రెడ్డి అధ్యక్షతన నగర పంచాయితీ సర్వ సభ్య సమావేశం సోమవారం మధ్యాహ్నం 3 గంటలకు జరుగునని నగర పంచాయితీ కమిషనర్ డి. హరిప్రసాద్ ప్రకటన ద్వారా తెలిపారు. సంబంధిత అధికారులు వార్డు కౌన్సిల్ సభ్యులు సకాలంలో హాజరు కావలయునని తెలిపారు



# నిండు జీవితానికి రెండు చుక్కలు

**ఐదేళ్లలోపు ప్రతి చిన్నారికి పోలియో చుక్కలు**

**రైల్వే స్టేషన్, బస్ స్టేషన్‌లలో పోలియో బూత్‌లు**

**నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు**

**కర్నూల్ సిటీ నంది పత్రిక** పోలియో రహిత సమాజ నిర్మాణానికి ప్రతి చిన్నారికి పోలియో చుక్కలు వేయించడం అత్యంత అవసరమని నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు అన్నారు. ఆదివారం పల్స్ పోలియో కార్యక్రమంలో భాగంగా కొత్తపేటలోని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, చిత్తారి వీధిలో ఏర్పాటు చేసిన పోలియో బూత్ వద్ద చిన్నారులకు కమిషనర్ పోలియో చుక్కలు వేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. నగరంలో ఐదేళ్లలోపు ఉన్న 82,964 మంది చిన్నారులకు పోలియో చుక్కలు వేయడానికి 229 పోలియో బూత్‌లు ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. వైద్యరోగ్య, మున్సిపల్, ఐసిడియస్ శాఖల నుండి సుమారు 2300 మంది సిబ్బందితో పోలియో బూత్‌లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అదేవిధంగా రైల్వే స్టేషన్, బస్‌స్టాండ్ లాంటి ప్రధాన ప్రాంతాల్లో ప్రత్యేక బూత్‌లను ఏర్పాటు చేశామని చెప్పారు. ఆదివారం పోలియో చుక్కలు వేయించుకుని చిన్నారులకు ఇంటి వద్దకే ప్రత్యేక బృందాలు వచ్చి చుక్కలు వేస్తారని, ఎవరైన చుక్కలు వేయించుకుండా ఉంటే సమీప పోలియో బూత్ వద్దకు వెళ్ళాలని కమిషనర్ సూచించారు.కార్యక్రమంలో ప్రజారోగ్య అధికారి డాక్టర్ ఎం.రఘు, మెడికల్ ఆఫీసర్ భార్గవ్, స్టాఫ్ నర్సులు, ఫార్మసిస్ట్, తదితరులు పాల్గొన్నారు.



## పిల్లల ఆరోగ్యానికి పోలియో చుక్కలు తప్పనిసరి జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్

**ఈరోజు ఎవరైనా పోలియో చుక్కలు వేయించుకోనట్లైతే 29, 30 తేదీలలో తప్పనిసరిగా వేయించుకోవాలి.**



**నంది పత్రిక కర్నూలు బ్యూరో :** కర్నూలు జిల్లాలో 0 నుంచి 5 ఏళ్ల లోపు చిన్నారులకు తమ తల్లిదండ్రులు తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్ తెలిపారు.ఆదివారం కర్నూలు నగరం ఏ క్యాంప్ లోని ఇందిరాగాంధీ స్మారక నగరపాలక ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పల్స్ పోలియో కేంద్రంలో 0–5 సంవత్సరాలలోపు చిన్నారులకు జాయింట్ కలెక్టర్ పల్స్‌పోలియో చుక్కలు వేశారు.ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ నిండు జీవితానికి రెండు పోలియో చుక్కలు వేసి చిన్నారుల భవిష్యత్తుకు బంగారు బాటలు వేద్దామని జాయింట్ కలెక్టర్ పేర్కొన్నారు. 5 సం.లోపు చిన్నారులకు తప్పని సరిగా పోలియో చుక్కలు వేయించడం మనందరి బాధ్యత అన్నారు. పల్స్ పోలియో కార్యక్రమంలో 100 శాతం లక్ష్యాన్ని సాధించాలని జాయింట్ కలెక్టర్ తెలిపారు. పల్స్ పోలియో కార్యక్రమంలో భాగంగా జిల్లాలో 1630 బూత్ లను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ప్రయాణంలో ఉన్న పిల్లలకు పోలియో చుక్కలు వేయుట కొరకు బస్ స్టాండ్లు, రైల్వే స్టేషన్లలలో, ఎయిర్పోర్ట్ లలో 52 పోలియో కేంద్రాలు ఏర్పాటు చేసామన్నారు. అదే విధంగా 33 మొబైల్ బూత్ లను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఒకవేళ ఎవరైనా ఈరోజు పోలియో చుక్కలు వేయించుకుని యెడల 29, 30 తేదీలలో డోర్ టు డోర్ వెళ్ళి మిస్ అయిన పిల్లలకు వైద్య బృందాలు పోలియో చుక్కలు వేసే విధంగా ఆదేశాలు జారీ చేయడం జరిగిందన్నారు. పల్స్ పోలియో కార్యక్రమంలో డిఎంహెచ్ఓ డా.భాస్కర్ రాజు, కార్పొరేటర్ పద్మలత, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# భాస్కరపురం లో కార్డెన్ సర్చ్ చేసిన పోలీసులు..... ఎస్ఐ. కె.మల్లికార్జున





**బెల్ట్ షాప్ నిర్వహిస్తున్న చంద్రశేఖర్ గౌడు వద్ద 20 మద్యం బాటిళ్లు స్వాధీనం....**

**రికార్డులు సరిగా లేని 15 వాహనాల యజమానులకు ఫైన్..... ఎస్సై మల్లికార్జున.**

**జూపాడు బంగ్లా, జూన్ :28 :(నంది పత్రిక):** జూపాడు బంగ్లా మండలంలోని భాస్కరపురం గ్రామంలో జిల్లా ఎస్పీ సునీల్ షోరాణ్ ఐపీఎస్ ఆదేశాల మేరకు ఆత్మకూర్ డిఎస్పి రామాంజనేయులు పర్యవేక్షణలో నందికొట్కూరు రూరల్ సిఐ టి సుబ్రహ్మణ్యం సూచన మేరకు కార్డెన్ సర్చ్ నిర్వహించడం జరిగింది. ఆదివారం జరిగిన ఈ సందర్భంగా ఎస్సై కె. మల్లికార్జున మాట్లాడుతూ జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మండలంలోని భాస్కరపురం, తంగడంచ గ్రామంలో కార్డెన్ సెర్చ్ లో నిర్వహించడం జరిగిందని తెలిపారు. గ్రామంలో జరిగిన కార్డెన్ సెర్చ్ లో రికార్డులు లేని 15 వాహనాలకు లైసెన్సులు లేని వారికి ఫైన్లు వేయడం జరిగిందన్నారు. అలాగే గ్రామంలో బెల్ట్ షాప్ నిర్వహిస్తున్న చంద్రశేఖర్ గౌడ్ సన్నాఫ్ ఈడిగా నాగశేషుల గౌడ్ వయసు 46 అనే వ్యక్తి వద్ద నుండి 20 క్వార్టర్ బాటిల్లు, షాట్ విస్కీ 180 ఎశ్రీ క్వార్టర్స్ బాటిల్లను స్వాధీనం చేసుకుని ఈడిగ చంద్రశేఖర్ గౌడ్ పై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్ఐ కె. మల్లికార్జున గ్రామంలోని పలు ప్రాంతాల్లో ఇంటింటికీ తనిఖీలు చేపట్టారు. గ్రామసభ ఏర్పాటు చేసిన ఆయన మాట్లాడుతూ గ్రామస్తులు చట్టాలను పాటించాలని, నేర కార్యక్రమాలకు పాడుపడితే కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు. అనుమానాస్పద వ్యక్తులు లేదా వస్తువులు కనిపిస్తే వెంటనే సమాచారం అందించాలని సూచించారు. ప్రజలకు ఫోక్స్ చట్టం గురించి వివరించడం చిన్నపిల్లలు మహిళలపై అఘాయిత్యాలు, సైబర్ నేరాలు, రోడ్డు ప్రమాదాలు, హెల్మెట్ వాడకంపై అవగాహన కల్పించారు. ఈ తనిఖీలతో గ్రామంలో ప్రజల్లో భద్రతాభావం పెరిగిందని స్థానికులు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిబ్బందితో పాల్గొన్నారు.



## ఆదోనిలో పల్స్ పోలియో కార్యక్రమంలో పాల్గొన్న గుడిసె ఆది కృష్ణమ్మ, ఎమ్మెల్యే పార్థసారధి



**కర్నూల్ సిటీ నందిపత్రిక** ఆదోని పట్టణంలోని స్థానిక ఆర్ట్స్ కాలేజీలో ఏర్పాటు చేసిన పల్స్ పోలియో కేంద్రాన్ని కర్నూలు జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షురాలు గుడిసె ఆది కృష్ణమ్మ , ఆదోని శాసనసభ్యులు పార్థసారధి సందర్శించి చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, దేశం పోలియో రహితంగా కొనసాగాలంటే ఐదేళ్లలోపు ప్రతి చిన్నారికి తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని తల్లిదండ్రులకు విజ్ఞప్తి చేశారు. ప్రతి చిన్నారి ఆరోగ్యవంతమైన భవిష్యత్తుకు పల్స్ పోలియో కార్యక్రమం ఎంతో కీలకమని పేర్కొన్నారు.రాష్ట్ర ప్రభుత్వం, వైద్య ఆరోగ్య శాఖ చేపడుతున్న ఈ కార్యక్రమాన్ని ప్రజలందరూ విజయవంతం చేయాలని, తమ పరిసరాల్లోని ఐదేళ్లలోపు పిల్లలను సమీప పోలియో కేంద్రాలకు తీసుకువెళ్లి పోలియో చుక్కలు వేయించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వైద్య ఆరోగ్య శాఖ అధికారులు, ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎంలు, అంగన్‌వాడీ సిబ్బంది, ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రజల ప్రాణాలతో చెలగాటమా..

**ఆర్ ఆర్ లేబర్ కాలనీ ముఖద్వారం వద్ద నూతన వంతెన నిర్మించాలి - సిపిఎం నాయకులు డిమాండ్**



**నంది పత్రిక ఆదోని ప్రతినిధి** ఆదోని పట్టణంలోని ఆర్‌ఆర్ లేబర్ కాలనీ ముఖద్వారం వద్ద నూతన వంతెన నిర్మించాలని సిపిఎం పార్టీ బృందం వంకను పరిశీలించిన అనంతరం భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్షకు సిపిఎం పార్టీ సంపూర్ణ మద్దతు ఇస్తున్నట్లు సిపిఎం పట్టణ కార్యదర్శి లక్ష్మన్న, పట్టణ కార్యదర్శి వర్గ సభ్యులు గోపాల్, తిప్పన్న, నాయకులు నాగరాజు, కృష్ణమూర్తి, వీరేష్, శ్రీనివాసులు, నాగరాజు,సతీష్, తదితరులు దీక్షను సందర్శించి సంపూర్ణ మద్దతు ఇస్తున్నట్లు వారు తెలిపారు. అనంతరం సిపిఐ పట్టణ కార్యదర్శి వీరేష్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమం ఉద్దేశించి వీరు మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారం కొరకు దాదాపు 7 రోజుల నుండి సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్షలు నిర్వహిస్తున్నప్పటికీ సంబంధిత అధికారులు స్పందించకపోవడం చాలా దుర్మార్గమని వారు తెలిపారు. ఆర్‌ఆర్ లేబర్ కాలనీ ముఖద్వారం వద్ద బ్రిడ్జి లేకపోవడంతో ప్రజల ప్రాణాలకు రక్షణ లేకుండా పోతుందని వారు తెలిపారు. కాలిన వైపు వెళుతున్న ప్రజలు, హైస్కూల్ విద్యార్థులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు, గత వారం రోజుల క్రితం లారి వంకలో పడి పోవడం జరిగిందని వారు గుర్తు చేశారు.. ఇప్పటికైనా సంబంధం అధికారులు వెంటనే స్పందించి సమస్యను పరిష్కరించాలని వారు డిమాండ్ చేశారు. లేని పక్షంలో సిపిఐ పార్టీ నిర్వహిస్తున్న పోరాటాలలో సిపిఎం పార్టీగా భాగస్వామ్యం అయ్యి ప్రజా పోరాటాలు ఉధృతం చేస్తామని వారు తెలిపారు.



## 'ఎస్ఐఆర్'లో ఓటర్లందరూ భాగస్వాములవ్వండి

**జిల్లా జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్**

**బీఎల్‌వోల పనితీరు పరిశీలన**

**సందేహాలుంటే నివృత్తి చేసుకోవాలి**

**నంది పత్రిక కర్నూలు బ్యూరో :** ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమాన్ని విజయవంతం పూర్తి చేసేందుకు ప్రతి ఓటరు భాగస్వామి కావాలని జిల్లా జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్ పిలుపునిచ్చారు. ఆదివారం ఇందిరాగాంధీ మెమోరియల్ స్కూల్ సమీపంలో 100, 101, 102 పోలింగ్ బూత్‌ల పరిధిలో బిఎల్వోలు చేపడుతున్న ఎస్ఐఆర్ ప్రక్రియను జేసి, కర్నూలు నియోజకవర్గ ఈఆర్వో, నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసుతో కలిసి పరిశీలించారు.ఈ సందర్భంగా జేసి మాట్లాడుతూ.. ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రక్రియను వేగవంతంగా, పారదర్శకంగా నిర్వహించాలని సూచించారు. ఓటరు సందేహాలను అక్కడికక్కడే నివృత్తి చేయాలని బీఎల్‌వోలను ఆదేశించారు. ఎస్ఐఆర్ ప్రక్రియను దశలవారీగా కాకుండా సాధ్యమైనంత వరకు ఒకే సందర్శనలో పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఓటర్లు అవసరమైన పత్రాలను వెంట తీసుకువస్తే ప్రక్రియ మరింత సులభంగా పూర్తవుతుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ ఈఆర్వో, డిప్యూటీ తహశీల్దార్ ధనుంజయ, తదితరులు పాల్గొన్నారు.



## రేపు నగరపాలక సంస్థ లో పిజిఆర్‌యస్

**నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు**



**కర్నూల్ సిటీ నందిపత్రిక** కర్నూలు నగరపాలక సంస్థలో సోమవారం 'ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కమిషనర్ చల్లా ఓబులేసు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10:00 గంటలకు స్థానిక ఎస్బిఐ ఎంప్లాయీస్ కాలనీలోని నగరపాలక సమావేశ భవనంలో నిర్వహించనున్నట్లు కమిషనర్ తెలిపారు. ఈ కార్యక్రమానికి నగరపాలకకు చెందిన అన్ని విభాగాల అధికారులు హాజరు అవుతారని, కాలనీల్లోని మౌలిక వసతులు, రహదారులు, డ్రైనేజీ, వీధి వెలుగులు, పరిశుభ్రత వంటి సమస్యలను ప్రజలు లిఖిత పూర్వకంగా సమర్పించవచ్చని తెలిపారు. ప్రతి ఫిర్యాదు స్వీకరించబడిన వెంటనే సంబంధిత అధికారులకు పంపి, పరిష్కారం కోసం నిర్దిష్ట గడువులు నిర్ణయించబడతాయని ఆయన వెల్లడించారు. అదేవిధంగా, ప్రతి ఫిర్యాదు పురోగతిని పౌరులు స్వయంగా హ్ట్టీజూం://మీకోసం .ఏపీ .గవర్నమెంట్ .ఇన్ వెబ్‌సైట్ ద్వారా తెలుసుకోవచ్చని కమిషనర్ వివరించారు.

## రాజుపాలెంలో శ్రీ వెంకటేశ్వర స్వామి మండలోత్సవ వేడుకలు



**మద్రిపాడు జూన్ 28నంది పత్రిక :** రాజుపాలెం గ్రామంలో శ్రీ వెంకటేశ్వర స్వామి విగ్రహ ప్రతిష్ఠ జరిగి 40 రోజులు పూర్తయిన సందర్భంగా ఆలయంలో మండలోత్సవ వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.ఈ సందర్భంగా వేద పండితుల మంత్రోచ్ఛారణల మధ్య స్వామివారికి విశేష పూజలు,వివిధ రకాల అభిషేకాలు,హోమాలు,అర్చనలు వైభవంగా నిర్వహించారు.ఆలయం ఆధ్యాత్మిక వాతావరణంతో కళకళలాడగా,భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.పూజా కార్యక్రమాల అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

# ఎస్ఐఆర్'పై అపోహాలు వీడాలి.

**అర్హులైన ఓట్లను ఎట్టిపరిస్థితుల్లోనూ తొలగించరు**

**కర్నూలు ఈఆర్వో, కమిషనర్ చల్లా ఓబులేసు**

**కర్నూల్ సిటీ నంది పత్రిక** కేంద్ర ఎన్నికల సంఘం దేశవ్యాప్తంగా చేపట్టిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్ – సర్) ప్రక్రియపై అపోహలు వీడి, ఎస్ఐఆర్‌ను సజావుగా నిర్వహించేందుకు సహకరించాలని ఓటర్లకు కర్నూలు అసెంబ్లీ నియోజకవర్గ ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి, నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు విజ్ఞప్తి చేశారు. అర్హులైన ఏ ఒక్కరి ఓటు కూడా ఎట్టిపరిస్థితుల్లోనూ తొలగించబడదని ఆయన స్పష్టం చేశారు. ఆదివారం పద్మావతి స్కూల్‌లోని 236వ పోలింగ్ బూత్, టి.జి. వెంకటేష్ ప్రైమరీ ఉర్దూ స్కూల్‌లోని 246వ బూత్, డబ్రా వీధిలోని 149వ పోలింగ్ బూత్‌ల పరిధిలో జరుగుతున్న ఎస్ఐఆర్ ప్రక్రియను ఈఆర్వో పరిశీలించారు. ఈ సందర్భంగా ఈఆర్వో మాట్లాడుతూ.. ఎస్ఐఆర్ ప్రక్రియను సులభంగా, వేగవంతంగా పూర్తి చేసేందుకు ఓటర్లు, రాజకీయ పార్టీల బిఎల్ఏలు సహకరించాలని కోరారు. 'ఎస్ఐఆర్'ను దశల వారీగా కాకుండా ఒకే దఫాలో పూర్తి చేసేందుకు ఓటర్లు అవసరమైన సమగ్ర వివరాలను ముందుగానే సిద్ధం చేసుకోవాలని సూచించారు. రెండు పాస్‌పోర్ట్ సైజు ఫొటోలు, ఓటరు గుర్తింపు కార్డు, ఆధార్ కార్డు లేదా ఎన్నికల సంఘం నిర్దేశించిన ఏదైనా ప్రభుత్వం జారీ చేసిన గుర్తింపులను అందుబాటులో ఉంచుకోవాలని తెలిపారు. అదేవిధంగా 2002 సంవత్సరంలో ఓటు నమోదై ఉంటే ఆ వివరాలు, లేకపోతే తల్లిదండ్రులు లేదా అవ్వ, తాత, నాన్నమ్మ, జేజినాన్నలలో ఎవరిదైనా ఓటు ఏ రాష్ట్రం, నియోజకవర్గం, పార్ట్ నంబర్, సీరియల్ నంబర్‌లో ఉందో ఆ వివరాలను సిద్ధంగా ఉంచుకోవాలని సూచించారు. ఎన్యూమరేషన్ ఫారాల పూరింపు, ఓటర్ల గుర్తింపు తదితర ప్రక్రియలను త్వరితగతిన పూర్తి చేసేందుకు బిఎల్వోలకు తోడుగా బిఎల్ఏలు క్షేత్రస్థాయిలోకి వెళ్ళాలని సూచించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు మంజూర్ బాషా, వాజిద్, మన్సూర్, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ రాజు తదితరులు పాల్గొన్నారు.



## నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక



**నంద్యాల బ్యూరో, జూన్ 28(నంది పత్రిక):–** జిల్లా ప్రజల సమస్యలను సత్వరంగా పరిష్కరించి, ప్రజలకు ప్రభుత్వ సేవలను మరింత సమర్థవంతంగా అందించాలనే లక్ష్యంతో నేడు (సోమవారం) జిల్లా వ్యాప్తంగా "ప్రజా సమస్యల పరిష్కార వేదిక" కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమం జిల్లా కలెక్టరేట్‌తో పాటు అన్ని రెవెన్యూ డివిజన్ కార్యాలయాలు, మండల పరిషత్ కార్యాలయాలు మరియు మున్సిపల్ కార్యాలయాల్లో ఒకేసారి నిర్వహించబడుతుందని తెలిపారు. కార్యక్రమాన్ని ఉదయం 9:30 గంటల నుంచి మధ్యాహ్నం వరకు నిర్వహించనున్నట్లు కలెక్టర్ పేర్కొన్నారు. ప్రజలు తమ సమస్యలకు సంబంధించిన వినతిపత్రాలను నేరుగా అధికారులకు సమర్పించవచ్చని, అలాగే వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో కూడా ఫిర్యాదులు నమోదు చేసుకునే అవకాశం కల్పించబడిందని తెలిపారు. సమర్పించిన అర్జీల పరిష్కార స్థితిని అదే వెబ్‌సైట్‌లో లేదా టోల్ ఫ్రీ నంబర్ 1100 ద్వారా తెలుసుకోవచ్చన్నారు. అర్జీదారులు తమ సమస్యలకు సంబంధించిన వినతులను ముందుగా మండల, డివిజన్ లేదా మున్సిపల్ స్థాయి కార్యాలయాల్లో సమర్పించి, అక్కడ పరిష్కారం కాని అంశాలను మాత్రమే జిల్లా స్థాయి ప్రజా సమస్యల పరిష్కార వేదిక దృష్టికి తీసుకురావాలని కలెక్టర్ సూచించారు. జిల్లా కేంద్రంలో ఉదయం 9:30 గంటలకు ప్రారంభమయ్యే కార్యక్రమానికి అన్ని శాఖల జిల్లా స్థాయి అధికారులు తప్పనిసరిగా హాజరై ప్రజల వినతులను స్వీకరించి, వాటి పరిష్కారానికి తక్షణ చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు.

# అపర చాణక్యుడు పివి నరసింహారావు

**కాంగ్రెస్ ఓబిసి సెల్ జిల్లా చైర్మన్ డివి సాంబశివుడు**

**కర్నూల్ సిటీ నంది పత్రిక** భారత మాజీ ప్రధాని స్వర్గీయ పీవీ నరసింహారావు అజాతశత్రువు, అపర చాణక్యుడని కర్నూలు జిల్లా కాంగ్రెస్ ఓబిసి సెల్ జిల్లా చైర్మన్ డివి సాంబశివుడు ఆయన సేవలను కొనియాడారు. పివి నరసింహారావు 106వ జయంతి సందర్భంగా జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో పాల్గొని ఆయన ప్రసంగించారు. తెలుగువారి ఖ్యాతిని ఖండాంతరాలకు వ్యాపింపజేసిన ఎందరో మహానుభావుల్లో మన పివి నరసింహా రావు ఎనలేని కీర్తి దక్కించుకున్నారని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా పనిచేసిన హయాంలో భూసంస్కరణల చట్టం తీసుకొచ్చి వందలాది ఎకరాలు కలిగివున్న భూస్వాముల నుంచి భూములను ఒకే చట్టం ద్వారా ప్రభుత్వం స్వాధీనం చేసుకునేట్టు చేశారని భూస్వాముల ఆగ్రహావేశాలను లెక్కచేయకుండా భూసేకరణ చట్టం పకడ్బందీగా అమలు చేసిన ధైర్యశాలి మన పివి అని భూస్వాముల కుటుంబానికి చెందిన పీవీ తన పన్నెండు వందల ఎకరాల భూమిని భూమిలేని పేదలకు పంచారని తెలియజేశారు. అనంతరం కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు ఏ సూర్య ప్రకాశ్ రెడ్డి మాట్లాడుతూ పీవీ ముఖ్యమంత్రిగా ఉన్న కాలంలో పెత్తందార్లు అడవులలోని వన్యమృగాలను చంపడంతో చలించిపోయి వాటి సంరక్షణకు వన్యప్రాణి సంరక్షణ చట్టాన్ని తీసుకొచ్చారని పివీ సేవలను జాతీయ స్థాయిలో ఉపయోగించు కోవాలని భావించిన ఇందిరా గాంధీ ఆయనను అఖిల భారత కాంగ్రెస్ కమిటీ ప్రధాన కార్యదర్శిగా నియమించారని పివి ఇందిరా గాంధీ కి అత్యంత నమ్మకస్తుడిగా ఉన్నారని ఎమర్జెన్సీ తర్వాత దేశమంతటా కాంగ్రెస్ ఓడిపోయినా మన రాష్ట్రంలో మాత్రం కాంగ్రెస్ జెండా రెప రెపలాడించాడని నాడు రాష్ట్రంలో 42 పార్లమెంటు స్థానాల్లో 41 స్థానాలు కాంగ్రెస్‌కు రావడం వెనుక పివి పాత్ర కీలకమని ఇందిర గాంధీ హయాంలో తన బహుముఖ ప్రతిభ సామర్థ్యాన్ని అంతర్జాతీయ దౌత్యానికి ఉపయోగించారని ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన ఆరు మాసాల్లో నంద్యాల పార్లమెంటు స్థానం నుంచి ఎంపీగా పోటీ చేసి గెలుపొందిన ఘనత మన పివి కి దక్కుతుందని భారత ప్రధానిగా ఉన్న కాలంలో దేశంలో ఎన్నో రాజకీయ ఆర్థిక సామాజిక మలుపులు చోటు చేసుకున్నాయని దివాలా తీసే స్థాయికి చేరుకున్న ఆర్థిక వ్యవస్థకు పునరుజ్జీవం కల్పించి సంస్కరణలకు బీజం వేశారని అందుకే పీవీని దేశ ఆర్థిక సంస్కరణల పితామహుడిగా పిలుస్తారని దేశాన్ని ఏలిన ఏకైక తెలుగు వాడిగా చరిత్రకెక్కిన పీవీ గొప్పతనం గురించి తెలియజేశారు. ముందుగా కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు పార్టీ కార్యాలయంలో స్వర్గీయ పివి నరసింహారావు చిత్రపటమునకు పూలమాలలు వేసి నివాళు లర్పించారు. అనంతరం కార్యకర్తల సమావేశం జరిగినది. ఈ కార్యక్రమంలో కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు ఏ సూర్య ప్రకాశ్ రెడ్డి, ఐఎన్టియుసి సిటీ అధ్యక్షులు రేపల్లె ప్రతాప్, కర్నూల్ నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు డాక్టర్ బి ఆతిఫ్ అలీ ఖాన్, డిసిసి మాజీ ప్రధాన కార్యదర్శి బి సుబ్రహ్మణ్యం, మద్దిలేటి, రంగస్వామి, మనోజ్, హరి, వెంకటేష్, ఎల్లయ్య, రాము మొదలగువారు పాల్గొన్నారు.



## పల్స్ పోలియో విజయవంతం



**బండి ఆత్మకూరు నంది పత్రిక జూన్ 28** : బండి ఆత్మకూరు మండలంలో ఆదివారం నాడు చేపట్టిన పల్స్ పోలియో కార్యక్రమం విజయవంతమైంది. మండల పరిధిలో ఉన్న పార్నపల్లి గ్రామంలో శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి పాల్గొని చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. నారాయణపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో 3654 మంది పిల్లలు ఉండగా వారిలో 342 మంది పిల్లలకు పోలియో చుక్కలు వేశారు. 94 శాతం పిల్లలకు పోలియో చుక్కలు వేయడం జరిగిందని వైద్యాధికారి దినేష్ బాబు పేర్కొన్నారు. మహిళా వైద్యాధికారి హేమంతా సమీరా కార్యక్రమంలో పాలుపంచుకున్నారు. ఈ కార్యక్రమం విజయవంతం చేయడంలో కృషిచేసిన ఆశ వర్కర్లు అంగన్వాడి సిబ్బంది ఆరోగ్య సిబ్బంది కి వైద్యాధికారులు కృతజ్ఞతలు తెలిపారు. బండి ఆత్మకూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో ఉన్న గ్రామాలలో సున్నా నుండి ఐదు సంవత్సరంలోపు వయసు కలిగిన పిల్లలకు అందరికీ పోలియో చుక్కలు వేయడం జరిగిందని వైద్యాధికారులు సబితా భావన రెడ్డి పేర్కొన్నారు. ఏ కోడూరు గ్రామంలో మండల పరిషత్ అధ్యక్షులు దేరెడ్డి సంజీవరెడ్డి పల్స్ పోలియో చుక్కల కార్యక్రమాన్ని ప్రారంభించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో 3006 మంది పిల్లలకు 98 శాతం పోలియో చుక్కలను వేయడం జరిగింది. మిగిలిన పిల్లలకు రేపు మరునాడు ఇంటింటా సర్వే నిర్వహించి పోలియో చుక్కలను వేయడం జరుగుతుందని వైద్యాధికారులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పబ్లిక్ హెల్త్ నర్స్ లక్ష్మీదేవి సూపర్వైజర్ రవికుమార్ ఏఎన్ఎంలు, ఎం ఎల్ హెచ్ పి, ఆశ వర్కర్లు తో పాటు అంగన్వాడి కార్యకర్తలు పాల్గొన్నారు.



## జన సేనా పార్టి నంద్యాల జిల్లా పార్లమెంట్ కమిటి సభ్యుడుగా బేతంచెర్ల వాసి.



**బేతంచెర్ల జూన్ 28 ( నందిపత్రిక ).** ఆంధ్ర ప్రదేశ్ జనసేనా పార్టి మంగళగిరి కార్యాలయంలో ఆ పార్టి అధినేత పవన్ కళ్యాణ్ శని వారం నాడు నంద్యాల జిల్లా పార్లమెంట్ నిర్మాణ సారధుల సమాచార సేకరణ కమిటి సభ్యులు గా, నంద్యాల జిల్లా బేతంచెర్ల పట్టణానికి చెందిన శ్రీ కంటి మధు కు భాద్యతలు అప్పగించారు. ఈ సందర్బంగా శ్రీ కంటి మధు మాట్లాడుతూ పార్టి కోసం కష్ట పడిన ప్రతికార్య కర్తను గుర్తించి, వారికి తగిన గుర్తింపు ఇవ్వడంలో మా జనసేన పార్టి ప్రతి రూపం గా నిలుస్తుందని, తనకు అప్పగించిన భాద్యతను,పార్టి అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని అన్నారు. జనసేన పార్టి అధినేత పవన్ కళ్యాణ్ కుజన సేన నాయకులకు ప్రత్యేక ధన్యవాదములు తెలియ జేశారు.

## వివాహ వేడుకలకు ముఖ్యఅతిథిగా హాజరైన వైఎస్ఆర్సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షులు కాటసాని రామభూపాల్ రెడ్డి



**కర్నూల్ సిటీ నంది పత్రిక**కర్నూలు: నందికొట్కూరు రోడ్డులోని కమ్మ సంఘంలో నన్నూరు గ్రామానికి చెందిన వైఎస్ఆర్సీపీ రాష్ట్ర మైనారిటీ సెల్ సెక్రటరీ షేక్ అబ్దుల్ గఫార్ సోదరుడు షేక్ సత్తార్ కుమార్తె నిఖా కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై, నూతన దంపతులను ఆశీర్వదించిన వైఎస్ఆర్సిపి నంద్యాల జిల్లా అధ్యక్షులు, పాణ్యం మాజీ ఎమ్మెల్యే కాటసాని రామభూపాల్ రెడ్డి ఆశీర్వదించారు. అనంతరం కర్నూలు నగరంలోని మౌర్య ఇన్ విభు పరిణయ కన్వెన్షన్ హాల్‌లో నిర్వహించిన తోట వెంకటరామిరెడ్డి కుమారుడు దిలీప్ కుమార్ రెడ్డి సాయి సునయన వారి వివాహ రిసెప్షన్ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై నూతన దంపతులను ఆశీర్వదించిన వైఎస్ఆర్సిపి నంద్యాల జిల్లా అధ్యక్షులు,పాణ్యం మాజీ ఎమ్మెల్యే కాటసాని రామభూపాల్ రెడ్డి నూతన వధూవరులను ఆశీర్వదించారు.

## పుల్లీవీడు హెల్త్ క్లినిక్‌లో ఘనంగా పల్స్ పోలియో కార్యక్రమం

**పిల్లలకు పోలియో చుక్కలు వేసిన హ్యూమన్ రైట్స్ నేషనల్ జాయింట్ సెక్రెటరీ కె. మధుబాబు**

**పోరుమామిళ్లజూన్28:(నందిపత్రిక)** వైఎస్సార్ కడప జిల్లా పోరుమామిళ్ల మండల పరిధిలోని పుల్లీవీడు గ్రామపంచాయతీ స్థానిక విలేజ్ హెల్త్ క్లినిక్‌లో పల్స్ పోలియో చుక్కల కార్యక్రమం ఆదివారం అత్యంత విజయవంతంగా నిర్వహించబడింది. దేశాన్ని పోలియో రహితంగా మార్చే ఉద్దేశంతో ప్రభుత్వం చేపట్టిన ఈ బృహత్తర కార్యక్రమంలో భాగంగా ఐదేళ్లలోపు పిల్లలందరికీ సిబ్బంది పోలియో వ్యాక్సిన్ చుక్కలను వేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హ్యూమన్ రైట్స్ నేషనల్ జాయింట్ సెక్రెటరీ కవలకుంట్ల మధుబాబు హాజరయ్యారు. ఆయన స్వయంగా చిన్న పిల్లలకు నోట్లో పోలియో చుక్కలు వేసి ఈ కార్యక్రమాన్ని అధికారికంగా ప్రారంభించారు. పోలియో రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలి, ఈ సందర్భంగా హ్యూమన్ రైట్స్ నేషనల్ జాయింట్ సెక్రెటరీ కవలకుంట్ల మధుబాబు మాట్లాడుతూ, భావితరాల ఆరోగ్య భద్రతకు పల్స్ పోలియో చుక్కలు ఎంతో కీలకమని పేర్కొన్నారు. సమాజంలో శారీరక వైకల్యం అనే మహమ్మారిని శాశ్వతంగా తరిమికొట్టడానికి ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని, దనికి ప్రజల సహకారం ఎంతో అవసరమని అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని తల్లులు, తల్లిదండ్రులు తమ ఐదేళ్లలోపు పిల్లలందరినీ తప్పనిసరిగా దగ్గరలోని పోలియో కేంద్రాలకు తీసుకువచ్చి చుక్కల మందు వేయించాలని పిలుపునిచ్చారు. పోలియో చుక్కలు వేసుకోకుండా మిగిలిపోకూడదనే లక్ష్యంతో మానవతా దృక్పథంతో వైద్య ఆరోగ్య శాఖతో కలిసి హ్యూమన్ రైట్స్ ఆర్గనైజేషన్స్ కూడా తమ వంతు సామాజిక బాధ్యతగా మద్దతు ఇస్తున్నట్లు ఆయన తెలిపారు. క్షేత్రస్థాయిలో ఎండలను సైతం లెక్కచేయకుండా సేవలందిస్తున్న ఆశా వర్కర్లు, ఏఎన్ఎంలు, అంగన్‌వాడీ కార్యకర్తల సేవలను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. ఉత్సాహంగా తరలివచ్చిన తల్లులు ఉదయం నుంచే పుల్లీవీడు హెల్త్ క్లినిక్‌కు స్థానిక ప్రజలు, తల్లులు తమ చిన్న పిల్లలను ఎత్తుకుని ఉత్సాహంగా తరలివచ్చారు. వైద్య సిబ్బంది ప్రణాళికాబద్ధంగా ప్రతి ఒక్క చిన్నారికి చుక్కల మందు వేసి వేలికి సిరా గుర్తును వేశారు. క్లినిక్ పరిసరాల్లో పోలియో ప్రాధాన్యతను తెలిపే అవగాహన పోస్టర్లను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో స్థానిక వైద్యాధికారులు, డాక్టర్ శ్రీవిద్య, కమ్యూనిటీ హెల్త్ ఆఫీస సునీత, ఆశ వర్కర్ జాస్మిన్, అంగన్‌వాడీ టీచర్లు సుభాబి, గ్రామ స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## పోలియోనివారణకు రెండు చుక్కలు తప్పనిసరి

**-5 ఎళ్లలోపు చిన్నారులకు పోలియో చుక్కలు తప్పనిసరి**

**-జిల్లా ప్రోగ్రామ్ ఆఫీసర్... కాంతారావు నాయక్**

**కొత్తపల్లి – నంది పత్రిక :** పోలియో నివారణకు రెండు చుక్కలు తప్పనిసరి అని ప్రతి 5 ఏళ్ళలోపు చిన్నారులకు పోలియో చుక్కలు తప్పనిసరిగా వేయించాలని జిల్లా ప్రోగ్రామ్ ఆఫీసర్ కాంతారావు నాయక్ సూచించారు. ఆదివారం మండల పరిధిలోని కొత్తపల్లి ప్రాథమిక ఆరోగ్యం, గోకవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, ఎర్రమఠం ఆరోగ్య కేంద్రాల పరిధిలోని గ్రామాలలో వైద్యాధికారుల సమక్షంలో జరుగుతున్న పల్సపోలియో కార్యక్రమాన్ని తనిఖీ చేశారు. కార్యక్రమంలో భాగంగా చిన్నారులకు పోలియో చుక్కలు వేసి తల్లిదండ్రులకు పోలియో చుక్కల అవశ్యకతపై అవగాహన కల్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కొత్తపల్లి పీహెచ్సీ పరిధిలో 2079 మంది చిన్నారులు ఉండగా 2053 మంది కి పోలియో చుక్కలు వేసినట్లు వైద్యురాలు దీపానాగవేణి తెలిపారు. అదేవిధంగా గోకవరం పీహెచ్సీ నందు 826 మంది ఉండగా 800 మందికి వేసినట్లు వైద్యురాలు రమ్యక్రిష్ణ వెల్లడించారు. అదేవిధంగా ఎర్రమఠం పీహెచ్సీ పరిధిలో 810 మంది చిన్నారులకు గాను 790 మందికి పోలియో చుక్కలు వేశామని వైద్యురాలు సుష్మసాయి తెలిపారు. మొత్తం మండలంలోని మూడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో 3715 మంది చిన్నారులు ఉండగా 3648 చిన్నారులకు వైద్య, ఆరోగ్య సిబ్బంది పోలియో చుక్కలు వేయడంతో 98.19 శాతం పల్సపోలియో చుక్కల కార్యక్రమం పూర్తి అయిందని వైద్యులు వెల్లడించారు.



## శ్రీ మద్దులేటి లక్ష్మీ నరసింహ దేవస్థానం నందు.... తల నీలాలు ప్రోగు చేసుకునే హక్కు కొరకు బహిరంగ వేలం.





**బేతంచెర్ల జూన్ 28 ( నందిపత్రిక ).** నంద్యాల జిల్లా బేతంచెర్ల మండలం ఆర్ఎస్. రంగాపురం గ్రామ పొలిమేరలో వెలసి ఉన్న, శ్రీ మద్దులేటి లక్ష్మీ నరసింహ స్వామి దేవస్థానం హక్కు భుక్తమైన దేవ స్థాన కళ్యాణ కట్టయందు, శ్రీ స్వామి వారికి భక్తులు సమర్పించు తల నీలాలు సేకరించుకొను హక్కు లైసన్సు మంజూరు చేయుట కొరకు, 29/6/2026 వ తేది అనగా సోమవారం (నేడే) నాడు ఈ– టెండర్, షీల్డ్ టెండర్ మరియు బహిరంగ వేలమును,దేవస్థానము కార్యాలయ ప్రాంగణములో నిర్వహించ బడును. అదేరోజు (సోమవారం) మధ్యాహ్నం శ్రీ స్వామి అమ్మవార్లకు భక్తులు సమర్పించిన వస్త్రాలు సేకరించు కొనుట కొరకు మరియు రూముల యందు మిగులు వంట చెరుకు సేకరించుకొనుట కొరకు మరియు ఇతర లీజుల లైసన్స్ మంజూరు కొరకు, ఉపకమీషనర్ & శ్రీ మద్దులేటి స్వామి దేవస్థానం కార్య నిర్వహణ అధికారి ఎం. రామాంజ నేయులు ఆదివారం ప్రకటన ద్వారా తెలియ జేశారు. ఆసక్తి గలవారు దేవస్థానం వారి షరతులకు లోబడి, వేలం పాటలో పాల్గొన వచ్చునని ఆయన తెలియ జేశారు.



## చెరువును తలపిస్తున్న పోరుమామిళ్ల-మైదుకూరు రోడ్డు ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం



**పోరుమామిళ్ల, జూన్ 28:( నంది పత్రిక)** వైయస్సార్ కడప జిల్లా, పోరుమామిళ్ల మైదుకూరు ప్రధాన రహదారిలో రైస్ మిల్ సమీపంలోని ఆర్ఎంబి రోడ్డు భారీ వర్షానికి పూర్తిగా నీటితో నిండిపోయి చెరువును తలపిస్తోంది. రోడ్డుపై భారీగా వర్షపు నీరు చేరడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా మోటార్ సైకిళ్లు, కార్లు వెళ్లలేని పరిస్థితి నెలకొంది. దీంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది.ప్రజలు, ప్రయాణికులు ప్రాణాలకు తెగించి ప్రయాణించాల్సిన పరిస్థితి ఏర్పడిందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ సమస్యపై సంబంధిత అధికారులు వెంటనే స్పందించి రోడ్డుపై నిల్వ ఉన్న నీటిని తొలగించి ట్రాఫిక్‌ను సాధారణ స్థితికి తీసుకురావాలని హ్యూమన్ రైట్స్ రాష్ట్ర కార్యదర్శి ముత్యాల ప్రసాద్ రావు డిమాండ్ చేశారు. ప్రజల ప్రాణ భద్రత దృష్ట్యా తక్షణ చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

## నూతన గృహప్రవేశ కార్యక్రమంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే గంగుల బ్రీజేంద్రారెడ్డి.



**రుద్రవరం ప్రతినిధి జూన్ 28 (నంది పత్రిక):** మండలంలోని మాచినేనిపల్లి గ్రామంలో ఆదివారం నూతన గృహ ప్రవేశం కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే గంగుల బ్రీజేంద్రారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాచినేని పల్లి గ్రామానికి చెందిన గోడౌన్ మందపాటి గోపాల్ నూతన స్వగృహ ప్రవేశం కార్యక్రమంలో పాల్గొనడానికి వచ్చిన మాజీ ఎమ్మెల్యే గంగుల బ్రీజేంద్రారెడ్డి కి పూలమాలలతో స్వాగతం పలికి పుష్ప గుచ్చాలు అందజేశారు. నూతన గృహ ప్రవేశం కార్యక్రమానికిఅక్కడికి వచ్చిన నాయకులు కార్యకర్తలను పేరుపేరునా మాజీ ఎమ్మెల్యే పలకరించి క్షేమ సమాచారాలను అడిగి తెలుసుకున్నారు.

## పల్స్ పోలియో విజయవంతం.... డాక్టర్ నాగశ్రీజా రెడ్డి.



**రుద్రవరం ప్రతినిధి జూన్ 28 (నంది పత్రిక):** మండలంలోని ఆలమూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో ఆదివారం నిర్వహించిన పల్స్ పోలియో కార్యక్రమం విజయవంతమైంది. డాక్టర్ నాగశ్రీజా రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన పల్స్ పోలియో కార్యక్రమంలో 94 శాతం చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. ఆలమూరు ఆరోగ్య కేంద్రం పరిధిలో0 నుంచి 5 సంవత్సరాలలోపు చిన్నారులు 3206 ఉండగా 3008 చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. మిగిలిన వారికి వారి ఇంటి దగ్గరికి వెళ్లి పోలియో చుక్కలు వేయడం జరుగుతుందని వైద్య సిబ్బంది తెలిపారు.

# హరీష్ రావు మీ స్వార్థ రాజకీయాల కోసం ఆంధ్రప్రదేశ్ పైన విషం కక్కుతారా!

## మాదిగ కార్పొరేషన్ డైరెక్టర్ మరియు టిడిపి పార్టీ రాష్ట్ర కార్యదర్శి ధరూర్ జేమ్స్

**కర్నూల్ సిటీ నంది పత్రిక** 70 ఏళ్లుగా తెలంగాణా , కర్ణాటక,ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ల మధ్యన కొనసాగుతున్న జల వివాదాలను సామరస్య పూర్వకంగా పరిష్కరించి మూడు రాష్ట్రాల ప్రజలకు తాగునీరు,సాగునీరు అందించాలని సత్సంకల్పంతోమూడు రాష్ట్రాల ముఖ్యమంత్రులు పెద్దలు నారా చంద్రబాబు నాయుడు , పెద్దలు డీకే .శివకుమార్ ,పెద్దలు ఏనుముల రేవంత్ రెడ్డి ముందుకు సాగుతున్న ఉంటే అదిచూసి ఓర్వలేని బి ఆర్ యస్ నాయకులు ,మూడు రాష్ట్రాల మధ్యన 70 ఏళ్లుగా కొనసాగుతున్న జల వివాదాలు పరిష్కారం ఐతే తెలంగాణాలో , బిఆర్ఎస్ ఆంధ్రప్రదేశ్ లో వైస్సార్సీపీ పార్టీల రాజకీయ భవితవ్యం ప్రశ్నార్థకం ఔతుంది, బి ఆర్ ఎస్ ,వైస్సార్సీపీ పార్టీలు అస్థిత్వాన్ని కోల్పోతాయి అనే భయాందోళనతో తెలంగాణా రాష్ట్రానికి చెందిన మాజీ జలవనరుల శాఖ మాత్యులు,కెసిఆర్ మేనల్లుడు, బిఆర్ఎస్ నాయకుడు హరీష్ రావు తెలంగాణా రాష్ట్ర ప్రజలను రెచ్చగొట్టి రాజకీయ ప్రయోజనాలు పొందే ప్రయత్నంలో బాగంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోనీ కర్నూలు జిల్లా,కొడుమూరు నియోజకర్గంలో నిర్మించతలపెట్టిన గుండ్రేవుల ప్రాజెక్టు పైన విషం కక్కడం అత్యంత బాధాకరం,ఆవేదనా భరితం.ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో నేను ముఖ్యమంత్రిని కాలేను ఎలాగైనా తెలుగు రాష్ట్రాలను విడదీయాలి, ఉమ్మడి రాష్ట్రాన్ని ముక్కలు చేయాలి అలాగైతేనే నేను ముఖ్యమంత్రి కాగలను అని కుట్రపూరితంగా ఆలోచించిన నీ మామ కెసిఆర్ కుట్రలో భాగస్వామిగా ఉన్న నీ మామ కెసిఆర్ తో కలిసి నీళ్ళు, నిధులు,నియామకాలు అంటూ,సీమాంధ్రగుండాలు,సీమాంధ్ర రౌడీలు,సీమాంధ్ర దోపిడీదారులు అంటూ, సీమాంధ్రుల నాలుకచీరేస్తాం,సీమాంధ్రులను బొందపెట్టి పాతేస్తాం అంటూ తెలంగాణా ప్రజల దృష్టిలో ఆంధ్రప్రదేశ్ ప్రజలను దోషులుగా చిత్రీకరించి రాష్ట్రవిభజనకు కారణం ఐన మీరు రాష్ట్ర విభజన జరిగి 12 ఏళ్లు ఔతున్నా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రమైన విషం చిమ్మటం మానుకోక పోవటం విచారకరం హరీష్ రావు మీ స్వార్థ రాజకీయాల ప్రయోజనాలకోసం వై యస్ జగన్ మోహన్ రెడ్డి నీ(ఆర్టికల్-3 ప్రకారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని



విడదీయండి అంటూ వైస్సార్ కాంగ్రెస్ పార్టీ తరపున ఆనాడు కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటుచేసిన విభజన కమిటీకి జగన్ మోహన్ రెడ్డి లేక ఇవ్వటం జరిగింది), కాంగ్రెస్ పార్టీ అధినాయకులను ఉపయోగించుకుని రాష్ట్రాన్ని ముక్కలు చేసింది మీరు కాదా

**హరీష్ రావు గారు?** మీకు, మీ మామ కెసిఆర్ కు రాజకీయబిక్షపెట్టి ,తెలంగాణా ప్రాంత అభివృద్ధిలో ఎంతో కీలకపాత్ర పోషించిన ప్రియతమనేత చంద్రబాబు నాయుడు నవ్యాంధ్ర ప్రదేశ్ ముఖ్యమంత్రిగా కొనసాగినట్లయితే ఆంధ్రప్రదేశ్ అబివృద్ధి సాధిస్తుంది , చంద్రబాబు తో మేము పోటీపడలేము, తెలంగాణా వెనుకబడిపోతుంది అనే సంకుచితమైన ఆలోచనతోటీడీపీ నీ అంతం చేయటానికి, చంద్రబాబు నీ రాజకీయంగా దెబ్బతీటానికి వై యస్ జగన్ మోహన్ రెడ్డి కి అన్నివిధాలుగా సహకరించి 2014 ఎన్నికలలో టీడీపీ ఓడించటం కోసం జగన్ మోహన్ రెడ్డి నీ గెలిపించటం కోసం ప్రయత్నం చేసిన విశ్వాసఘాతకులు మీ మామ కెసిఆర్ మీరు కాదా హరీష్ రావు తెలంగాణా రాష్ట్ర ఆవిర్భావం తరువాత తెలంగాణా ప్రాంతంలో స్థిరపడిపోయిన సీమాంధ్రుల ఓట్లకోసం ,2014 ఎన్నికలలో గెలవటం కోసం "సీమాంధ్రుల కాలికి ముళ్ళు కుచ్చుకుంటే నా పంటితో తీస్తాను" అంటూ భూటకపు మాటలు మీ మామ కెసిఆర్ చెప్పలేదా హరీష్ రావు అలాంటి మీరు నేడు మీ రాజకీయ ప్రయోజనాలకోసం, బి ఆర్ఎస్ పార్టీ

**అస్థిత్వాన్ని కాపాడుకోవటం కోసం నిస్వార్థ ప్రజాసేవకుడు** ,తెలుగుప్రజలు ఎక్కడవున్నా వారు బాగుండాలి అనే సహృదయంతో తెలుగుజాతి సంక్షేమం కోసం పరితపించే మా పెద్దాయన చంద్రబాబు నాయుడు పైన విమర్శలు చేస్తూ గుండ్రేవుల ప్రాజెక్టు పైన తప్పుడు ఆరోపణలు చేస్తూ కర్నూలు జిల్లా రైతులకు ద్రోహం చేయాలని చూడటం ఎంతవరకు సమంజసం హరీష్ రావు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఉత్తర తెలంగాణకు నష్టం కలిగించేవిధంగా మహారాష్ట్ర ప్రభుత్వం వారు బాబ్లీ ప్రాజెక్టును ఎత్తు పెంచటానికి వీలులేదు అంటూ నాడు ప్రతిపక్షనేతగా వున్న చంద్రబాబు నాయుడు బాబ్లీ ప్రాజెక్టు సందర్శనకువెళ్లి తెలంగాణా రైతుల పక్షాన పోరాడి మహారాష్ట్ర పోలీసుల నిర్బంధంలో మూడురోజులపాటువున్నారు అటువంటి చంద్రబాబు నాయుడు నీ ఉద్దేశించి తనశిష్యుడు రేవంత్ రెడ్డి నీ అడ్డుపెట్టుకుని కేంద్రంలో తనకున్న పలుకుబడి ఉపయోగించుకుని తెలంగాణా నీటి హక్కులకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు విఘాతం కలిగిస్తున్నారు అంటూ

తప్పుడు ఆరోపణలు చేయటానికి నీకు సిగ్గుందా హరీష్ రావు తెలంగాణా రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ తరపున ముఖ్యమంత్రిగా వ్యవహరిస్తున్న రేవంత్ రెడ్డి కి బి ఆర్ యస్ పార్టీ కి చెందిన మీకు ఉన్న రాజకీయపరమైన విబేధాలు ఎన్నైనా వుండవచ్చు వాటికి ఆంధ్రప్రదేశ్రాష్ట్రానికి ,ప్రియతమనేత చంద్రబాబు నాయుడు కి ఏమిటి సంబంధం హరీష్ రావు 70 ఏళ్లుగా మూడు రాష్ట్రాల మధ్య కొనసాగుతున్న జల వివాదాలు పరిష్కారం అయ్యి, మూడు రాష్ట్రాల ప్రజలు సంతోషంగా ఉండటం మీకు ఇష్టం లేదా హరీష్ రావు దయచేసి మీ తెలంగాణా రాజకీయాలు మీరు చూసుకోండి .తప్పుడు ఆరోపణలు చేస్తూ తెలంగాణా ప్రజలను రెచ్చగొట్టి మీ బిఆర్ఎస్ పార్టీ రాజకీయ ప్రయోజనాలు కాపాడుకోవటం కోసం మా రాష్ట్రంపైన, మా ముఖ్యమంత్రి

నారా చంద్రబాబు నాయుడు పైన, మా సాగునీటి ప్రాజెక్టుల పైన తప్పుడు ఆరోపణలు చేయటం మానుకోండి హరీష్ రావు అంటూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రజానీకం తరపున,రాయలసీమ కరువు ప్రాంతం కర్నూలు జిల్లా ప్రజలపక్షణా చేతులు జోడించి నమస్కరిస్తూ సవినయంగా కోరుతున్నాము.

## భారత సైన్యంలో ఎంపికై ఏపీఎంఎస్ రుద్రవరం ఖ్యాతిని చాటిన పూర్వ విద్యార్థి ఉల్లెడ సురేష్...



**రుద్రవరం ప్రతినిధి జూన్ 28 (నంది పత్రిక):** నంద్యాల జిల్లా రుద్రవరం మండలం పందిర్లపల్లె గ్రామానికి చెందిన ఉల్లెడ సురేష్ (తండ్రి: ఉల్లెడ ఎల్లయ్య, తల్లి: చెన్నమ్మ) భారతదేశ అత్యున్నత సేవా సంస్థ అయిన భారత సైన్యం లో ఉద్యోగానికి ఎంపిక కావడం పట్ల రుద్రవరం ఏపీ మోడల్ స్కూల్ మరియు కళాశాలహర్షం వ్యక్తం చేస్తోంది.రుద్రవరం ఆదర్శ పాఠశాలలో చదువుకున్న సురేష్ చిన్ననాటి నుంచే క్రమశిక్షణ, దేశభక్తి, అంకితభావంతో ముందుకు సాగి తన లక్ష్యాన్ని సాధించడం ప్రతి ఒక్కరికీ గర్వకారణం. సాధారణ కుటుంబం నుంచి వచ్చిన ఆయన కఠోర శ్రమ, పట్టుదల, ఆత్మవిశ్వాసంతో భారత సైన్యంలో స్థానం సంపాదించడం నేటి విద్యార్థులకు గొప్ప స్ఫూర్తిదాయకం.ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ సంగెపు నాగేశ్వరరావు మాట్లాడుతూ,మన పాఠశాల పూర్వ విద్యార్థి భారత మాత సేవకు అంకితమయ్యే భారత సైన్యంలో ఎంపిక కావడం మన పాఠశాలకు ఎంతో గర్వకారణం. సురేష్ సాధించిన విజయం ప్రస్తుత విద్యార్థులకు స్ఫూర్తిగా నిలిచి, మరెందరో ఉన్నత లక్ష్యాలను చేరుకునేలా ప్రేరణ కలిగించాలని ఆకాంక్షిస్తున్నాం" అని తెలిపారు.పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు మరియు గ్రామ ప్రజలు,పెద్దలు, స్నేహితులు సురేష్‌కు హృదయపూర్వక అభినందనలు తెలియజేస్తూ, దేశ సేవలో ఆయన మరెన్నో విజయాలు సాధించి ఉన్నత పదవులు అలంకరించాలని ఆకాంక్షించారు. పట్టుదల ఉంటే పల్లె నుంచి కూడా దేశ రక్షకుడిగా ఎదగవచ్చు అనే విషయాన్ని ఉల్లెడ సురేష్ మరోసారి నిరూపించారు. ఆయన విజయం ఏపీఎంఎస్ రుద్రవరం కుటుంబానికే కాదు, నంద్యాల జిల్లాకే గర్వకారణం అని అన్నారు.

## బేతంచెర్ల మండలం ఎం. పెండెకల్ లో యువకుడు సూ సైడ్.



**బేతంచెర్ల జూన్ 28 ( నందిపత్రిక ).** బేతంచెర్ల మండలంలోని ఎం.పెండే కల్ గ్రామానికి చెందిన జయరాముడు అనే యువకుడు ఆదివారం నాడు ఉరి వేసుకున్నట్లు స్థానికులు తెలియజేశారు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే ఆస్పత్రికిహుటా హుటిన తరలించారు.ఆస్పత్రిలో డాక్టర్లు పరిశీలించగా,అప్పటికే అతడు ప్రాణాలు కోల్పోయాడని నిర్ధారించారు. ఈ వార్త విన్న ఎం పెండేకల్ నివాసితులు తీవ్ర దిగ్భ్రాంతికి లోనయ్యారు.

## ఊటుకూరులో హైబ్రోలు ప్రార్థన మందిరం స్థాపన... చర్చ్ పాస్టర్ కోరికల ఆధ్వర్యంలో భూమి పూజ చేసిన పుత్త నరసింహారెడ్డి.

**నంది ప్రతినిధి, జూన్ 28, వైఎస్ఆర్ కడప జిల్లా.** వేరొక నాయన పల్లి మండలం ఊటుకూరులో ఎలక్షన్ ముందు ఇచ్చిన మాట నిలబెట్టుకున్న పుత్తా నరసింహారెడ్డి. 20 24 ఎలక్షన్ ముందు ఊటుకూరు ఎస్సీ కాలనీకి ప్రచారం కు వచ్చిన నరసింహారెడ్డి కాలనీ ప్రజలు స్థానిక రోడ్లు, చర్చి కావాలని కోరడంతో మాట ఇచ్చిన నరసింహారెడ్డి.చర్చి భూమి పూజకు హాజరై చర్చి కాంపౌండ్, స్థలం విద్యుత్ సౌకర్యం సిసి రోడ్ కూడా ఇప్పించి తమకి ఎస్సీల మీద ఉన్న గౌరవాన్ని చాటుకున్నారు. ఊటుకూరు గ్రామ ప్రజలకు ఏ పని కావాలి అన్నా నన్ను అడగండి అభివృద్ధి చేయడానికి నేను ఉన్నాను అంటూ హామీ..పెద్ద లీడర్ అయినా ఇచ్చిన మాట మీద వచ్చి చర్చి స్థాపనకు తమ కృషి పట్ల గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. నమ్మిన వారి కోసం ఎంతైనా ఉంటారు పుత్త కుటుంబం అనటానికి ఇదే గొప్ప నిదర్శనం అంటున్న స్థానికులు....

## మొక్కజొన్న రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలి.. సిపిఐ, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం డిమాండ్



**బనగానపల్లె జూన్ 28 నందిపత్రిక** మొక్కజొన్న రైతు కు గిట్టుబాటుధర కల్పించాలని ఏపీ రైతు సంఘం సీపీఐ డిమాండ్ చేశాయి. ఆదివారం పలుకూరు గ్రామంలో రైతులతో కలిసి 30న జరిగే చలో విజయవాడ కార్యక్రమానికి రైతులు తరలి రావాలని పిలుపునిచ్చారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇవాళ రాష్ట్రంలో వరి పంట తర్వాత ఎక్కువ సాగు చేసే పంట మొక్కజొన్న మొక్కజొన్న పంటచేతికి వచ్చే సరికి ధర లేక రైతులు దళారులకు అమ్మి తీవ్రంగా నష్టపోతున్నారు పంట వచ్చే సరికి ప్రభుత్వం మద్దతు ధర ఇవ్వాలి కానీ రైతులు బయట మార్కెట్లో తక్కువ ధరకు అమ్ముకొని నష్టపోయిన మొక్కజొన్న రైతులకు ప్రభుత్వ హామీ ప్రకారం ధరల వ్యత్యాస పథకం కింద ఎకరానికి 21000 చొప్పున చెల్లించాలని కోరారు అదే విధంగా ఉద్యాన పంటలకు మద్దతు ధర ఇవ్వాలి తోతాపూరి మామిడి ట న్నుకు రూ 18000 బంగినపల్లి మామిడి..కి 25000..జీడి మామిడి 80 కేజీల బస్తా 16000 కోకో గింజలు కిలో 1100 చొప్పున ప్రభుత్వమే కొనుగోలు చేయాలని సాగునీటి సౌకర్యాలు మెరుగుపరిచి సాగునీటి ప్రాజెక్టుల కాలువ నిర్మాణం చేపట్టాలి పంట కాలువలలో ఉన్న పూడిక గుర్రపు డెక్క తోడికాడలను తొలగించి ఎత్తిపోతల పథకాలకు మరమ్మత్తులు చేపట్టి చెరువుల ఆక్రమణలు తొలగించి కట్టలను బలోపేతం చేయాలి వ్యవసాయ సంక్షోభం వలన అప్పుల బాధతో ఆత్మహత్య చేసుకున్న ఒక్కో కుటుంబానికి 7 లక్షల చొప్పున పరిహారం అందించాలని 50 సంవత్సరాలు పైబడిన ప్రతి రైతుకు పదివేలు పెన్షన్ ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. ఈ సమస్యల పైన ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఈనెల 30 తారీఖున చలో విజయవాడ కార్యక్రమం చేపట్టింది కావున అన్నదాత రైతన్నకు అండగా అన్ని వర్గాల ప్రజలు మద్దతు తెలపాలని ఈ ధర్నాలో రైతులు స్వచ్ఛందంగా పాల్గొని ధర్నాను విజయవంతం చేయాలని పలుకూరు గ్రామ రైతులకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి శివయ్య రైతు సంఘం జిల్లా అధ్యక్షులు సుబ్బారెడ్డి పలుకూరు సిపిఐ కార్యదర్శి బాలయ్య చిన్న బాలయ్య వెంకటేశ్వర్లు మధుశేఖర్ తదితరులు పాల్గొన్నారు

## శ్రీ నిమిషాంబా దేవి ఆలయానికి రూ.5 లక్షల భారీ విరాళం.. ...

### ఆలయ అభివృద్ధికి ప్రముఖ వ్యాపారవేత్త గోళ్ళ రాజేష్ చేయూత



**నంద్యాల సిటీ బ్యూరో జూన్ 28 ( నంది పత్రిక )** నంద్యాల పట్టణంలోని శ్రీ నిమిషాంబా దేవి ఆలయ అభివృద్ధి కోసం ప్రముఖ వ్యాపారవేత్త, దాత గోళ్ళ రాజేష్ రూ.5 లక్షల భారీ విరాళాన్ని అందజేశారు. ఆలయ అభివృద్ధి కార్యక్రమాలు మరింత వేగవంతం కావాలనే ఉద్దేశంతో ఈ విరాళాన్ని సమర్పించినట్లు ఆయన తెలిపారు.ఈ సందర్భంగా ఆలయ నిర్వహకులు మాధవ,సురేష్,విజయ్,వీరన్న,నాగేశ్వరరావు, సాయివర్మ గోళ్ళ రాజేష్‌కు ప్రత్యేకంగా కృతజఅభిప్రాయపడ్డారు. అమ్మవారి సేవలో భాగంగా అందించిన ఈ విరాళం ఆలయ అభివృద్ధికి ఎంతో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. అలాగే శ్రీ నిమిషాంబా అమ్మవారి కృపాకటాక్షాలు గోళ్ళ రాజేష్ పై ఎల్లప్పుడూ ఉండాలని ఆశీర్వదించారు. గోళ్ళ రాజేష్ దాతృత్వాన్ని పట్టణ ప్రముఖులు, భక్తులు అభినందిస్తూ, సమాజానికి ఆదర్శంగా నిలిచే సేవా కార్యక్రమమని కొనియాడారు.

ఊటుకూరులో హైబ్రోలు ప్రార్థన మందిరం స్థాపన...

చర్చ్ పాస్టర్ కోరికల ఆధ్వర్యంలో భూమి పూజ చేసిన పుత్త నరసింహారెడ్డి.

నంది ప్రతినిధి, జూన్ 28, వైఎస్ఆర్ కడప జిల్లా. వేరొక నాయన పల్లి మండలం ఊటుకూరులో ఎలక్షన్ ముందు ఇచ్చిన మాట నిలబెట్టుకున్న పుత్తా నరసింహారెడ్డి. 20 24 ఎలక్షన్ ముందు ఊటుకూరు ఎస్సీ కాలనీకి ప్రచారం కు వచ్చిన నరసింహారెడ్డి కాలనీ ప్రజలు స్థానిక రోడ్లు, చర్చి కావాలని కోరడంతో మాట ఇచ్చిన నరసింహారెడ్డి.చర్చి భూమి పూజకు హాజరై చర్చి కాంపౌండ్, స్థలం విద్యుత్ సౌకర్యం సిసి రోడ్ కూడా ఇప్పించి తమకి ఎస్సీల మీద ఉన్న గౌరవాన్ని చాటుకున్నారు. ఊటుకూరు గ్రామ ప్రజలకు ఏ పని కావాలి అన్నా నన్ను అడగండి అభివృద్ధి చేయడానికి నేను ఉన్నాను అంటూ హామీ..పెద్ద లీడర్ అయినా ఇచ్చిన మాట మీద వచ్చి చర్చి స్థాపనకు తమ కృషి పట్ల గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. నమ్మిన వారి కోసం ఎంతైనా ఉంటారు పుత్త కుటుంబం అనటానికి ఇదే గొప్ప నిదర్శనం అంటున్న స్థానికులు....



## నంద్యాలలో హోటల్‌పై ఫుడ్ ఇన్‌స్పెక్టర్ ఆకస్మిక తనిఖీ






**నంద్యాల సిటీ బ్యూరో జూన్ 28 ( నంది పత్రిక )**నంద్యాల పట్టణంలోని ఫరూక్ నగర్‌లో ఉన్న ఓ హోటల్‌లో విక్రయించిన చికెన్‌లో బొద్దింక కనిపించిందని వినియోగదారుడి నుంచి ఫిర్యాదు అందడంతో ఫుడ్ ఇన్‌స్పెక్టర్ వెంకటరాముడు ఆకస్మికంగా హోటల్‌ను తనిఖీ చేశారు. తనిఖీల సందర్భంగా వంటగది పరిశుభ్రత, ఆహార పదార్థాల నిల్వ విధానం, వంట నాణ్యత, సిబ్బంది పరిశుభ్రత, హోటల్ లైసెన్స్‌లు, ఫుడ్ సేఫ్టీ నిబంధనల అమలు వంటి అంశాలను క్షుణ్ణంగా పరిశీలించారు. ఆహార పదార్థాల తయారీ, నిల్వలో పరిశుభ్రత ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని హోటల్ యాజమాన్యానికి సూచించారు. ఆహార భద్రతా నిబంధనలను ఉల్లంఘించినట్లు తేలితే సంబంధిత హోటల్ యాజమాన్యంపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఫుడ్ ఇన్‌స్పెక్టర్ వెంకటరాముడు హెచ్చరించారు. ప్రజలకు నాణ్యమైన, సురక్షితమైన ఆహారం అందించడం ప్రతి ఆహార వ్యాపారి బాధ్యత అని ఆయన పేర్కొన్నారు. ప్రజలు కూడా ఆహార నాణ్యతపై ఏవైనా సందేహాలు లేదా ఫిర్యాదులు ఉంటే వెంటనే ఫుడ్ సేఫ్టీ అధికారులకు సమాచారం అందించాలని అధికారులు కోరారు.





# కాకనూరులో బాలుడు అదృశ్యం



**బండి ఆత్మకూరు నంది పత్రిక జూన్ 28:** బండి ఆత్మకూరు పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న కాకనూరు గ్రామంలో చెవిటి నాగచరణ్(9) అనే బాలుడు అదృశ్యమయ్యాడు. ఆదివారం ఉదయం ఆడుకోవడానికి బయటికి వెళ్లిన నాగ చరణ్ రాత్రి వరకు ఇంటికి చేరకపోవడంతో కుటుంబ సభ్యులు ఆందోళనలో పడిపోయారు. ఈ విషయంపై నావచరణ్ తల్లి ఈశ్వరమ్మ ఆదివారం రాత్రి పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఎస్ఐ జగన్మోహన్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. గ్రామంలో 9 ఏళ్ల బాలుడు కనిపించకుండా పోవడంతో గ్రామ ప్రజలలో ఆందోళన వ్యక్తం అవుతూ ఉంది.

# చిన్నారులకు విజయవంతంగా పోలియో చుక్కలు ..



**బనగానపల్లె జూన్ 28నందిపత్రిక** పోలియో వ్యాధి బారిన పడకుండా 0 నుండి 5 సంవత్సరాల లోపు చిన్నారులకు వేసే పోలియో చుక్కలమందు కార్యక్రమాన్ని ఆదివారం వైద్య, ఆరోగ్య సిబ్బంది విజవంతంగా నిర్వహించారు. బనగానపల్లె నియెజకవర్గం లొని అన్ని మండల కేంద్రాలు గ్రామాల్లో ఈ కార్యక్రమాన్ని కొనసాగించారు. కార్యక్రమం లో ఆరోగ్య సిబ్బంది తో పాటు ఆయా గ్రామాల్లోని ప్రముఖులు చుక్కల మందు కార్యక్రమాన్ని ప్రారంభించారు. కోవెలకుంట్ల లో నంద్యాల జిల్లా మహిళా మండలి అధ్యక్షురాలు పెండేకంటి విజయ లక్ష్మి చిన్నారులకు చుక్కల మందు వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు.బనగానపల్లె మండలంలోని మీరాపురం గ్రామ సచివాలయంలో ఏర్పాటు చేసిన పోలియో చుక్కల కార్యక్రమంలో మీరాపురం గ్రామ టిడిపి యువ నాయకులు బత్తుల నారాయణరెడ్డి పాల్గొని ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు .ఈ సందర్భంగా బత్తుల నారాయణరెడ్డి మాట్లాడుతూ ఐదేళ్లలోపు పిల్లలకు నూటికి నూరు శాతం మందికి పోలియో చుక్కలు వేసేందుకు వైద్య ఆరోగ్యశాఖ,శిశు సంక్షేమ శాఖ, పంచాయతీరాజ్,సమన్వయం తో పనిచేస్తున్నాయని చెప్పారు. పల్స్ పోలియో కార్యక్రమాలు అన్ని ఏర్పాట్లు చేశారని చెప్పారు. 0-5 సంవత్సరాల మధ్య వయసున్న పిల్లలకు పోలియో చుక్కలు వేసేందుకు సిబ్బందిని మండల అధికారులను ప్రభుత్వం నియమించినట్లు పేర్కొన్నారు. గ్రామీణ,అర్బన్ ప్రాంతాలను కలుపుకుని పోలింగ్ బూతులలో పోలియో చుక్కలు వేస్తారన్నారు.జన రద్దీ ప్రాంతాలు,బస్టాండ్లు, రైల్వేస్టేషన్లలో పోలియో చుక్కలు వేసేందుకు ప్రత్యేక బృందాలు,మొబైల్ టీంలను కూడా ఏర్పాటు చేసినట్లు వివరించారు.ప్రతి అంగన్వాడీ కేంద్రంలోనూ పోలియో చుక్కలు వేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకొన్నట్లు తెలిపారు. తొలిరోజు మిగిలిపోయిన చిన్నారులను గుర్తించేందుకు 29, 30వ తేదీల్లో గృహ సందర్శన కార్యక్రమాన్ని చేపట్టి,ప్రతి బిడ్డకు పోలియో చుక్కలు వేసే విధంగా చర్యలు తీసుకున్నట్లు చెప్పారు.తహసీల్దార్లు,ఎంపీడీఓలు,సిడిపిఓలు మరియు స్వచ్ఛంధ సంస్థలను సమన్వయం చేసుకొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ప్రజలు భాగస్వామ్యంతో పల్స్ పోలియో కార్యక్రమం విజయవంతం అవుతుందని,ఐదేళ్లలోపు పిల్లలందరినీ పోలియో చుక్కల మందు కేంద్రాలకు తరలించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. బత్తుల నారాయణరెడ్డి. ఈ కార్యక్రమంలో ఎఎన్ఎం లు, ఆశ వర్కర్లు మరియు టీడీపీ నాయకులు గోపినాథ్,దాదాబాషా పాల్గొన్నారు.

## ప్రతి చిన్నారికి పోలియో చుక్కలు వేయించాలి

### మండల స్పెషల్ ఆఫీసర్ హరి గోపాల్

### రెండు పోలియో చుక్కలు నిండు జీవితానికి బంగారు భవిష్యత్తు - ఎంపీడీవో నూర్జహాన్ బేగం



**ఆళ్లగడ్డ ప్రతినిధి జూన్ 28 నంది పత్రిక** ఆదివారం పల్స్ పోలియో కార్యక్రమంలో విజయవంతం అయిందని మండల స్పెషల్ ఆఫీసర్ హరి గోపాల్ ఎంపీడీవో నూర్జహాన్ బేగం తెలిపారు. ఆళ్లగడ్డ అర్బన్ పీహెచ్సీలో మండల స్పెషల్ ఆఫీసర్ హరి గోపాల్ ఎంపీడీవో నూర్జహాన్ బేగం పీహెచ్ఎస్సి డాక్టర్ నరసింహ తో కలిసి పిల్లలకు పల్స్ పోలియో చుక్కలు వేశారు. అలాగే ఆళ్లగడ్డ ఆర్టీసీ బస్టాండు ప్రయాణికుల సంబంధించిన పోలియో కేంద్రాన్ని తనిఖీ చేసి అనంతరం పిల్లలకు ఆరోగ్య సిబ్బంది ఆశా వర్కర్లతో కలిసి పోలియో చుక్కలు వేశారు మండలంలో. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 0 - 5 సంవత్సరాల లోపు చిన్నపిల్లల అందరికీ పల్స్ పోలియో చుక్కలు వేయించాలన్నారు. పిల్లల బంగారు భవిష్యత్తుకు పోలియో చుక్క లు వేయించడం మన బాధ్యత అన్నారు .రెండు చుక్కలు నిండు జీవితానికి బంగారు భవిష్యత్తు అవుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# వెలుగోడులో కార్డాన్ అండ్ సెర్చ్: అక్రమ మద్యం విక్రేత అరెస్ట్, 12 బాటిళ్లు స్వాధీనం

**వెలుగోడు, జూన్ 28నంది పత్రిక:** వెలుగోడు మరియు అబ్దుల్లాపురం గ్రామాలలో ఆదివారం వేకువజామున పోలీసులు భారీ కార్డాన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు. వెలుగోడు ఎస్ఐ సురేష్ తెలిపిన వివరాల ప్రకారం... ఈ తనిఖీలలో భాగంగా వెలుగోడు గ్రామంలోని గుర్రంపేటకు చెందిన వడ్డే నాగరాజు అనే వ్యక్తి తన బంకు వద్ద అక్రమంగా మద్యం విక్రయిస్తూ పట్టుబడ్డాడు.పోలీసులు అతనిని అదుపులోకి తీసుకుని, అతని వద్ద నుండి 12(180ఎంఎల్) మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు. మండలంలో ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలు సాగినా సహించేది లేదని, చట్టవ్యతిరేక పనులకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఈ సందర్భంగా ఆయన హెచ్చరించారు.



# కె.వి. సుబ్బారెడ్డి ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఫార్మసీ (అటానమస్), కర్నూలులో ఘనంగా గ్రాడ్యుయేషన్ డే వేడుకలు



**కర్నూల్ సిటీ నందిపత్రిక**కర్నూలు కె.వి. సుబ్బారెడ్డి ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఫార్మసీ (అటానమస్), గ్రాడ్యుయేషన్ డే వేడుకలు అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కళాశాల యాజమాన్యం, అధ్యాపకులు, తల్లిదండ్రులు, పూర్వ విద్యార్థులు మరియు పట్టభద్రులు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ కార్యక్రమానికి ప్రభుత్వ సర్వజన వైద్యశాల (జి జి హెచ్ ), కర్నూలు సూపరింటెండెంట్ ప్రొఫెసర్ డా. కె. వెంకటేశ్వర్లు, ఎం.ఎస్. (ఆర్థో) ముఖ్య అతిథిగా విచ్చేసి పట్టభద్రులను ఉద్దేశించి ప్రసంగించారు. ఫార్మసీ విద్యార్థులు తమ విద్యను సమాజ సేవకు వినియోగించుకోవాలని, వృత్తి నైతిక విలువలను ఎల్లప్పుడూ పాటించాలని, రోగుల సంక్షేమమే తమ ప్రధాన లక్ష్యంగా భావించాలని సూచించారు. ప్రపంచవ్యాప్తంగా ఫార్మసీ రంగంలో ఉన్న అవకాశాలను సద్వినియోగం చేసుకొని పరిశోధన, ఆవిష్కరణల వైపు అడుగులు వేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమం కళాశాల చైర్మన్ డా. కె.వి. సుబ్బారెడ్డి ఆధ్వర్యంలోనిర్వహించబడింది. సెక్రటరీ & కరస్పాండెంట్ ఎస్. విజయలక్ష్మమ్మ మాట్లాడుతూ గ్రాడ్యుయేషన్ అనేది విద్యార్థుల జీవితంలో ఒక ముఖ్యమైన మైలురాయి అని పేర్కొంటూ, నిజాయితీ, క్రమశిక్షణ, సేవాభావంతో సమాజానికి ఆదర్శంగా నిలవాలని సూచించారు.ప్రిన్సిపాల్ డా. బి.వి. రమణ మాట్లాడుతూ విద్యార్థులు కళాశాలలో పొందిన విజ్ఞానం, నైపుణ్యాలను సమర్థవంతంగా వినియోగించుకొని దేశ ఆరోగ్య రంగ అభివృద్ధికి తోడ్పడాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో డా. జె. గోపాల కృష్ణ (డైరెక్టర్ రీసెర్చ్ & డెవలప్మెంట్), డా. కె. చంద్రశేఖర్ (ఐ క్యూ ఏ సి కోఆర్డినేటర్), డా. ఎం. రామచంద్ర (కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్), డా. ఎన్.డి. నిజాముద్దీన్ (ప్రొఫెసర్ & హెడ్, బి.ఫార్మసీ), డా. బి. అరుణ (ప్రొఫెసర్ & హెడ్, ఫార్మ్.డి), డా. సి. ఎస్. పరమేశ్వరి (ప్రొఫెసర్ & హెడ్, ఎం.ఫార్మసీ), ఇతర విభాగాధిపతులు, అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది, తల్లిదండ్రులు మరియు పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.అనంతరం పట్టభద్రులకు డిగ్రీ సర్టిఫికెట్లను ఘనంగా ప్రదానం చేశారు. విద్యార్థులు ఫార్మసీ వృత్తి నైతిక విలువలను పాటిస్తూ సమాజ సేవకు అంకితభావంతో పనిచేస్తామని ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమం చివరలో యాజమాన్యం, అధ్యాపకులు మరియు సిబ్బంది పట్టభద్రులందరికీ అభినందనలు తెలియజేస్తూ వారి ఉజ్వల భవిష్యత్తుకు శుభాకాంక్షలు తెలిపారు.




# కాఫీ విత్ కార్యక్రమంలో పాల్గొన్న కోడుమూరు జనసేన నాయకులు సంధ్య విక్రమ్ కుమార్



**కర్నూలు సిటీ నందిపత్రిక** కోడుమూరు పట్టణంలో కాఫీ విత్ కార్యకర్త కార్యక్రమంలో భాగంగా 1 వ వార్డ్ సుందరయ్య నగర్ వాసులతో ఆత్మీయంగా సమావేశం అయినా కోడుమూరు నియోజవర్గ జనసేనా నాయకులు ఈ సందర్భంగా విక్రమ్ కుమార్ మాట్లాడుతూ జనసేనా పార్టీ బలోపేతానికి మనమంతా కలిసికట్టుగా పని చేద్దాము అని అయన అన్నారు ఈరోజు గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధికి పవన్ కళ్యాణ్ చూపుతున్న చొరవను కూటమి ప్రభుత్వం చెస్తున్న అభివృద్ధిని ప్రతి గడపకు తీసుకొని పోయి రేపు జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో అత్యేదిక స్థానాలు గెలిచి పవన్ కళ్యాణ్ కు కానుక ఇద్దాము అని ఆయన పిలుపు నిచ్చారు ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు రాముడు సుంకన్న ప్రతాప్ రెడ్డి సూరి రంగడు లింగన్న భాష మరియు భారీగా కార్యకర్తలు కాలనీ వాసులు పాల్గొన్నారు

## ప్రతి చిన్నారికి పోలియో చుక్కలు వేయించి పోలియో రహిత భారత నిర్మాణంలో భాగస్వాములు అవ్వండి

### మండల టిడిపి కో కన్వీనర్ పత్తి పాపి రెడ్డి

**ఆళ్లగడ్డ ప్రతినిధి జూన్ 28 నంది పత్రిక** ఆదివారం పల్స్ పోలియో కార్యక్రమంలో భాగంగా ఆళ్లగడ్డ మండలం మర్రి పల్లె ఎలిమెంటరీ స్కూల్ లో ఏర్పాటు చేసిన పోలియో బూతు వద్ద చిన్నారులకు పోలియో చుక్కలు వేసిన ఆళ్లగడ్డ మండల టిడిపి కో కన్వీనర్ పత్తి పాపిరెడ్డి . ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 0 - 5 సంవత్సరాల లోపు



చిన్నపిల్లల అందరికీ పల్స్ పోలియో చుక్కలు వేయించాలన్నారు. పిల్లల బంగారు భవిష్యత్తుకు పోలియో చుక్క లు వేయించడం మన బాధ్యత అన్నారు .రెండు చుక్కలు నిండు జీవితానికి బంగారు భవిష్యత్తు అవుతుందని అన్నారు. ప్రతి చిన్నారికి పోలియో చుక్కలు వేయించి పోలియో రహిత భారత నిర్మాణంలో భాగస్వాములు అవ్వండి అన్నారు ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది ఆశ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

# చౌడేశ్వరి అమ్మవారి దేవస్థానంకు రూ.100000 విరాళం



**బనగానపల్లె జూన్ 28నందిపత్రిక** నందవరం శ్రీ చౌడేశ్వరి అమ్మవారి దేవస్థానం కు కడప జిల్లా ప్రొద్దుటూరు వాస్తవ్యులు కీ"శే" చాగలమర్రి మన్నె వెంకట రామకృష్ణ రెడ్డి జ్ఞాపకార్థం వారి ధర్మపత్ని ఓబులమ్మ వారి మనవడు చిలుమూరు పృధ్వీనాథ్ రెడ్డి వారి కుటుంబ సభ్యులు దశరథ రామిరెడ్డి, పి .ఆర్ . చిన్ని ఓబుల్లారెడ్డి, పి ఆర్ . విశ్వనాథ రెడ్డి ఆదివారం ఆలయ అభివృద్ధి కొరకు రూ. 1,00,000( ఒక లక్ష రూపాయలు) చందాను ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ పి.వి.కుమార్ రెడ్డి ,ఆలయ కమిటీ చైర్మన్ పి.వి. నాగార్జున రెడ్డి సమక్షంలో ఆలయ అర్చకులకు అందచేశారు.

# మీ కోసం కాల్ సెంటర్ 1100 సేవలను వినియోగించుకోండి

**జూన్ 29 వ తేదీన జిల్లా కలెక్టరేట్ లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహణ**

**జిల్లా,డివిజన్,మండల కేంద్రాలలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహణ**

**ప్రతి సోమవారం ఉ. 9.30 నుంచి ఉ.10 గంటల వరకు డయల్ యువర్ కలెక్టర్**

**ఫోన్ చేయవలసిన ల్యాండ్ లైన్ నెం.08562-244437**

**జిల్లా ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి - డిఆర్ఓమల్లికార్జునుడు**

**వై ఎస్ ఆర్ కడప బ్యూరో చీఫ్,జూన్ 28: నంది పత్రిక** జూన్ 29 వ తేదీన జిల్లా కలెక్టరేట్ లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కు ప్రజలు వినియోగించుకోవాలని డి ఆర్ ఓ మల్లికార్జునుడు ఆదివారం ఒక ప్రకటన లో తెలిపారు. అర్జీదారులు దాఖలు చేసిన తమ అర్జీలు ఇప్పటికీ పరిష్కారం కాకపోయినా,లేదా తమ ఫిర్యాదులకు సంబంధించిన సమాచారం తెలుసుకోవడానికి 1100 నంబర్ కు కాల్ చేయవచ్చునన్నారు. అర్జీదారులు వారి యొక్క అర్జీలు నమోదు చేసుకోవడానికి వీవవనెశీయిఎ.ఖజూ.స్త్రశీజ.ఱఅ (మీకోసం డాట్ ఏపీ డాట్ జివో వి డాట్ ఇన్) వెబ్సైట్ నందు వారి యొక్క అర్జీలు నమోదు చేసుకోవచ్చున్నారు.ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తమ సమస్యలకు పరిష్కారం పొందాలని విజ్ఞప్తి చేశారు. జూన్ 29 వతేదీన సోమవారం కలెక్టరేట్ లోని సభా భవన్ నందు ప్రజాసమస్యలపరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రీడ్రసెల్ సిస్టం, పిజిఆర్ఎస్) కార్యక్రమం నిర్వహించడంజరుగుతుందని, ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని కలెక్టరేట్ లో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు నిర్వహించడం జరుగుతుందని, ఈ కార్యక్రమంలో అన్ని శాఖల జిల్లాఅధికారులు పాల్గొంటారని తెలిపారు.ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం లో తమ వివరాలతో పాటు వారి సమస్యలకుసంబంధించి అర్జీలను అందజేయాలన్నారు. అర్జీదారులు గతంలో ఇచ్చిన అర్జీలకు సంబంధించిన స్లిప్పునుతీసుకురావాలని సూచించారు.సమస్య పరిష్కారమైనప్పుడు ఫోన్ కి మెసేజ్ వస్తుందని,అర్జీదారులు వారి ఫోన్ ను చెక్ చేసుకోవాలన్నారు. నోటీసులు,ఎండార్స్మెంట్ ను వాట్సఅప్ లో పంపిస్తున్నామని, ఎండార్స్మెంట్ బై రిజిస్టర్ పోస్ట్ మీరు ఇస్తున్న అడ్రస్ కు పంపిస్తున్నామన్నారు. అర్జీ ఇచ్చేటప్పుడు దానిని కరెక్ట్ గా పూరించాలన్నారు.రిపీటెడ్ అర్జీదారులు పాత రసీదును తీసుకురావాలన్నారు. జిల్లా ప్రజలు పిజిఆర్ఎస్ కార్యక్రమాన్ని సద్విని యోగం చేసుకోవాలని కోరారు.ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ( పీజీ ఆర్ ఎస్)" అర్జీల స్వీకరణ కార్య క్రమాన్ని జిల్లా కేంద్రంతో పాటు మండల,మున్సిపల్ స్థాయి లో కూడా నిర్వహిస్తామన్నారు.అర్జీదారులు ఈ విషయాన్ని గమనించి తమ ఫిర్యాదులను సమీపంలోని మండల కార్యాలయాలు లేదా మున్సిపల్ కార్యాలయాలలో కూడా సమర్పించుకోవచ్చునన్నారు

**డయల్ యువర్ కలెక్టర్ కార్యక్రమం:** డయల్ యువర్ కలెక్టర్ కార్యక్రమాన్ని సోమవారం ఉదయం 9.30 నుండి ఉ.10 గంటల వరకు జరుగుతుందన్నారు.ప్రజలు 08562-244437 ల్యాండ్ లైన్ నెంబరుకు ఫోన్ చేసి తమ సమస్యలను విన్నవించుకోవచ్చునన్నారు ప్రజలు ఈ విషయాన్ని గుర్తించి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని డీఆర్వో ఆ ప్రకటనలో విజ్ఞప్తి చేశారు.

# దేశవ్యాప్తంగా ఉన్న జర్నలిస్ట్ లకు సుప్రీం కోర్ట్ గుడ్ న్యూస్.

పెన్ను పట్టిన, వీడియో కెమెరా పట్టి తమ విధులు రోజు వారి వార్త, న్యూస్ ప్రసారాలు నిర్వహిస్తున్నా వారందరు జర్నలిస్ట్ లిస్టులే.!! సుప్రీం కోర్ట్ ఇకపై కావాలనే కక్షతో రాజకీయ నాయకులు, అక్రమ సంపాదన దందాలు చేసే వారు, వివిధ ప్రభుత్వ శాఖల్లో అవినీతి అక్రమాలకు పాల్పడే వాళ్ళ బాగోతలపై నిజాలను నిర్భయంగా వార్త రాసిన, న్యూస్ ప్రసారాలు చేసిన జర్నలిస్ట్ లపై అక్రమ కేసులు చెల్లనేరావు: సుప్రీం కోర్ట్ శాటిలైట్ ఛానెల్స్, యూట్యూబ్ న్యూస్ ఛానెల్స్,ప్రింట్ మీడియా సంస్థల్లో పని చేసే జర్నలిస్ట్ లు ఆయా సంఘాల్లో సభ్యత్వం ఉన్న వారు అక్రమ కేసుల లేక నిజ నిరూపణ కేసుల అనేది ఆయా సంఘాల ద్వారా పరిష్కారం కొరకు 7 రోజుల్లో నిర్ణయం తీసుకున్నే హక్కులు జర్నలిస్ట్ సంఘాలకే ఉంటుందని, వాళ్ళను కాదని అక్రమ కేసులు పెట్టిన వాళ్ళపై, అట్టి పోలీస్ లపై వేట తప్పదు: సుప్రీం కోర్ట్.

# పిల్లల బంగారు భవిష్యత్తుకు పోలియో చుక్కలు వేయించడం మన బాధ్యత

### బీసీ సెల్ స్పోక్ పర్సన్ చల్లా నాగరాజు యాదవ్

### పల్స్ పోలియో కార్యక్రమం విజయవంతం..

**చాగలమర్రి జూన్ 28 నంది పత్రిక** మండలంలో ఆదివారం చేపట్టిన పల్స్ పోలియో కార్యక్రమం విజయవంతమైంది. బస్సులలో ప్రయాణం చేస్తూ పల్స్ పోలియో చుక్కలు వేయించు కోని పిల్లల కొరకు ట్రాన్సిట్ పాయింట్ తో పాటు 32 కేంద్రాలను డాక్టర్ అంజలి ప్రత్యూష ఏర్పాటు చేశారు. 5,556 మంది చిన్నారులకు పోలియో చుక్కలు వేసేందుకు వ్యాక్సిన్ అందించారు. ఇందులో 64 మంది సిబ్బంది పల్స్ పోలియో కార్యక్రమంలో పాల్గొనడం జరిగింది. కేంద్రాల వద్దకు రాలేని పరిస్థితిలో ఉన్న వారి పిల్లలకు సిబ్బంది ఇంటింటికి వెళ్లి పోలియో చుక్కలు రెండు రోజులు వేయనున్నట్లు తెలిపారు. వివిధ పనుల కోసం వచ్చిన వలస కూలీల పిల్లలను కూడా గుర్తించి వారికి పల్స్ పోలే చుక్కలు వేయనున్నట్లు డాక్టర్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా నంద్యాల పార్లమెంట్ బీసీ సెల్ స్పోక్ పర్సన్ చల్ల నాగరాజు యాదవ్ ఆధ్వర్యంలో 7,8, 9, 10, వార్డులకు సంబంధించి పోలియో చుక్కలు పిల్లలకు వేశారు. భవిష్యత్తులో పోలియో బారిన పల్స్ పోలి యో చుక్కలను వేయించాలని తల్లిదండ్రులను కోరారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది ఆశ వర్కర్లు, టిడిపి నాయకులు కాశినేని ఓబులేసు, బషీర్, అబ్దుల్లా కృష్ణయ్య మోహన్ కృష్ణ పాల్గొన్నారు.



printed and published by M.Mahesh babu on behaly of m/s mahesh publications # 13-36A, Nelliveedhi, Nandyal District, Nadyal printed at sai Aishwayam Apartment, Near Bharatha Matha Temple B-Block, Flat no 105, Tekke, Nandyal (Dist) AP pin-code 518501 GST No:-37ACDFM5465G1Z1 EDITOR; Mahesh Babu RNI No: Aptel/2023/88162 Phone No 9849499960,9059696959 Email id: Nandi patrika @gmail.com

# పోలియో చుక్కలతో చిన్నారులకు ఉజ్వల భవిష్యత్తు





**రెండు చుక్కలు అంగవైకల్యానికి పెట్టని కోట**

**05 సంవత్సరాల చిన్నారులందరికీ తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలి**

**ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి పోలియో చుక్కలు ఎంతో దోహదం చేస్తాయి**

**జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి**

**తణుకు బ్యూరో చీఫ్, జూన్ 28, నంది పత్రిక** పోలియో వంటి ప్రమాదకర వ్యాధి నుంచి చిన్నారులను శాశ్వతంగా రక్షించేందుకు ప్రతి తల్లిదండ్రులు తమ పిల్లలకు తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి పిలుపునిచ్చారు. ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణంలో పోలియో చుక్కలు కీలకపాత్ర పోషిస్తున్నాయని ఆమె పేర్కొన్నారు. తణుకు జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో నిర్వహించిన పల్స్ పోలియో కార్యక్రమాన్ని ఆదివారం జిల్లా కలెక్టర్ ప్రారంభించి, చిన్నారులకు స్వయంగా పోలియో చుక్కలు వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి మాట్లాడుతూ, "మన జిల్లాలో పోలియో కేసులు లేవు కాబట్టి పిల్లలకు చుక్కలు వేయించాల్సిన అవసరం లేదనే భావన కొంతమందిలో ఉంది. ఇది పూర్తిగా అపోహ మాత్రమే. పోలియో రహిత స్థితిని కొనసాగించాలంటే ప్రతి జాతీయ పోలియో కార్యక్రమంలో ప్రతి చిన్నారికి తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలి" అని సూచించారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ( డబ్ల్యూహెచ్ఓ) 1988లో ప్రపంచ పోలియో నిర్మూలన కార్యక్రమాన్ని ప్రారంభించిందని, భారతదేశంలో 1995లో పల్స్ పోలియో కార్యక్రమం అమలులోకి వచ్చిందని తెలిపారు. దేశంలో చివరి పోలియో కేసు 2011లో నమోదవగా, 2014లో భారతదేశం పోలియో-రహిత దేశంగా అధికారికంగా గుర్తింపు పొందిందన్నారు. అయితే పొరుగు దేశాలైన ఆఫ్ఘనిస్తాన్, పాకిస్తాన్లలో ఇప్పటికీ పోలియో కేసులు నమోదవుతున్న నేపథ్యంలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావులేదన్నారు. ప్రతి జాతీయ పోలియో కార్యక్రమంలో 0 నుంచి 5 సంవత్సరాల లోపు పిల్లలందరికీ తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించడం ద్వారా మాత్రమే పోలియో రహిత భారతదేశాన్ని శాశ్వతంగా కొనసాగించగలమని పేర్కొన్నారు. గత 15 సంవత్సరాలుగా జిల్లాలో ఒక్క పోలియో కేసు కూడా నమోదు కాకపోవడం ప్రజల సహకారం, తల్లిదండ్రుల బాధ్యతాయుతమైన వైఖరి, వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది కృషికి నిదర్శనమని కలెక్టర్ అభినందించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కోట్లాది రూపాయలు వెచ్చిస్తూ దేశవ్యాప్తంగా పోలియో నిర్మూలన కార్యక్రమాన్ని నిరంతరం నిర్వహిస్తున్నాయని, అంగవైకల్య రహిత, ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణమే ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యమని తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రతి తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకొని తమ పిల్లలకు పోలియో చుక్కలు తప్పనిసరిగా వేయించాలని విజ్ఞప్తి చేశారు.

ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య మరియు ఆరోగ్యశాఖ అధికారి డా.జి.గీతాబాయి, జిల్లా సమన్వయకర్త( డి సి హెచ్ ఎస్) డా.పగడాల సూర్యనారాయణ, జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్ డా.సాయి కిరణ్, ఆర్డీవో మన్నే సూర్యరావు, మున్సిపల్ కమిషనర్ రామ్ కుమార్, తహసీల్దార్ అశోక్ వర్మ, వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ సిబ్బంది, చిన్నారుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.





# గడువులోగా సీఎంఆర్‌ను ప్రభుత్వానికి అప్పగించాలి





**ఎఫ్ఏక్యూ ప్రమాణాలతో నాణ్యమైన బియ్యమే సరఫరా చేయాలి**

**సీఎంఆర్ డెలివరీలో జాప్యానికి తావివ్వొద్దు**

**జిల్లా జాయింట్ కలెక్టర్ టి. రాహుల్ కుమార్ రెడ్డి**

**భీమవరం (తాడేరు) బ్యూరో చీఫ్ జూన్ 28 నంది పత్రిక**

ప్రభుత్వం రైతుల నుంచి మద్దతు ధరకు కొనుగోలు చేసిన ధాన్యాన్ని సకాలంలో మిల్లింగ్ చేసి, కస్టమ్ మిల్డ్ రైస్ (సీఎంఆర్)ను నిర్దేశిత గడువులోగా ప్రభుత్వానికి అప్పగించడం ప్రతి రైస్ మిల్లర్ బాధ్యత అని జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి అన్నారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియలో భాగంగా తాడేరు గ్రామంలోని శ్రీ సాయిరాం ఎంటర్‌ప్రైజెస్ రైస్ మిల్లును జిల్లా జాయింట్ కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మిల్లులో జరుగుతున్న ధాన్యం మిల్లింగ్ ప్రక్రియ, బియ్యం నాణ్యత, నిల్వలు, సీఎంఆర్ సరఫరా ఏర్పాట్లను స్వయంగా పరిశీలించి సంబంధిత అధికారులకు, మిల్లర్‌కు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం రైతులకు మద్దతు ధర చెల్లించి కొనుగోలు చేసిన ధాన్యాన్ని మిల్లింగ్ చేసి నాణ్యమైన బియ్యంగా మార్చి ప్రభుత్వానికి అందజేయాల్సిన బాధ్యత మిల్లర్లపై ఉందన్నారు. సీఎంఆర్ సరఫరాలో ఎలాంటి జాప్యం లేకుండా గడువులోగా బియ్యాన్ని అందించాలని స్పష్టం చేశారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం మిల్లింగ్ చేసిన బియ్యంలో నూక 10 శాతానికి మించకూడదని తెలిపారు. ప్రభుత్వానికి సరఫరా చేసే బియ్యం పూర్తిస్థాయి నాణ్యతతో ఉండాలని, ఎఫ్ఏక్యూ ప్రమాణాలకు అనుగుణంగా మాత్రమే బియ్యాన్ని అందించాలని ఆదేశించారు. ప్రభుత్వానికి సరఫరా చేసే ప్రతి లాట్ నాణ్యతను అధికారులు తప్పనిసరిగా పరిశీలిస్తారని, నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగాలేని బియ్యాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ స్వీకరించబోమని హెచ్చరించారు. నాణ్యతా ప్రమాణాలను పాటించడంతో పాటు సీఎంఆర్ డెలివరీలో ఆలస్యం జరగకుండా మిల్లర్లు ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. ప్రభుత్వం నిర్దేశించిన గడువులోగా సీఎంఆర్‌ను సరఫరా చేయని మిల్లర్లపై సంబంధిత నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందని జాయింట్ కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ తనిఖీలో జిల్లా పౌర సరఫరాల అధికారి ఎన్.సరోజ, సివిల్ సప్లైస్ కార్పొరేషన్ అసిస్టెంట్ మేనేజర్ వి.దుర్గారావు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# నేడు (జూన్ 29న) జిల్లా, డివిజన్, మండల కేంద్రాలలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక

**జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి**

**భీమవరం బ్యూరో చీఫ్ జూన్ 28 నంది పత్రిక.** జిల్లా ప్రజల సమస్యలను వేగవంతంగా పరిష్కరించేందుకు ప్రతి సోమవారం నిర్వహిస్తున్న ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్) కార్యక్రమం జూన్ 29వ తేదీన జిల్లా కలెక్టరేట్‌తో పాటు అన్ని డివిజన్ మరియు మండల కేంద్రాలలో నిర్వహించబడుతుందని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. అదేవిధంగా రెవెన్యూ సమస్యల పరిష్కారం కోసం రెవెన్యూ క్లినిక్ కార్యక్రమం కూడా నిర్వహించబడుతుందని పేర్కొన్నారు. ప్రజలు తమ సమస్యలకు సంబంధించిన అర్జీలను సంబంధిత ఆధార పత్రాలతో సమర్పించి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. అర్జీల స్వీకరణ, పరిశీలన మరియు పరిష్కార ప్రక్రియను మరింత పారదర్శకంగా నిర్వహించేందుకు జిల్లా మరియు మండల స్థాయి అధికారుల సమన్వయంతో ప్రత్యేక ఏర్పాట్లు చేయబడినట్లు తెలిపారు. అర్జీదారులు తమ ఫిర్యాదులను అధికారిక వెబ్‌సైట్ ఎవవవనిశీయిఎ.ఖజూ.స్త్రశీజ.ఱఅ ద్వారా కూడా నమోదు చేసుకోవచ్చని తెలిపారు. అర్జీల స్థితి, పరిష్కార ప్రక్రియ లేదా ఇతర సమాచారం కోసం "మీకోసం" టోల్ ఫ్రీ హెల్ప్‌లైన్ నంబర్ 1100 ను సంప్రదించవచ్చని సూచించారు. వేసవి ఎండలు తీవ్రంగా ఉన్న నేపథ్యంలో పిజిఆర్ఎస్‌కు హాజరయ్యే ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. ముఖ్యంగా నడవలేని వారు, మంచానికే పరిమితమైన వారు, తీవ్రమైన అనారోగ్యంతో బాధపడుతున్న వారిని పిజిఆర్ఎస్ కేంద్రాలకు తీసుకురావద్దని తెలిపారు. అలాంటి వారి సమస్యలను కుటుంబ సభ్యులు లేదా ప్రతినిధుల ద్వారా తెలియజేయవచ్చని పేర్కొన్నారు. పిజిఆర్ఎస్‌కు హాజరయ్యే ప్రజల కోసం తాగునీరు, అల్పాహారం, భోజనం వంటి సౌకర్యాలతో పాటు వికలాంగులకు ప్రత్యేక ఏర్పాట్లు చేయబడినట్లు తెలిపారు. అందిన అర్జీలపై నిరంతర పర్యవేక్షణ చేపట్టి, సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకుంటామని కలెక్టర్ స్పష్టం చేశారు. అదేవిధంగా ప్రతి శుక్రవారం నియోజకవర్గ స్థాయిలో నిర్వహిస్తున్న ప్రత్యేక పిజిఆర్ఎస్ కార్యక్రమాలను కూడా ప్రజలు వినియోగించుకొని తమ సమస్యలను పరిష్కరించుకోవాలని కలెక్టర్ కోరారు.



# ఎస్ ఐ ఆర్ పై మరింత అవగాహన కార్యక్రమాలు చేపట్టాలి సిపిఎం




**నంది పత్రిక ఆత్మకూరు..** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో జూన్ 15వ తేదీ నుండి స్పెషల్ ఇన్సెంటివ్ రివిజన్ ( ఎస్ ఐ ఆర్) కార్యక్రమానికి సంబంధించి ప్రజలలో తీవ్రమైన అయోమయం నెలకొందని సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు వి ఏసురత్నం సిపిఎం పార్టీ ఆత్మకూరు పట్టణ కార్యదర్శి ఏ రణధీర్ పట్టణ నాయకులు రామ్ నాయక్ తెలిపారు. ప్రస్తుతము క్షేత్రస్థాయిలో బిఎల్ఓ ఎన్ని మరేషాన్ ఫారాలు పంపిణీ చేస్తున్నప్పటికీ వాటిని ఎలా భర్తీ చేయాలి ఏ వివరాలను నింపాలి ఏ పత్రాలను ఆధారంగా తీసుకోవాలి 2022 ఓటర్ జాబితా వివరాలను ఎలా నమోదు చేయాలి అనే అంశాలపై ప్రజలకు స్పష్టమైన అవగాహన లేదు. ప్రజల నుంచి పెద్ద ఎత్తున సందేహాలు వస్తున్నాయి స్థానిక బిఎల్ఓ లను సంప్రదించినప్పటికీ వారికి కూడా అనేక అంశాలపై స్పష్టత లేదు 2002లో ఓటర్ ఉండి ప్రస్తుతం ఓటర్లు లేకపోతే వారి పరిస్థితి ఏమిటని 2022లో ఓటరు జాబితాలో పేరు నమోదు కానప్పటికీ భారత పౌరులు ఏమి చేయాలి 2022లో ఓటు ఉండి ఇప్పుడు ఓటర్ లిస్టులో పేరు లేని పరిస్థితి ఏమిటి వారంలో వివరాలను ఏ ఆధార పత్రాల ప్రకారం నమోదు చేయాలి వంటి ప్రశ్నలకు సమాధానాలు అవసరమై ఉన్నది. ఓటు హక్కు భారత రాజ్యాంగము ప్రతి పౌరునికి ఇచ్చిన ఇచ్చిన ప్రజాస్వామ్యపు హక్కు అని అవగాహన లోపం లేదా ఫారం నింపడంలో జరిగే సాంకేతిక పొరపాట్ల కారణంగా ఏ ఒక్క పౌరుడు ఓటర్ హక్కు కోల్పోకూడదని వారు తెలిపారు. ప్రస్తుతము బిఎల్ఓ లకు పని భారం ఎక్కువైంది ఒక్క బిఎల్ఓ 1100 నుంచి 1400 ఓటర్ల బాధ్యత అప్పగించినట్టు తెలుస్తుంది. ఇంత భారీ పని భారం మధ్య క్షేత్రస్థాయిలో పరిశీలనలు ధ్రువీకరణలు ఫారంల పరిశీలనలో పరిశీలనలో ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉంది. అందువల్ల బిఎల్ఓ లకు అదనపు సిబ్బందిని నియమించాలని వారు కోరారు. ఈ నేపథ్యంలో జిల్లా కలెక్టర్ మరియు ఎన్నికల యంత్రాంగం తక్షణమే జోక్యం చేసుకొని సమస్యలు పరిష్కారానికి చొరవ చూపాలని వారు కోరారు. ఓటు హక్కు పరిరక్షణలో ఎన్నికల యంత్రాంగము పారదర్శకంగా నిష్పక్షపాతంగా వ్యవహరించాలని వారు కోరారు. పట్టణాలలో బాడుగ ఇల్లులు ఉండేవారు వివిధ కాలనకు ఇల్లు మారింటారు గ్రామాలలో వలసలకు పోయేటువంటి ఇతర ప్రాంతాలపై జీవిస్తున్నారు అటువంటి వారి ఓటు కూడా పోకుండా జిల్లా యంత్రాంగము కలెక్టరు చర్యలు తీసుకోవాలి. ఓటర్ ఫారాలు నింపడానికి ప్రత్యేకమైనటువంటి కార్యకర్తలను యంత్రాంగాన్ని ఏర్పాటు చేయాలి చాలామంది ఓటర్లు చదువురాని వారు నిరక్ష నిరక్షరాస్యులు ఉన్నారు వారు ఓటర్లు ఫారాలు నింపే పరిస్థితి లేదు అటువంటివారిని ఓటు పోకుండా ఉండేందుకు జిల్లా యంత్రాంగము ప్రత్యేకమైనటువంటి చర్యలు తీసుకోవాలని సిపిఎం పార్టీగా కోరారు

# దలారి వ్యవస్థ నడిపేది కర్నూలు ఆర్డీవో కె. సందీప్ కుమార్ రాయలసీమ యువజన పోరాట సమితి అధ్యక్షులు వి.వి.నాయుడు



**కర్నూల్ సిటీ నంది పత్రిక** రాయలసీమ యువజన పోరాట సమితి అధ్యక్షులు వి.వి.నాయుడు మాట్లాడుతూ కర్నూలు ఆర్డీవో కె. సందీప్ కుమార్ చేసిన ప్రకటన పూర్తిగా అసత్యమని, దీనిని తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. ఆర్ డి ఓ హోదాను ఉపయోగించుకుని అసత్య ప్రచారం చేస్తూ అధికారులను, ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని ఆరోపించారు. అతను కలాంధర్ మరియు అంజి అనే ప్రైవేటు వ్యక్తులను దలారులుగా పెట్టుకొని దందా నడుపుతూ, ఇతరులపై ఇష్టమొచ్చినట్లు నిందలు వేయడం అతనికి అలవాటేనని అన్నారు. గార్గేయపురం విషయంలో ప్రెస్ నోట్ ఇచ్చింది బాధితులేనని, తాను కేవలం ప్రెస్‌కు పంపించడంలో సహాయం మాత్రమే చేశానని తెలిపారు. అంతేకాకుండా తాను ఆ భూమికి అగ్రిమెంట్ హోల్డర్‌నని, ఆర్డీవో మొన్నటి వరకు తనతో మంచిగానే చాటింగ్ చేసి భూమి విలువైనదని చెప్పారని అన్నారు. అనంతరం ఐదు లక్షల రూపాయలు అడిగారని, ఇవ్వలేమని చెప్పడంతో అవతలి పార్టీతో మాట్లాడుకుని తమపై ఎదురు దాడి చేయడం ప్రారంభించారని ఆరోపించారు. చివరకు ఎమ్మార్వో నివేదికకు విరుద్ధంగా ఉత్తర్వులు ఇచ్చారని, ఆ నిర్ణయాన్ని ప్రశ్నించడం ప్రారంభించగానే తన అధికారాన్ని ఉపయోగిస్తూ తమపై దాడి చేయడం మొదలుపెట్టారని అన్నారు. మాకు సంబంధం లేని నన్నూరు ఆర్మీ (నేవీ) కేసులో వారికి ఎన్ ఓ సి క్లియరెన్స్ ఇస్తానని, మీరు నాయుడిపై ఏస్సీ /యస్ టి కేసులు, ఆర్మీ పేరును ఉపయోగించి ప్రెస్ నోట్లు పెట్టండి, ఫిర్యాదులు చేయండి, దాడులు చేయండి అని మాట్లాడుకున్నట్లు తనకు సమాచారం ఉందని అన్నారు. వారిని అడ్డుపెట్టుకుని తనపై దాడి చేయాలని చూస్తే ఆ ఆటలు సాగవని హెచ్చరించారు. ఒక అధికారి అంటే ప్రజల సమస్యలు పరిష్కరించాల్సి ఉంటుందని, కానీ ఇతను మాత్రం తప్పుల మీద తప్పులు చేస్తూ ప్రజల జీవితాలతో ఆడుకుంటున్నారని విమర్శించారు. ఆర్డీవో కార్యాలయం నుంచి కలాంధర్ ద్వారా ప్రెస్‌కు సమాచారం పంపించడం జరుగుతోందని, అసలు కలాంధర్ ఎవరు? ప్రభుత్వ ఉద్యోగినా? కాంట్రాక్టు ఉద్యోగినా? లేక ఔట్‌సోర్సింగ్ ఉద్యోగినా? ఏ ఉద్యోగి కానప్పుడు కార్యాలయంలో అతనికి అన్ని హక్కులు ఎందుకు ఇచ్చారో తెలియడం లేదని అన్నారు. డిప్యుటేషన్ ఆర్డర్లు ఇవ్వడం, వారికి ఇష్టం వచ్చినట్లు అధికార దుర్వినియోగం చేయడం జరుగుతోందని, వారే అసలైన దలారులని ఆరోపించారు. నూతనంగా స్కోడా కారు కూడా కొనిచ్చారని సమాచారం ఉందని, అలాగే పంచలింగాల భూ సేకరణ ఫైళ్లలో వారికి విలువ పెంచేందుకు సహాయపడ్డారని, కోటి రూపాయలు దలారుల ద్వారా తెప్పించుకున్నారని సమాచారం ఉందని అన్నారు. అలాగే ఓర్వకల్లు భూ సేకరణ, కోర్టు ఫైళ్లలో ఏ ఫైల్ వచ్చినా మొత్తం దలారులే చూసుకుంటున్నారని ఆరోపించారు. తప్పుడు కేసులు పెడతామంటే భయపడే వారు ఎవరూ లేరని అన్నారు. ప్రభుత్వం ప్రజలకు మంచి పేరు తీసుకురావాలని ఆర్డీవో హోదాను ఇచ్చిందని, అయితే ఆ హోదాను అధికార దుర్వినియోగానికి ఉపయోగించడం సిగ్గుచేటని విమర్శించారు. కర్నూలు ఆర్డీవో కార్యాలయంలోని ఆర్ ఓ ఆర్ కేసులు, భూ సేకరణ ఫైళ్లు, భూ మార్పిడి (ల్యాండ్ కన్వర్షన్ ) ఫైళ్లపై విజిలెన్స్ విచారణ జరపాలని డిమాండ్ చేస్తున్నామని తెలిపారు. ఇతనిపై న్యాయపరమైన పోరాటం కొనసాగిస్తామని, ఇలాంటి అధికారుల వల్ల ప్రజలకు తీవ్ర నష్టం జరుగుతోందని, ప్రజల మధ్య చిచ్చు పెట్టే వారిని వదిలిపెట్టబోమని హెచ్చరించారు. చివరిగా, ఆర్డీవో కె. సందీప్ కుమార్ అక్రమాలపై తాము నిరంతరం ప్రశ్నిస్తూనే ఉంటామని వి.వి.నాయుడు స్పష్టం చేశారు.

# అపర భగీరథుడు వైఎస్ రాజశేఖర్ రెడ్డి77వ. జయంతి పోస్టర్ ను ఆవిష్కరిం చిన వైఎస్ షర్మిల రెడ్డి



**ఒంగోలు ( 28 జూన్)** అపర భగీరథుడు అయిదు కోట్ల ఆంధ్రుల గుండెల్లో కొలువైన సంక్షేమ సారధి, రైతన్నల పెన్నిధి ,కాంగ్రెస్ పార్టీ రథసారథి, రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి వర్యులు వైయస్ రాజశేఖర్ రెడ్డి 77వ. జయంతి సందర్భంగా రాష్ట్ర రాష్ట్ర అసంఘటిత కార్మికుల మరియు ఉద్యోగుల కాంగ్రెస్ చైర్మన్, దర్శి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త కైపు వెంకటకృష్ణారెడ్డి సారధ్యంలో రూపొందించిన పోస్టర్ను ఈరోజు హైదరాబాదులోని లోటస్పాండ్ లో వైఎస్ షర్మిల రెడ్డి గారి నివాసంలో ఉమ్మడి ప్రకాశం జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు షేక్ సైదా మరియు ఇతర నాయకుల సమక్షంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జూలై నెల 8వ తేదీ స్వర్గీయ రాజశేఖర్ రెడ్డి గారి జయంతి కార్యక్రమాన్ని రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో, అన్ని అసెంబ్లీ నియోజకవర్గ కేంద్రాల్లో ఘనంగా నిర్వహించాలని ,అదేవిధంగా ఇడుపులపాయలోని వైయస్ ఘాట్లో జరిగే జయంతి కార్యక్రమంలో కాంగ్రెస్ శ్రేణులు పాల్గొనాలని ఆమె కోరారు ఈ సందర్భంగా ఈ పోస్టర్ను రూపొందించిన కైపు కృష్ణారెడ్డిని వైఎస్ షర్మిల రెడ్డి ప్రత్యేకంగా అభినందించారు.

# గోల్డ్ కోస్ట్ బీచ్ అభివృద్ధితో స్థానికంగా ఉపాధి, ఆర్థికాభివృద్ధికి ఊతం





**రైతుల ప్రయోజనాలకు మొదటి ప్రాధాన్యతతో పర్యాటక అభివృద్ధి**

**గోల్డ్ కోస్ట్ బీచ్ తీరప్రాంత రైతులకు అవగాహన కార్యక్రమం**

**జిల్లా జాయింట్ కలెక్టర్ టి. రాహుల్ కుమార్ రెడ్డి**

**నరసాపురం బ్యూరో చీఫ్ జూన్ 28, నంది పత్రిక** నరసాపురంపేరుపాలెం గోల్డ్ కోస్ట్ బీచ్‌ను అంతర్జాతీయ ప్రమాణాలతో పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయడం ద్వారా స్థానిక యువతకు విస్తృత స్థాయిలో ఉపాధి అవకాశాలు లభించడంతో పాటు ఈ ప్రాంత ఆర్థికాభివృద్ధికి కొత్త దిశ ఏర్పడుతుందని జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి తెలిపారు. గోల్డ్ కోస్ట్ బీచ్ తీర ప్రాంతంలో ప్రతిపాదిత పర్యాటక అభివృద్ధి, దాని ద్వారా రైతులకు కలిగే ప్రయోజనాలపై ఆదివారం నరసాపురం ఆర్‌డీఓ కార్యాలయంలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన రైతులను ఉద్దేశించి మాట్లాడారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ పర్యాటక అభివృద్ధి ప్రణాళికలను ప్రభుత్వం రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని, పరస్పర లబ్ధి చేకూరే విధంగా రూపొందిస్తోందన్నారు. నరసాపురంపేరుపాలెం గోల్డ్ కోస్ట్ బీచ్ అభివృద్ధి చెందితే ఈ ప్రాంతం రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ప్రముఖ పర్యాటక కేంద్రంగా రూపుదిద్దుకునే అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నారు. పర్యాటక రంగం అభివృద్ధి చెందడం వల్ల హోటళ్లు, రెస్టారెంట్లు, హోమ్ స్టేలు, రవాణా, చిన్న వ్యాపారాలు, వినోద సేవలు వంటి అనేక రంగాల్లో ఉపాధి అవకాశాలు పెరుగుతాయని తెలిపారు. సందర్శకుల రాకపోకలు పెరగడం ద్వారా స్థానిక వ్యాపారాలు అభివృద్ధి చెంది, మొత్తం ప్రాంత ఆర్థిక వ్యవస్థ బలోపేతం అవుతుందని వివరించారు. అభివృద్ధి ప్రక్రియలో రైతుల హక్కులు, ప్రయోజనాలకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుందని, చట్టపరమైన నిబంధనలను పూర్తిగా పాటిస్తూ రైతుల భాగస్వామ్యంతోనే అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేస్తామని స్పష్టం చేశారు. ఎలాంటి అపోహలు, అవాస్తవ ప్రచారాలను నమ్మకుండా ప్రభుత్వ అధికారుల ద్వారా సరైన సమాచారం తెలుసుకోవాలని రైతులకు సూచించారు. ఈ సందర్భంగా విశాఖపట్నం బీచ్, సూర్యలంక బీచ్‌ల అభివృద్ధి అనంతరం అక్కడ ఏర్పడిన ఉపాధి అవకాశాలు, ఆర్థికాభివృద్ధి, పర్యాటక రంగ విస్తరణను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా రైతులకు వివరించారు.

గోల్డ్ కోస్ట్ బీచ్ అభివృద్ధి అనంతరం స్థానిక ప్రజలకు కూడా ఇలాంటి అవకాశాలు లభిస్తాయని తెలిపారు. రైతులు తమ భూముల పరిధిలోనే పర్యాటక అనుబంధ వ్యాపారాలను అభివృద్ధి చేసుకునే అవకాశాలను పరిశీలించాలని సూచించారు. ప్రభుత్వం అందిస్తున్న రుణాలు, సబ్సిడీలు, ప్రోత్సాహక పథకాలపై అవగాహన పెంచుకొని పర్యాటక రంగంలో ఔత్సాహిక పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని పిలుపునిచ్చారు. స్థానిక ప్రజల సహకారం, పారదర్శకత, రైతుల భాగస్వామ్యంతోనే గోల్డ్ కోస్ట్ బీచ్ అభివృద్ధి కార్యక్రమాన్ని ముందుకు తీసుకెళ్తామని, ఈ అభివృద్ధి వల్ల ఏ ఒక్క రైతు కూడా నష్టపోకుండా ప్రభుత్వం అన్ని జాగ్రత్తలు తీసుకుంటుందని జాయింట్ కలెక్టర్ భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నరసాపురం ఆర్‌డీఓ దాసిరాజు, మొగల్తూరు తహసీల్దార్ రాజ్ కిషోర్, పర్యాటక శాఖ అధికారులు, గోల్డ్ కోస్ట్ తీరప్రాంత రైతులు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు

# ప్రభుత్వ ఆసుపత్రుల్లో మెరుగైన వైద్య సేవలు అందించాలి





**పేదల వైద్యానికి ప్రభుత్వ ఆసుపత్రులు భరోసాగా నిలవాలి**

**రోగులకు ఆప్యాయతతో వైద్య సేవలు అందించడం వైద్యుల బాధ్యత**

**జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి**

**తణుకు బ్యూరో చీఫ్ జూన్ 28 నంది పత్రిక** ప్రభుత్వ ఆసుపత్రిలలో రోగులకు నాణ్యమైన, సత్వర వైద్య సేవలు అందేలా వైద్యులు, సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి సూచించారు. ఆదివారం తణుకు జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిని ఆకస్మికంగా సందర్శించి ఆసుపత్రి పనితీరును పరిశీలించారు. ఆసుపత్రిలోని అన్ని వార్డులను సందర్శించిన జిల్లా కలెక్టర్ చికిత్స పొందుతున్న రోగులను ఆప్యాయంగా పలకరించి వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రిలో అందుతున్న వైద్య సేవలు, సౌకర్యాలపై రోగులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. వైద్య సేవల విషయంలో ఏవైనా సమస్యలు ఎదురైతే వెంటనే ఆసుపత్రి సూపరింటెండెంట్ దృష్టికి తీసుకురావాలని రోగులకు సూచించారు. ఈ సందర్భంగా వైద్యులతో సమావేశమైన జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ వైద్య వృత్తి అత్యంత పవిత్రమైనదని, వైద్యులను సమాజం దేవుళ్లతో సమానంగా గౌరవిస్తుందని అన్నారు. అలాంటి గొప్ప బాధ్యతను నిర్వర్తిస్తున్న వైద్యులు ఆసుపత్రికి వచ్చే ప్రతి రోగిని ఆప్యాయంగా పలకరించి, మానవత్వంతో కూడిన సేవలను అందించాలని సూచించారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాల సంఖ్య పెరిగేలా చర్యలు చేపట్టాలని, ప్రభుత్వ ఆసుపత్రుల్లో అందుబాటులో ఉన్న ఆధునిక వైద్య సదుపాయాలు, నిపుణులైన వైద్య సేవలపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని ఆదేశించారు. పేదవారు అనారోగ్యానికి గురైతే వారి కుటుంబాలు తీవ్రమైన ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొనే పరిస్థితి ఏర్పడుతుందని పేర్కొన్న జిల్లా కలెక్టర్, అలాంటి వారికి ప్రభుత్వ ఆసుపత్రులే నిజమైన అండగా నిలవాలని అన్నారు. పేదలకు సేవ చేసే అదృష్టం ప్రభుత్వ ఆసుపత్రుల్లో పనిచేసే వైద్యులు, సిబ్బందికే లభిస్తుందని, ఆ అవకాశాన్ని బాధ్యతగా, సేవాభావంతో వినియోగించుకోవాలని సూచించారు. ఆసుపత్రిలో పరిశుభ్రత, మందుల లభ్యత, రోగులకు అందుతున్న సేవలపై కూడా జిల్లా కలెక్టర్ అధికారులను అడిగి తెలుసుకొని అవసరమైన సూచనలు చేశారు. ఈ సందర్భంలో డి సి హెచ్ ఎస్ పగడాల సూర్యనారాయణ, ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సాయికిరణ్, వివిధ విభాగాల వైద్యులు, ఆసుపత్రి సిబ్బంది ఉన్నారు

# సమాజ హితం కోరి, ప్రజా ప్రయోజనాలను చేకూర్చేదే జర్నలిజం

**అన్ని వృత్తులలోకెల్లా పవిత్రమైనది జర్నలిజం**

**రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు**

**పాలకొల్లు బ్యూరో చీఫ్ జూన్ 28 నందిపత్రిక** సమాజ హితం, ప్రజా చైతన్యం కోసం పాత్రికేయులు నిస్వార్థంగా పనిచేయాలని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు అన్నారు. గ్రామీణ విలేకరులు నిరంతరం తమ వృత్తి నైపుణ్యాన్ని పెంపొందించుకొని ప్రజలకు నాణ్యమైన సమాచారాన్ని అందించాలని ఆయన పిలుపునిచ్చారు. పాలకొల్లులోని కిరాణా మర్చంట్స్ అసోసియేషన్ హాలులో సి.ఆర్. మీడియా అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గ్రామీణ విలేకరుల పునశ్చరణ శిక్షణా తరగతుల రెండో రోజు కార్యక్రమానికి మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కార్యక్రమానికి సి.ఆర్. మీడియా అకాడమీ చైర్మన్ ఆలపాటి సురేష్ కుమార్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు మాట్లాడుతూ ప్రపంచంలోని అన్ని వృత్తులలో జర్నలిజం అత్యంత బాధ్యతాయుతమైన, పవిత్రమైన వృత్తి అని పేర్కొన్నారు. ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజలకు చేరవేయడంతో పాటు ప్రజల సమస్యలను ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్లడంలో మీడియా కీలక పాత్ర పోషిస్తోందన్నారు. సమాజ అభివృద్ధికి ఆటంకంగా నిలిచే అవినీతిని వెలికితీయడంలో మీడియా పాత్ర ఎంతో గొప్పదని చెప్పారు. వార్తల సేకరణలో వేగంతో పాటు విశ్వసనీయతకు ప్రాధాన్యం ఇవ్వాలని, ప్రతిరోజూ మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా పాత్రికేయులు తమ నైపుణ్యాలను మెరుగుపరుచుకోవాలని సూచించారు. గ్రామీణ విలేకరుల సామర్థ్యాభివృద్ధి కోసం శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న సి.ఆర్. మీడియా అకాడమీ చైర్మన్ ఆలపాటి సురేష్ కుమార్‌ను మంత్రి ప్రత్యేకంగా అభినందించారు. క్రైమ్ రిపోర్టింగ్" అంశంపై ఆంధ్రజ్యోతి డెస్క్ ఇన్‌చార్జి బి.హెచ్.వి.మంగేష్ మాట్లాడుతూ నేర వార్తల ప్రచురణలో అత్యంత జాగ్రత్త అవసరమన్నారు. వాస్తవ నిర్ధారణ లేకుండా వార్తలు పంపకూడదని, మహిళలపై లైంగిక దాడులు, అత్యాచారాలకు సంబంధించిన కేసుల్లో బాధితుల వ్యక్తిగత వివరాలను వెల్లడించరాదని సూచించారు. మైనర్లకు సంబంధించిన కేసుల్లో చట్టపరమైన నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని చెప్పారు. నేర వార్తలు రాసేటప్పుడు బాధితులకు న్యాయం జరిగేలా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, సంఘటన జరిగిన వెంటనే సంబంధిత సమాచారాన్ని డెస్క్‌కు అందించాలని సూచించారు. స్థానిక పోలీసు సిబ్బంది, ఇతర అధికారులతో సమన్వయం పెంపొందించుకోవాలని, మారుతున్న చట్టాలపై నిరంతరం అవగాహన పెంచుకోవాలని వివరించారు. గ్రామీణ వార్తలు, కథనాలు" అంశంపై సీనియర్ జర్నలిస్ట్ డి.సోమసుందర్ మాట్లాడుతూ ప్రధాన మీడియాలో గ్రామీణ వార్తలకు తగిన ప్రాధాన్యం దక్కడం లేదన్నారు. గ్రామాల్లో చోటుచేసుకుంటున్న సామాజిక, ఆర్థిక, వ్యవసాయ, జీవనశైలి మార్పులను విశ్లేషణాత్మకంగా ప్రజల ముందుకు తీసుకురావాలని సూచించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాల అమలు తీరు, వాటి ప్రభావంపై ప్రత్యేక కథనాలు రూపొందించాలని సూచించారు. విశ్లేషణాత్మక కథనాలు పాత్రికేయులకు ప్రత్యేక గుర్తింపు తీసుకువస్తాయని చెప్పారు. ఎలక్ట్రానిక్ మీడియా కవరేజీలో మెలకువలు" అంశంపై ఆర్టీవీ ఇన్‌పుట్ ఎడిటర్ కృష్ణమోహన్ మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా పనిచేసే జర్నలిస్టులే ఎలక్ట్రానిక్ మీడియాలో రాణించగలరన్నారు. సంఘటన స్థలంలో వీడియో రిపోర్టింగ్ పద్ధతులు, ప్రత్యక్ష సాక్షుల నుంచి సమాచార సేకరణ, కెమెరా ముందు ప్రవర్తన, హావభావాలు, డ్రస్ కోడ్, భావ వ్యక్తీకరణ వంటి అంశాలపై సమగ్రంగా వివరించారు. మారుతున్న సాంకేతికతను అందిపుచ్చుకుని గ్రామీణ సమస్యలపై ప్రత్యేక వీడియో కథనాలు రూపొందించాలని సూచించారు. జర్నలిజంలో నైతిక నిష్ఠ అంశంపై కె.ఎల్.యూనివర్సిటీ రీసెర్చ్ స్కాలర్ వాసిరెడ్డి వాసంతి మాట్లాడుతూ పాత్రికేయులు నిజాయితీ, నిబద్ధత, ధైర్యంతో వార్తలు రాస్తే ప్రజల్లో విశ్వాసం పెరుగుతుందన్నారు. వార్తల్లో వ్యక్తిగత అభిప్రాయాలను కలపకుండా ప్రజాప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని వార్తా రచన చేయాలని సూచించారు. పుస్తక పఠనాన్ని అలవాటుగా చేసుకోవడం ద్వారా జ్ఞానాన్ని పెంపొందించుకుని సమాజానికి దిశానిర్దేశం చేసే పాత్రికేయులుగా ఎదగాలని పేర్కొన్నారు. శిక్షణా కార్యక్రమంలో పాల్గొన్న గ్రామీణ విలేకరులకు స్టడీ మెటీరియల్ పంపిణీ చేసి, రెండు రోజులు శిక్షణా కార్యక్రమంలో పాల్గొన్న వారికి సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో సి.ఆర్. మీడియా అకాడమీ చైర్మన్ వ్యక్తిగత కార్యదర్శి ఎస్.శ్రీనివాస జీవన్‌తో పాటు జిల్లాలోని వివిధ మండలాల నుంచి వచ్చిన ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# అభిమాన కోరిక మేరకు మూడు కార్లను ప్రారంభించిన ఎమ్మెల్యే విరుపాక్షి

**వ్యాపారాభివృద్ధి సాధించాలని అశోక్ నాయుడికి ఎమ్మెల్యే ఆశీస్సులు**



మండలానికి చెందిన వైఎస్సార్సీపీ యువ నాయకుడు గద్దరాళ్ల అశోక్ నాయుడు కొనుగోలు చేసిన మూడు కార్లను ఆలూరు ఎమ్మెల్యే విరూపాక్షి ఆదివారం చిప్పగిరిలోని భోగేశ్వరస్వామి దేవాలయ ఆవరణలో ప్రారంభించారు. వాహనాలకు ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ఎమ్మెల్యే చేతుల మీదుగా ప్రారంభోత్సవం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే విరూపాక్షి మాట్లాడుతూతన అభిమాని అశోక్ నాయుడు వ్యాపార రంగంలో మరింత ఉన్నత స్థాయికి ఎదిగి, ఆర్థికంగా మరింత అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. తన చేతుల మీదుగా మూడు వాహనాలను ప్రారంభించడం ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్టీఐ వింగ్ అధ్యక్షుడు కొట్టాల రాజు, వైఎస్సార్సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్కే గిరి, సూరి తదితరులు పాల్గొన్నారు.

# అమరావతి రైతులపై దాడిని ఖండించిన ఎమ్మెల్యే బుసినే విరుపాక్షి

**టీడీపీ ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తోందని విమర్శలు**



అమరావతి ప్రాంతంలో రైతుల సమస్యలు తెలుసుకునేందుకు వెళ్లిన వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతలపై జరిగిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నట్లు ఆలూరు ఎమ్మెల్యే బుసినే విరుపాక్షి తెలిపారు. ఆదివారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమరావతి రైతుల సమస్యలను తెలుసుకునేందుకు వెళ్లిన వైఎస్సార్సీపీ నాయకులపై దాడి చేయడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమన్నారు. రాష్ట్రంలో శాంతిభద్రతల పరిస్థితి దిగజారిందని, ప్రతిపక్ష నేతలపై దాడులు జరగడం ఆందోళనకరమని పేర్కొన్నారు. టీడీపీ ప్రభుత్వం "రెడ్ బుక్ రాజ్యాంగం" పేరుతో పాలన సాగిస్తోందని ఆరోపించిన ఎమ్మెల్యే, రైతులు, ప్రజల సమస్యలను ప్రశ్నించడం తప్పు కాదన్నారు. అమరావతి పేరుతో జరుగుతున్న పరిణామాలపై రైతులకు అండగా నిలవడం వైఎస్సార్సీపీ బాధ్యత అని తెలిపారు. రైతులు, బాధితులు ఎప్పుడూ ఒంటరిగా ఉండరని, వారి పక్షాన వైఎస్సార్సీపీ ఎల్లప్పుడూ నిలబడుతుందని ఎమ్మెల్యే అన్నారు. దాడులకు భయపడకుండా ప్రజా సమస్యలపై పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు.

# గ్రామ గ్రామాన పల్స్ పోలియో కార్యక్రమం



సదాశివనగర్ మండల కేంద్రం తోపాటు భూంపల్లి, జనగాం, లింగంపల్లి, తుక్కుజివాడి, తిమ్మాజివాడి, ఉత్తనూర్, వజ్జపల్లి తండా, యాచారం తండా, సజ్జనాయక్ తాండ, పూర్వ నాయక్ తాండ, తగ్గి కల్వరాల్, పద్మా జీవడి మొదేగం, అడ్లూరు, ఎల్లారెడ్డి, మర్కల్, తిరుమన పల్లి, కుప్రియాల్ ధర్మరావుపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో ఆదివారం నిర్వహించిన పల్స్ పోలియో కార్యక్రమం విజయవంతంగా జరిగింది. మొత్తం 3,044 మంది 5 సంవత్సరాల లోపు చిన్నారులు లక్ష్యంగా ఉండగా, 96.4 కవరేజ్ సాధించి 2,934 మంది చిన్నారులకు పోలియో చుక్కలు వేయబడినాయి. ఈ కార్యక్రమంలో 80 మంది సిబ్బంది ( ఏఎన్ఎం, ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ టీచర్లు, వాలంటీర్లు), 2 సూపర్వైజర్ బృందాలు, 1 మొబైల్ టీమ్, 1 ట్రాన్సిట్ టీమ్ పాల్గొని 19 పోలియో బూత్‌ల ద్వారా సేవలు అందించారు. బూత్‌లో పోలియో చుక్కలు వేయించుకోలేకపోయిన చిన్నారులను గుర్తించి, రాబోయే 2 రోజుల పాటు ఏఎన్ఎం, ఆశా కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి పోలియో చుక్కలు వేస్తారు. ఐదు సంవత్సరాల లోపు ఏ చిన్నారి కూడా పోలియో చుక్కలు మిస్ కాకుండా తల్లిదండ్రులు పూర్తి సహకారం అందించాలని సదాశివనగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డా. అస్మా అఫ్షీన్ కోరారు. ఈ కార్యక్రమంలో హెల్త్ డిపార్ట్మెంట్ నాగరాజు, ఏఎన్ఎమ్ లు, ఆశ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

# తల్లితో పాటు ఇద్దరు పిల్లలు అదృశ్యం





వర్ని మండలం లోని సత్యనారాయణపురం గ్రామానికి చెందిన మంగలి లచ్చయ్య అను అతను పోలీస్ స్టేషన్కు వచ్చి తన భార్య మంగలి కల్పన (27) వాళ్ళ ఇద్దరు ఆడపిల్లలు మంగలి అక్షర వయసు నాలుగు సంవత్సరాలు, శ్రీవిద్య వయసు రెండు సంవత్సరాలు తేదీ 22-6-2026 మధ్యాహ్నం 2:30 నిమిషాల ప్రాంతంలో ఇంట్లో నుంచి బయటకు వెళ్లినారని ఇప్పటివరకు వారి ఆచూకీ దొరకకపోవడంతో భర్త మంగలి లచ్చయ్య వర్ని పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయడం జరిగింది.

# భీమిని పిఎస్ సి లో పోలియో చుక్కల పంపిణి



– కన్నెపల్లి భీమిని మండలం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో 5 సంవత్సరాల లోపు పిల్లలకు పల్స్ పోలియో చుక్కల కార్యక్రమాన్ని పిఎస్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ అనిల్ కుమార్,శ్రీమతి డాక్టర్ నిర్మల మేడం ప్రారంభించారు. ఈ యొక్క కార్యక్రమంలో 5 సంవత్సరాల లోపు పిల్లలు భీమిని మండలంలో మరియు కన్నెపల్లి మండలం లో కలిసి 2819 గాను2642 మంది చిన్నపిల్లలకు పోలియో చుక్కలు వేయడం జరిగింది ఇందులో కన్నెపల్లి సర్పంచ్ జయలక్ష్మి.భీమిని మండల సర్పంచులు, అంగన్వాడీ,ఆశ,వైద్య సిబ్బంది హెచ్పి ఇందిరా స్టాఫ్ నర్స్ ఫార్మసిస్ట్ హెల్త్ అసిస్టెంట్ ఉమాశంకర్ వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

# ఈనెల 30న ఎంఆర్ఓ ఆఫీస్ ల ధర్నా

**కోమటిరెడ్డి చంద్రారెడ్డి**

**జూలై 1న విబి జి రాం జి స్కీం ను రద్దు చేయాలని గ్రామీణ నిరసనలు**

**పాత పద్ధతిలోనే డెత్ కేసులు, ఉపాధి పనులు నిర్వహించాలి**

ఈనెల 30న భవన నిర్మాణ కార్మికులకు సంబంధించిన సమస్యల పరిష్కారం కోసం ఎమ్మార్వో కార్యాలయాల ముందు ధర్నాలు చేయనున్నట్లు యాదాద్రి భువనగిరి జిల్లా సిఐటియు జిల్లా అధ్యక్షులు కోమటిరెడ్డి చంద్రారెడ్డి తెలిపారు. అదేవిధంగా జూలై 1 నుండి దేశవ్యాప్తంగా అమలు కానున్న విబిజి రాంజీ స్కీమును రద్దు చేయాలని జరగనున్న గ్రామీణ నిరసనలను విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఆదివారం రోజున స్థానిక సిఐటియు కార్యాలయంలో జరిగిన భవన నిర్మాణ కార్మికుల ముఖ్య కార్యకర్తల జిల్లా సమావేశంలో చంద్రారెడ్డి పాల్గొని మాట్లాడుతూ, భవన నిర్మాణ కార్మికులకు సంబంధించిన సంక్షేమ బోర్డులో ఉన్న నిధులను రాష్ట్ర ప్రభుత్వం ప్రైవేటు ఏజెన్సీల ద్వారా దుబారా ఖర్చు చేస్తుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సిఎస్సి హెల్త్ కేర్ సెంటర్ ద్వారా చేసే హెల్త్ టెస్ట్ లను నిలుపుదల చేయాలని, 56 జీఓ సవరించి ప్రైవేట్ ఇన్సూరెన్స్ కంపెనీల ద్వారా అమలు చేసే డెత్ కేసులను తిరిగి సంక్షేమ బోర్డు ద్వారానే అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పై డిమాండ్స్ తో పాటు భవన నిర్మాణ కార్మికులకు పెన్షన్లు, వ్యక్తిగత రుణాలు, పిల్లల చదువుల కోసం స్కాలర్షిప్ లు ఇవ్వాలని ఈనెల 30న ఎమ్మార్వో ఆఫీసుల ముందు చేసే ధర్నాలలో కార్మికుల అధిక సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. అదేవిధంగా కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని రద్దుచేసి జూలై 1 నుండి కొత్తగా తెచ్చిన విబిజి రాంజీ స్కీంను దేశవ్యాప్తంగా అమలుకు పూనుకున్న నేపథ్యంలో సిఐటియు వ్యవసాయ కార్మిక సంఘం రైతు సంఘాల ఆధ్వర్యంలో




గ్రామీణ నిరసనలు చేయాలని అఖిలభారత కమిటీల పిలుపుమేరకు గ్రామీణ నిరసనలను జయప్రదం చేయాలని కార్మికులకు పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు దాసరి పండు, మాయ కృష్ణ, భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు చీమకండ్ల శ్రీరాములు, గొరిగె సోములు, ఎస్ కే శీను, మారయ్య, ప్రసాద్, ఈశ్వర్, తూటి వెంకటేష్, లింగస్వామి, సోమయ్య, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## పల్స్ పోలియో రహిత గ్రామంగా తీర్చిదిద్దేందుకు తల్లిదండ్రులు సహకరించాలి

**సర్పంచ్ అజ్మీర రాజేందర్ నాయక్**



మహబూబాబాద్ జిల్లా నర్సింహులపేట మండలంలోని గోపతండ గ్రామపంచాయతీలో ఆదివారం నిర్వహించిన పల్స్ పోలియో కార్యక్రమం విజయవంతంగా జరిగింది. గ్రామ సర్పంచ్ అజ్మీర రాజేందర్ నాయక్ చిన్నారులకు స్వయంగా పోలియో చుక్కలు వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ అజ్మీర రాజేందర్ నాయక్ మాట్లాడుతూ, "ఐదు సంవత్సరాల లోపు ప్రతి చిన్నారికి పోలియో చుక్కలు తప్పనిసరిగా వేయించి, గ్రామాన్ని పల్స్ పోలియో రహిత గ్రామంగా తీర్చిదిద్దేందుకు తల్లిదండ్రులు పూర్తి స్థాయిలో సహకరించాలి. పిల్లల ఆరోగ్య పరిరక్షణ ప్రతి కుటుంబం బాధ్యత. పోలియో నిర్మూలనలో ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను విజయవంతం చేయడం ద్వారా ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి తోడ్పడాలి" అని అన్నారు. పల్స్ పోలియో చుక్కలు వేయించడం ద్వారా పిల్లలు పోలియో వ్యాధి బారిన పడకుండా రక్షణ పొందుతారని, ఒక్క చిన్నారి కూడా మిగలకుండా ప్రతి ఒక్కరికీ పోలియో చుక్కలు వేయించాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ అజ్మీర ప్రేమిల గ్రామ సెక్రెటరీ అనురాధ , ఆశా వర్కర్, నిర్మల అంగన్‌వాడీ టీచర్, సంధ్యారాణి గ్రామంలోని ఆరోగ్య సిబ్బంది, ప్రజాప్రతినిధులు, తల్లిదండ్రులు, గ్రామస్థులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# పోలియో రహిత సమాజాన్ని నిర్మిద్దాం





**పోత్నక్ ప్రమోద్ కుమార్**

**హౌసింగ్ బోర్డ్ లో విజయవంతంగా పల్స్ పోలియో**

**సోమ మంగళవారం కూడా ఇంటింటికి వచ్చి పోలియో చుక్కలు వేయనున్న సిబ్బంది**

**తల్లిదండ్రులు తమ పిల్లల ఆరోగ్య భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని**

**పోలియో చుక్కలు వేయించాలి**

పోలియో రహిత సమాజాన్ని నిర్మిద్దామని భువనగిరి వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్, పీసీసీ ప్రధాన కార్యదర్శి, కాంగ్రెస్ పార్టీ పాలకుర్తి అబ్జర్వర్ ప్రమోద్ కుమార్ పిలుపునిచ్చారు. ఆదివారం హౌసింగ్ బోర్డ్ కాలనీ 10 వ వార్డులో కమ్యూనిటీ హాల్ వద్ద భువనగిరి మున్సిపల్ చైర్మన్ తంగళ్ళపల్లి శ్రీవాణి రవికుమార్ చిన్నారులకు పల్స్ పోలియో చుక్కలు వేసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ప్రమోద్ కుమార్ మాట్లాడుతూ, బాలల ఆరోగ్య భవిష్యత్తు కోసం ప్రతి తల్లిదండ్రులు వారి పిల్లలకు తప్పనిసరిగా పల్స్ పోలియో వేయించాలని తెలిపారు. పసిపిల్లల ఆరోగ్యంగా పెరిగితేనే సమాజం కూడా ఆరోగ్యంగా ఉంటుందన్నారు. వార్డు కౌన్సిలర్ బింగి నరేష్ మాట్లాడుతూ, ఇప్పుడే పుట్టిన శిశువు నుండి ఐదు సంవత్సరాల వయస్సు గల పిల్లలకు పల్స్ పోలియో చుక్కలు వేయించాలని తెలిపారు. బాలల వికాసానికి ప్రతి తల్లిదండ్రి కృషి చేయాలని తెలిపారు. ఆదివారం నిర్వహించిన పోలియో చుక్కల కార్యక్రమంలో అందుబాటులో లేక తమ పిల్లలకు వేయించని తల్లిదండ్రులు కంగారు పడవలసిన అవసరం లేదని, సోమ మంగళవారం వైద్య సిబ్బంది రెండు రోజులు ఇంటింటికి వచ్చి పిల్లలకు పల్స్ పోలియో చుక్కలు వేస్తారని,ఈ అవకాశాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని కౌన్సిలర్ నరేష్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ పోతంశెట్టి మంజూల వెంకటేశ్వర్లు, గుర్రాల శ్రీనివాస్, వార్డు అధ్యక్షులు మొహమ్మద్ అమానతుల్లా, 26వ వార్డ్ కౌన్సిలర్ చీమల రాజు, మహమ్మద్ ఇలియాస్, మాటూరి బాలేశ్వర సార్,ఎమ్మెస్ రెడ్డి,పాలడుగు శేఖర్, ఉదయ రాజ్, వైద్య సిబ్బంది, ఏఎన్ఎం హేమలత, నందిని, తదితరులు పాల్గొన్నారు.

# నీటి బోరును మరమత్ చేయించిన అధికారులు

**సమస్యలు పరిష్కరించిన అధికారులకు కృతజ్ఞతలు తెలిపిన తల్లిదండ్రులు , బాలల హక్కుల సంఘం నాయకులు**





భువనగిరి కేజీబీవిలో నీటి కొరత గురించి "" సమస్యల వలయాల్లో సరస్వతి నిలయాలు"" పేరుతో ఈనెల 26 శుక్రవారం సూర్య వెలుగు తెలుగు దినపత్రికలో వచ్చిన వార్తకు జిల్లా కలెక్టర్, భువనగిరి మున్సిపల్ అధికారులు స్పందించారు. యాదాద్రి భువనగిరి జిల్లా అదనపు కలెక్టర్ భాస్కర్ రావు శుక్రవారం కేజీ బీవీ పాఠశాలను సందర్శించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మున్సిపల్ వాటర్ ట్యాంకర్ ద్వారా నీటిని సరఫరా చేయాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. పాఠశాల ఆవరణలో చెడిపోయిన బోరును వెంటనే మరమత్తులు చేయించాలని పాఠశాల స్పెషల్ ఆఫీసర్ చంద్రకళ ను ఆదేశించారు. ఆదివారం భువనగిరి కేజీ బీవీ పాఠశాల ప్రత్యేక అధికారి చంద్రకళ, కాలిపోయిన బోరుకు మరమత్తులు చేయించారు. భువనగిరి మున్సిపాలిటీ లోని హుస్సేనాబాద్ మున్సిపల్ కౌన్సిలర్ మర్రి పాండు యాదవ్ చొరవతో మున్సిపల్ కమిషనర్ చంద్ర ప్రకాష్ రెడ్డి, భువనగిరి కేజీ బీవీ పాఠశాల,కళాశాలకు 24 గంటలు నీటిని అందించుటకు కుళాయిని ఏర్పాటు చేయుటకు కృషి చేశారు. ఈ సందర్భంగా భువనగిరి కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయం విద్యార్థుల తల్లిదండ్రులు, బాలల హక్కుల సంఘం నాయకులు, జిల్లా కలెక్టర్, భువనగిరి మున్సిపల్ అధికారులకు, సూర్య వెలుగు తెలుగు దినపత్రికకు కృతజ్ఞతలు తెలిపారు.

# నిండు జీవితానికి రెండు చుక్కలు

**చిన్నారులకు పోలియో చుక్కలు వేసిన ఎమ్మెల్యే కె.ఆర్. నాగరాజు**



వర్ధన్నపేట నియోజకవర్గంలోని మడికొండ మండల కేంద్రంలో నిర్వహించిన పల్స్ పోలియో కార్యక్రమంలో ఆదివారం స్థానిక ఎమ్మెల్యే,విశ్రాంత ఐపీఎస్ అధికారి కె.ఆర్. నాగరాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు చిన్నారులకు ఆయన పల్స్ పోలియో చుక్కలు వేశారు. అనంత ఆయన మాట్లాడుతూ ఐదేళ్ల లోపు బాల బాలికలకు తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని సూచించారు. వైద్య సిబ్బంది ఈ నెల 29, 30 తేదీలలో ఇంటింటికి తిరిగి పోలియో చుక్కలు వేయాలన్నారు. 66వ డివిజన్ లో పల్స్ పోలియో చుక్కలు వేసిన డివిజన్ అధ్యక్షులు కె.కిరణ్ 66వ డివిజన్ అధ్యక్షుడు కనిపర్తి కిరణ్ ప్రభుత్వ ఆసుపత్రుల్లో చిన్నారులకు పల్స్ పోలియో చుక్కలు వేశారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు కిరణ్ తో పాటు, స్థానిక కాంగ్రెస్ సీనియర్ నాయకులు వీసం సురేందర్ రెడ్డి, జన్ను రవీందర్, పుల్లా రవీందర్, ఆరెల్లి వెంకటస్వామి, తాళ్ల మధు, కోడల మురళి, సాయిని రామరాజు వైద్య ఆరోగ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# భారత ఆర్థిక సంస్కరణల పితామహుడు భారతరత్న పీవి

**హనుమకొండ డీసీసీ భవన్లో ఘనంగా 105వ జయంతి వేడుకలు**

**ఘనంగా భారత మాజీ ప్రధాని 'భారతరత్న' పి.వి. నరసింహారావు 105వ జయంతి వేడుకలు**

**నివాళులు అర్పించిన డీసీసీ అధ్యక్షులు ఇనగాల, ఎమ్మెల్యే నాయిని, కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్**

**జేఎన్ఎస్ స్టేడియం కూడలిలోని పి.వి. విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించిన నేతలు, అధికారులు**

భారతదేశ ఆర్థిక సంస్కరణల పితామహుడు, బహుభాషా కోవిదుడు, భారత మాజీ ప్రధానమంత్రి, 'భారతరత్న' స్వర్గీయ పి.వి. నరసింహారావు 105వ జయంతి వేడుకలను ఆదివారం హనుమకొండ జిల్లాకేంద్రంలో ఘనంగా నిర్వహించారు. హనుమకొండ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు ఇనగాల వెంకట్రామ్ రెడ్డి ఆధ్వర్యంలో ఈ వేడుకలు అత్యంత వైభవంగా జరిగాయి. మొదటహనుమకొండలోని జిల్లా కాంగ్రెస్ కమిటీ ప్రధాన కార్యాలయంలో డీసీసీ అధ్యక్షులు ఇనగాల వెంకట్రామ్ రెడ్డి,వరంగల్ వెస్ట్ శాసనసభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి, నాయకులతో కలిసి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం కార్యాలయంలో ఏర్పాటు చేసిన పి.వి. నరసింహారావు చిత్రపటానికి నాయకులతో కలిసి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఆ తరువాత, హనుమకొండ జె.ఎన్.ఎస్ స్టేడియం కూడలిలో ఉన్న పి.వి. నరసింహారావు విగ్రహం వద్దకు చేరుకుని, ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ దేశం తీవ్ర ఆర్థిక సంక్షోభంలో ఉన్న తరుణంలో పి.వి. నరసింహారావు ప్రధానమంత్రిగా బాధ్యతలు చేపట్టి, ప్రవేశపెట్టిన ఆర్థిక సంస్కరణల వల్లే నేడు భారతదేశం ప్రపంచంలోనే బలమైన ఆర్థిక వ్యవస్థగా నిలిచిందని కొనియాడారు. తెలంగాణ ముద్దుబిడ్డగా, దేశ గమనాన్ని మార్చిన ధీశాలిగా ఆయన సేవలు చిరస్మరణీయమని, అలాంటి మహోన్నత నాయకుడికి కేంద్ర ప్రభుత్వం 'భారతరత్న' పురస్కారంతో గౌరవించుకోవడం మనందరికీ గర్వకారణమని పేర్కొన్నారు.



# వీణానాదంతో మారుమ్రోగిన స్వర్ణగిరి

**సరయు మ్యూజిక్ అకాడమీ వారి వీణానాదం**

**150 మంది వీణా కళాకారుల చే వీణానాధమృతం**

**అన్నమయ్య కీర్తనలతో ఆధ్యాత్మిక ఆనందంలో భక్తులు**

భువనగిరిలోని స్వర్ణ గిరి ఆదివారం వీణ నాదంతో మారు మ్రోగింది. ప్రముఖ వైష్ణవ పుణ్యక్షేత్ర మైన స్వర్ణగిరి శ్రీ వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో ఆదివారం స్వామివారి నిత్య కైంకర్యములలో భాగంగా, స్వామివారి కల్యాణ మండపంలో స్వామివారి కళ్యాణం ముగిసిన అనంతరం శ్రీ వెంకట అన్నమాచార్య సేవా ట్రస్ట్ వారి ఆధ్వర్యంలో సరయు మ్యూజికల్ అకాడమీ వారు నిర్వహించిన వీణా నాధమృతం భక్తులను అత్యంత ఆధ్యాత్మిక ఆనందంలో ముంచేసింది. 150 మంది వీణా కళాకారులు ఏకకాలంలో వీణ మీటుతూ శ్రీ వెంకటేశ్వర స్వామి వారికి దివ్య సామూహిక స్వరార్చనను సమర్పించడం జరిగింది. అన్నమాచార్య కీర్తనలు, దివ్య కీర్తనాలతో మార్మోగిన మానేపల్లి హిల్స్ ఈ సంగీత సేవను తిలకించిన భక్తులు స్వామివారి అనుగ్రహాన్ని పొందగా, వీణానాదంతో కళ్యాణ మండపం భక్తి రసంతో నిండిపోయింది. ఈ సందర్భంగా స్వర్ణగిరి ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త చైర్మన్ మానేపల్లి మురళీ కృష్ణ సంగీత సంగీత కళాకారులను శాలువాల తో ఘనంగా సత్కరించి స్వామివారి ప్రసాదాన్ని అందజేశారు.



## భద్రకాళి అమ్మవారిని దర్శించుకున్న టీజీపీఎస్ చైర్మన్ బుర్ర వెంకటేశం దంపతులు



వరంగల్ మహానగరంలో చరిత్ర ప్రసిద్ధిగాంచిన శ్రీ భద్రకాళీ దేవస్థానమును ఆదివారం రోజు ఉదయం తెలంగాణా పబ్లిక్ సర్వీస్ కమీషన్ చైర్మన్ బుర్రా వెంకటేశం, ఐ.ఏ.ఎస్ కుటుంబ సమేతంగా సందర్శించారు. ఆలయానికి విచ్చేసిన బుర్రా వెంకటేశంకు ఆలయ అధికారులు, అర్చకులు పూర్ణకుంభం, మంగళవాద్యాలతో ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహింపజేశారు. పూజానంతరం ఆలయ మహామండపంలో మహదాశీర్వచనం నిర్వహించి అమ్మవారి శేషవస్త్రములు బహూకరించి ప్రసాదములు అందజేశారు. అనంతరం కాకతీయ పట్టణాభివృద్ధి సంస్థ చైర్మన్ ఇనుగాల వెంకట్రాంరెడ్డి సందర్శించి అమ్మవారిని దర్శించుకున్నారు. పూజానంతరం అమ్మవారి శేషవస్త్రములు బహూకరించి ప్రసాదములు అందజేశారు. నిన్న సెలవు దినం (ఆదివారం) కూడా కావడంతో దేవాలయమునకు భక్తులు పోటెత్తారు.

## సిరోలు సబ్‌సెంటర్‌లో పల్స్ పోలియో కార్యక్రమం ప్రారంభం



సిరోలు మండలసబ్‌సెంటర్‌లో పల్స్ పోలియో కార్యక్రమం పురస్కరించుకుని చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ అనిశెట్టి పున్నంచందర్, ఎంపీడీవో ఎం.డి. గౌస్, వైద్యాధికారి డాక్టర్ గుగులోతు నరేష్ పాల్గొని చిన్నారులకు పోలియో చుక్కలు వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ, ఐదేళ్లలోపు ప్రతి చిన్నారికి తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని, పోలియో నిర్మూలనకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు.

## సీరోల్‌లో పల్స్ పోలియో కార్యక్రమం ప్రారంభం..

### ప్రతి చిన్నారికి పోలియో చుక్కలు వేయించాలని పిలుపు



– సీరోల్ గ్రామంలో ఆదివారం పల్స్ పోలియో కార్యక్రమాన్ని గ్రామ సర్పంచ్ శ్రీమతి అనుమంతుల రమణ చిన్నారులకు పోలియో చుక్కలు వేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఐదేళ్లలోపు ప్రతి చిన్నారికి తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించి పోలియో రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. తల్లిదండ్రులు తమ పిల్లలను సమీపంలోని పోలియో కేంద్రాలకు తీసుకువచ్చి చుక్కలు వేయించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ సిబ్బంది, వైద్య సిబ్బంది, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## సిరోలులో ఎస్ఐఆర్ ప్రక్రియను పరిశీలించిన తహసీల్దార్

సిరోలు మండల కేంద్రంలోని పోలింగ్ బూత్ నంబర్183లో ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమాన్ని తహసీల్దార్ పరిశీలించారు. ఈ సందర్భంగా బూత్ స్థాయి అధికారి నాగమణి ఇంటింటికి గణన ఫారాలను పంపిణీ చేసి, ఓటర్లు నింపిన ఫారాలను తిరిగి సేకరిస్తున్న విధానాన్ని పరిశీలించారు. అలాగే సేకరించిన వివరాలను బీఎల్ఓ యాప్‌లో ఆన్‌లైన్ ద్వారా అప్‌లోడ్ చేస్తున్న ప్రక్రియను కూడా తనిఖీ చేశారు. ఎస్ఐఆర్ కార్యక్రమంలో ఓటరు ఫారం నింపిన అనంతరం దానికి జత చేయాల్సిన అవసరమైన ధ్రువపత్రాల గురించి బూత్ స్థాయి అధికారులకు తహసీల్దార్ సవివరంగా వివరించి, తగు సూచనలు జారీ చేశారు.

## స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఘనంగా పల్స్ పోలియో

### ఐదేళ్లలోపు పిల్లలందరికీ చుక్కలు వేయించాలి

### వైద్యాధికారి డాక్టర్ డేవిడ్ పిలుపు



ఇందుకూరుపేట స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నందు ఆదివారం పల్స్ పోలియో వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. వైద్యాధికారి డాక్టర్ డేవిడ్ పర్యవేక్షణలో ఈ కార్యక్రమం విజయవంతంగా కొనసాగింది. ఈ కార్యక్రమానికి స్థానిక కూటమి నాయకులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. వారు ఆరోగ్య కేంద్రానికి వచ్చిన చిన్న పిల్లలకు స్వయంగా పోలియో చుక్కలు వేసి, ఈ బృహత్తర కార్యక్రమాన్ని అధికారికంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా కూటమి నాయకులు మాట్లాడుతూ. సమాజ ఆరోగ్య పరిరక్షణలో ప్రభుత్వం తీసుకుంటున్న ఇలాంటి కార్యక్రమాలకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. ఈ సందర్భంగా వైద్యాధికారి డాక్టర్ డేవిడ్ మాట్లాడుతూ. దేశాన్ని పోలియో రహితంగా ఉంచేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. సున్నా నుండి ఐదేళ్ల లోపు వయసున్న ప్రతి బిడ్డకూ తల్లిదండ్రులు తప్పనిసరిగా పల్స్ పోలియో చుక్కలు వేయించాలి. గతంలో పోలియో మహమ్మారి ఎందరో చిన్నారుల భవిష్యత్తును అంధకారం చేసింది. భవిష్యత్తు తరాలు ఆరోగ్యంగా ఉండాలంటే ఈ వ్యాక్సినేషన్ ఎంతో కీలకం అని అయన అన్నారు. కార్యక్రమంలో డాక్టర్ క్రాంతి సౌజన్య, తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షులు గోళ్ళ చంటిబాబు, జనసేన మండల అధ్యక్షులు చారపు వెంకటరాయుడు, బిజెపి మండల అధ్యక్షులు కారం రామన్న దొర, సొసైటీ అధ్యక్షులు మాగపు బాబురావు, క్లస్టర్ ఇంచార్జి ముచ్చు వీర వెంకట సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి కీర్తికి గంగరాజు, నియోజకవర్గ బీసీ సెల్ ఉపాధ్యక్షులు రేలంగి రాంబాబు, ప్రధాన కార్యదర్శి అయినాల వెంకటేశ్వర్లు, రాష్ట్ర మాజీ తెలుగు యువత కార్యదర్శి చావలం శివరామకృష్ణ , మాజీ అధ్యక్షులు పడమటి లక్ష్మణరావుగౌడ్ , కొత్తపల్లి సత్యనారాయణ, ఎంపీహెచ్ఈఓ కె. శ్రీనివాస్ దొర, ఎంపీ హెచ్ ఎస్ బి. నాగేశ్వరరావు, పి హెచ్ ఎన్ ఆర్. విజయలక్ష్మి,ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, స్థానిక ప్రజలు మరియు పెద్ద సంఖ్యలో తల్లులు తమ చిన్నారులతో పాల్గొన్నారు.



## పోలియో నిర్మూలనకు అందరి భాగస్వామ్యం అవసరం

### ప్రతి చిన్నారికి పోలియో చుక్కలు తప్పనిసరి

### టిడిపి సీనియర్ నేత కప్పట్రాళ్ల మల్లికార్జున



మండల పరిధిలోని కప్పట్రాళ్ల గ్రామ సచివాలయం నందు ఆదివారం పల్స్ పోలియో కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా తెదేపా నాయకుడు కప్పట్రాళ్ల మల్లికార్జున హాజరై చిన్నారులకు పోలియో చుక్కలు వేయించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కప్పట్రాళ్ల మల్లికార్జున మాట్లాడుతూ దేశ భవిష్యత్తు చిన్నారుల ఆరోగ్యంపైనే ఆధారపడి ఉంటుందని, ప్రతి ఐదేళ్లలోపు చిన్నారికి తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని తల్లిదండ్రులకు సూచించారు. పోలియో వంటి ప్రమాదకర వ్యాధిని పూర్తిగా నిర్మూలించేందుకు ప్రభుత్వం చేపడుతున్న పల్స్ పోలియో కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ విజయవంతం చేయాలని పిల్లల తల్లిదండ్రులను కోరారు. చిన్నారుల ఆరోగ్య పరిరక్షణలో తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలని, ఆరోగ్యవంతమైన బాలలే సమాజ అభివృద్ధికి బలమైన పునాది అవుతారని అన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు సందు పాలెం లాలప్ప, పెద్ద కౌలుట్లయ్య, కౌలుట్ల,సుంకన్న, రవికుమార్, రాముడు, గిడ్డయ్య, వైద్య సిబ్బంది, డాక్టర్ వెంకటేశ్వర్లు, ఏఎన్ఎం సరస్వతి, ఆశా కార్యకర్త తిమ్మక్క, అంగన్‌వాడీ సిబ్బంది లక్ష్మీదేవి, వేరేశమ్మ గ్రామ సచివాలయ సిబ్బంది, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## తిరుమలలో గర్భగుడి తలుపులు తెరిచాక... శ్రీవారి తొలి దర్శనం చేసుకునేది ఆయనే!

కోట్లాది మంది ఆరాధించే తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామిని ప్రతిరోజూ ఉదయం తొలిసారిగా దర్శించుకునే భాగ్యం ఎవరికి దక్కుతుంది? ఆ గౌరవం ఏ వీఐపీకో, ఉన్నతాధికారికో, ప్రధాన అర్చకుడికో కాదు... యాదవ వంశానికి చెందిన ఓ సామాన్య భక్తుడికి లభిస్తుంది. శతాబ్దాలుగా కొనసాగుతున్న ఈ సాంప్రదాయంలో భాగంగా, ఆయన్ను 'సన్నిధి గొల్ల' అని గౌరవంగా పిలుస్తారు. ప్రతిరోజూ తెల్లవారుజామున సుమారు 2:30 గంటల సమయంలో శ్రీవారి ఆలయ తలుపులు తెరుస్తారు. ఆలయ ప్రధాన అర్చకులు, పేష్కార్, జియ్యంగార్ స్వామి తమ దగ్గరున్న మూడు వేర్వేరు తాళాలతో గర్భగుడికి ముందుండే బంగారు వాకిలిని తెరుస్తారు. అయితే, వారెవరూ లోపలికి ప్రవేశించరు. వారి అనుమతితో మొదటగా 'సన్నిధి గొల్ల' గర్భగుడిలోకి అడుగుపెడతారు. చిమ్మ చీకటిలో ఉన్న స్వామివారి ముందు ఆయన దీపం వెలిగిస్తారు.

## ఉప్పుల రమేష్ పదవీ విరమణ

### శుభాకాంక్షలు తెలిపిన బాల్య మిత్రులు, శ్రేయోభిలాషులు



హనుమకొండ జిల్లా హసన్పర్తి మండల కేంద్రానికి చెందిన ఇరిగేషన్ డిపార్ట్మెంట్ నర్సంపేట డివిజన్ లో వర్క్ ఇన్స్పెక్టర్ గా పనిచేసిన ఉప్పుల రమేష్ ఆదివారం రోజు పదవి విరమణ చేశారు. ఈ సందర్భంగా బాల్య మిత్రులు, శ్రేయోభిలాషులు ఉప్పుల రమేష్ దంపతులకు బొకే అందించి, శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కందుకూరి చంద్రమోహన్ మాట్లాడుతూ పదవీ విరమణ అనేది కేవలం ఉద్యోగానికి మాత్రమే అని వారి అనుభవాలు, అమూల్యమైన సేవలు సమాజానికి అందించాలని, వారి శేష జీవితం ఆనందో త్సాహాలతో కొనసాగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కందుకూరి చంద్రమోహన్, పిట్టల కుమారస్వామి, రేబెల్లి ప్రకాష్, నాగమళ్ళ సుధీర్, వీసం కరుణాకర్ రెడ్డి, గౌరిశెట్టి కృష్ణమూర్తి, లక్ష్మణ్, కాసుల రవిశంకర్, బరుపటి జగదీశ్వర్, పొన్నోజు రాజుకుమార్, తాళ్ల సతీష్, గోపరాజు కుమారస్వామి, సంద్రు నాగేందర్, బండి వెంకటేశ్వర్లు, విష్ణుదాస్ రాజేందర్, అల్లెంకి శ్రీనివాస్, ఆరూరి సురేష్, దోమల శంకర్, పొన్నోజు శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## పోలియో రహిత సమాజాన్ని నిర్మించాలి

### - డాక్టర్ అనిత



పోలియో రహిత సమాజం నిర్మాణానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని ఎస్.ఆర్.ఆర్.తోట వైద్యధికారి అనిత అన్నారు. ఆదివారం ఎస్.ఆర్.ఆర్. తోట పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పల్స్ పోలియో కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్.అనిత మాట్లాడుతూ యూ పీ హెచ్ సి పరిధిలో 0–5 పిల్లలు 15 బూతులు ఏర్పాటు చేయడం జరిగిందని 3,530 మంది పిల్లలకు 98 శాతం పోలియో చుక్కలు వేయించనున్నట్లు పేర్కొన్నారు. అదనంగా ఒక మొబైల్ బూత్ కూడా ఏర్పాటు చేసినట్లు ఆమె వివరించారు. ఈ కార్యక్రమంలో రామ రాజేష్ ఖన్నా ,ఫార్మసీ ఆఫీసర్ నూకల అంజి యాదవ్,నర్సింగ్ ఆఫీసర్ మేకల మంజుల, పిల్లలు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## నిండు జీవితానికి రెండుచుక్కలు

### కౌన్సిలర్ బర్రె పూజిత జహంగీర్

### 2014 తర్వాత దేశంలో నమోదు కాని పోలియో కేసులు

### కలుషిత నీటితో నాడీ వ్యవస్థకు దెబ్బ

### పోలియో వైరస్ వల్ల వచ్చే వ్యాధి

### వ్యాక్సిన్ ఒక్కటే పోలియోకి నివారణ

### తల్లిదండ్రులు తప్పనిసరిగా పిల్లలకు పల్స్ పోలియో వేయించాలి



నిండు జీవితానికి పల్స్ పోలియో చుక్కలు రెండువేసి మీ పిల్లల ఆరోగ్య జీవితానికి బాటలు వేయాలని 23వ వార్డు కౌన్సిలర్ బర్రె పూజిత జహంగీర్ విజ్ఞప్తి చేశారు. దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న పల్స్ పోలియో కార్యక్రమంలో భాగంగా యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రంలోని 23వ వార్డు ఇందిరానగర్‌లోని బోయవాడ ప్రాథమిక పాఠశాలలో ఆదివారం పల్స్ పోలియో కార్యక్రమాన్ని స్థానిక కౌన్సిలర్ బర్రె పూజిత, భువనగిరి మున్సిపల్ మాజీ చైర్మన్ బర్రె జహంగీర్ లు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, పోలియో వైరస్ వల్ల వచ్చే పోలియో వ్యాధి కలుషిత నీటి ద్వారా శరీరంలోకి ప్రవేశించి నాడీ వ్యవస్థపై తీవ్ర ప్రభావం చూపుతుందని, దీనికి చికిత్స లేదని, వ్యాక్సిన్ తీసుకోవడమే ఏకైక రక్షణ మార్గమని తెలిపారు. 2014 తర్వాత దేశంలో ఒక్క పోలియో కేసు కూడా నమోదు కాకపోవడం గర్వకారణమే అయినప్పటికీ, ప్రజలు ఏమాత్రం నిర్లక్ష్యం చేయరాదని సూచించారు. ఐదేళ్లలోపు ప్రతి చిన్నారికి తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని, నిండు జీవితానికి రెండు చుక్కలే కీలకం అని పేర్కొన్నారు. తల్లిదండ్రులు ఎంత ముఖ్యమైన పనిలో ఉన్నా పల్స్ పోలియో కార్యక్రమాన్ని మర్చిపోవద్దని, తమ పిల్లలను సమీప పోలియో కేంద్రాలకు తీసుకువచ్చి రెండు చుక్కలు వేయించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వార్డు ప్రముఖులు బండారు రవివర్ధన్, ఎండి అఖిల్, గోపిబాబు, బర్రె క్రాంతి, కసరబోయిన సాయి కుమార్, ఎడ్ల భరత్, గోపి నవీన్ తదితరులు, పోలియో సిబ్బంది పాల్గొన్నారు.

printed and published by M.Mahesh babu on behaly of m/s mahesh publications # 13-36A, Nelliveedhi, Nandyal District, Nadyal printed at sai Aishwayam Apartment, Near Bharatha Matha Temple B-Block, Flat no 105, Tekke, Nandyal (Dist) AP pin-code 518501 GST No:-37ACDFM5465G1Z1 EDITOR; Mahesh Babu RNI No: Aptel/2023/88162 Phone No 9849499960,9059696959 Email id: Nandi patrika @gmail.com